THAILAND PACKAGE
With 1N SRILANKA FREE
GROUP DEPARTURE ON 25FEB'18
INR 28,999* Per Person.
Above cost includes: 4Nights / 5Days
Airfare ex Hyderabad on Srilankan Airlines / Airport Taxes.
Airport transfers / 2N Pattaya - 1N Bangkok - 1N Negambo
Stay in 3* Hotel with Breakfast / Coral island tour with lunch
City tour of Bangkok / City tour of Colombo.
*Terms and conditions apply:
Booking First come basis only / Govt Taxes extra.
Visa charges extra / Rates are subject to change.
Contact us @ Hyd office : 040 23311495 / 9553304546.
SriLankan Holidays

ఆంధ్రభూమి

SRILANKA PACKAGE
INR 24,999* Per person.
Above cost includes:
Airfare ex HYD on Srilankan Airlines / Current Taxes / Visa charges.
Stay for 2Nights in 3* hotel with Breakfast / Airport Transfers.
City tour of Colombo.
*Terms & Conditions Apply:
Valid for booking before 15FEB Only / Travel till 30JUNE.
Govt Taxes extra / Visa charges extra.
Contact us @ Hyd office : 040 23311495 / 9553304546.
SriLankan Holidays A world of memories

సంపుటి: 29 . సంచిక: 251 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శనివారం 10 ఫిబ్రవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

సభలో ఆగని రభస



లోక్‌సభలో పోడియం వద్ద నిరసన తెలుపుతున్న ఆంధ్రప్రదేశ్ ఎంపీలు

- నిరసనల పట్టువీడని ఏపీ
- పార్లమెంట్‌లో గందరగోళం
- ప్లకార్డులతో నినాదాలు
- హామీలు నెరవేర్చాలంటూ డిమాండ్
- ఇంటా బయటా ఎంపీల గగ్గోలు
- రాజ్యసభలో వెంకయ్య ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్ విభజన హామీల అమలుకోరుతూ పార్లమెంట్‌లో రాష్ట్ర ఎంపీలు వరుసగా నాలుగోరోజూ నిరసన కొనసాగించారు. శుక్రవారం తెదేపా, వైకాపా, కాంగ్రెస్ ఎంపీలు వివిధ రూపాల్లో పార్లమెంట్ లోపల, బయటా ఆందోళన కొనసాగించారు. విభజన హామీల అమలు, కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంట్ ఆవరణలో తెదేపా ఎంపీలు నిరసన కొనసాగించారు. ముందుగా పార్లమెంట్ అవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ ఎంపీలు ప్లకార్డులు చేత పట్టుకొని నిరసన తెలిపారు. అయితే వినూత్న వేషధారణలో ఎంపీ శివప్రసాద్ పార్లమెంట్‌లో నిరసన తెలిపారు. ఎంపీ శివప్రసాద్ పోతురాజు వేషధారణలో కింద కూర్చుని నిరసన తెలుపే సమయంలో పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రజలను మోసం చేయడమే కాకుండా తిరుపతి వెంకటేశ్వర స్వామిని, బెజవాడ కనకదుర్గమ్మనూ మోసం చేశారంటూ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని ఇచ్చిన హామీలన్నింటినీ ఇప్పుడు మర్చిపోయారా? అని ప్రశ్నించారు. తిరుపతి వెంకన్నను మోసం చేస్తే ఇబ్బందులు తప్పవని ప్రధానిని పరోక్షంగా శివప్రసాద్ హెచ్చరించారు. మరోవైపు వైకాపా ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి,అవినాశ్‌రెడ్డి, వరప్రసాద్‌లు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద నిలబడి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

ఎంపీలపై వెంకయ్య ఆగ్రహం

ఆంధ్రప్రదేశ్ విభజన హామీలు అమలు చేయాలని, బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయాన్ని సరిచేయాలంటూ రాష్ట్రానికి చెందిన ఎంపీల నిరసనలతో శుక్రవారం వరసగా రాజ్యసభ రెండుసార్లు వాయిదాపడింది.

రాష్ట్రానికి చెందిన తెదేపా ఎంపీలు సిఎం రమేష్, గరికపాటి రామ్మోహన్‌రావు, టీజీ వెంకటేష్, తోట సీతారామలక్ష్మి, కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డిలు రాజ్యసభలో తమ నిరసనలను వరసగా నాలుగోరోజూ కొనసాగించారు. ముందుగా శుక్రవారం రాజ్యసభ ప్రారంభం కాగానే వివిధ మంత్రిత్వ శాఖల, వివిధ కమిటీల నివేదికలను సభకు సమర్పించిన అనంతరం సభ్యులు జీరో అవర్‌ను కొనసాగించాలని చైర్మన్ వెంకయ్యానాయుడిని కోరారు. ఈ పరిస్థితులలో రాష్ట్రానికి చెందిన ఎంపీలు సిఎం రమేష్, తోట సీతారామలక్ష్మి, టీజీ వెంకటేష్, కేవీపీలు పోడియం వద్దకొచ్చి ఏపీకి న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. పోడియం వద్దకొచ్చి ఆందోళనకు దిగడం సరైన విధానం కాదంటూ చైర్మన్ వెంకయ్య ఏపీ ఎంపీలను హెచ్చరించారు. అదే సమయంలో ప్రధాని నరేంద్రమోదీ రాజ్యసభలో ఇటీవల కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరిపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించటంతో ఒక్కసారిగా సభలో గందరగోళం తలెత్తింది. ఇలా అయితే సభను నడిపించటం కష్టమని, వాయిదా వేయాల్సి ఉంటుందని హెచ్చారిస్తూ సభను గంటపాటు వాయిదా వేసి వెళ్లిపోయారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కాగానే యథాతథంగానే ఏపీ ఎంపీలు పోడియం వద్ద నిరసన కొనసాగించారు. చైర్మన్ వెంకయ్యానాయుడు ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రయోజనం లేకపోవడంతో, మరోసారి సభను మధ్యాహ్నం 2.30కు వాయిదావేసి వెళ్లిపోయారు. మధ్యాహ్నం ప్రారంభమైన సభలోనూ తెదేపా ఎంపీలు నిరసనకు దిగి సాయంత్రం వరకూ కొనసాగించారు. తెదేపా ఎంపీలు పట్టినపట్టు విడవకుండా నిరసన కొనసాగించటంతో, వాళ్లకు సిపిఐ ఎంపీ డి రాజా,కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్‌లు సంఘీభావం తెలిపారు. ఏపీకి విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.



రాజ్యసభలో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ఏదీ వదలం అన్నీ చేస్తాం

రాజ్యసభలోనూ జైట్లీది పాత పాటే

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పోలవరం నిర్మాణ పనులు నిరంతరంగా కొనసాగుతాయి. పోలవరం పనులు ఏ దశలోనూ ఆగనిచ్చేది లేదు అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో ప్రకటించారు. శుక్రవారం రాజ్యసభలో 2018-19 వార్షిక బడ్జెట్‌పై జరిగిన చర్చకు జైట్లీ బదులిస్తూ ఏపీ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. ప్రత్యేక హోదాకు బదులుగా ఇస్తున్న ప్రత్యేక ఆర్థిక సాయాన్ని నాబార్డ్ ద్వారా ఎలా ఇప్పించాలనే అంశంపై జరుగుతున్న చర్చలు కీలక దశకు చేరుకున్నాయి అని ఈ సందర్భంగా ప్రకటించారు. దీనిపై అతి త్వరలోనే ఒక నిర్ణయం ప్రకటిస్తామని జైట్లీ స్పష్టం చేశారు. గతంలో ఈ సాయాన్ని విదేశీ రుణాల నుంచి ఇచ్చే వారని, అయితే రుణాలు మంజూరీలో ఆలస్యం అవుతున్నందున వాటిని నాబార్డ్ ద్వారా ఇప్పించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించారని గుర్తు చేశారు. ఈ అంశంపై చర్చలు దాదాపుగా పూర్తయ్యాయని, త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తామని జైట్లీ వెల్లడించారు. 2014-15 సంవత్సరానికి సంబంధించిన పది నెలల రెవెన్యూ లోటులో ఇప్పటికే 3979 కోట్లు రాష్ట్రానికి చెల్లించామన్నారు. తుది మొత్తం ఎంత ఇవ్వాలనే అంశంపై ఇరు పక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయని - మిగతా 6వ పేజీలో

కదిలిన సర్కారు

హైకోర్టు బెంచి ఏర్పాటుపై బాబు దృష్టి • సీమ న్యాయవాదుల్లో ఒకింత ఆశ

ఆంధ్రభూమి బ్యూరో



కర్నూలులో న్యాయవాదుల ఆందోళన (ఫైల్)

కర్నూలు, ఫిబ్రవరి 9: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులంతా ఏకతాటిపై చేపట్టిన ఉద్యమంపై ప్రభుత్వంలో కదలిక ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయం చేయలేదని పార్లమెంటులో టీడీపీ సభ్యులు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో రాయలసీమ న్యాయవాదుల డిమాండ్‌పై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించినట్లు అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు గత 15 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం హైకోర్టు ఏర్పాటు చేయడం సాధ్యం కాదని, అయితే రాయలసీమలో హైకోర్టు బెంచి ఏర్పాటు చేసే అంశంపై దృష్టి సారించినట్లు తెలిసింది. దీనిపై ముఖ్యమంత్రి న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం హైకోర్టులో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించిన కేసుల వివరాలను తనకు ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ కేసుల ఆధారంగా బెంచి ఏర్పాటు సాధాసాధ్యాలపై సమీక్షించి సాధ్యమయ్యే అవకాశం ఉంటే బెంచి ఏర్పాటుపై సుప్రీం అనుమతి కోరే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీనికి సుప్రీం కోర్టు సానుకూలంగా స్పందిస్తే అందుకు అవసరమైన ఇతర చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాల్సి ఉంటుందని న్యాయవాదుల ద్వారా తెలిసింది. సుప్రీం కోర్టు, కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తే రాయలసీమ జిల్లాల్లో ఎక్కడ వీలైతే అక్కడ బెంచి ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని వారంటున్నారు. కాగా సీనియర్ న్యాయవాదుల అంచనా ప్రకారం రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పెండింగ్ కేసులు బెంచికి బదలాయిస్తే సాధ్యమవుతుందని, కేవలం రాయలసీమలోని నాలుగు జిల్లాల కేసులు మాత్రమే బదిలీ చేయాల్సి వస్తే బెంచి ఏర్పాటుకు సుప్రీం కోర్టు అంగీకరించకపోవచ్చని భావిస్తున్నారు. హైకోర్టులో నాలుగు జిల్లాలకు సంబంధించి బెంచి ఏర్పాటుకు అవసరమైనన్ని కేసులు లేవని వారు అభిప్రాయపడుతున్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల కేసులను కూడా పరిగణలోకి తీసుకుంటే అంగీకరించే అవకాశం ఉందని, అయితే ఈ జిల్లాల్లోని న్యాయవాదులు అమరావతి నుండి రాయలసీమకు కేసుల బదలాయింపును అంగీకరించకపోవచ్చని వారు అనుమానిస్తున్నారు. హైకోర్టు, రాజధాని వారికి సమీప ప్రాంతంలో ఉండడమే ఇందుకు కారణమని వెల్లడిస్తున్నారు. రాజధాని అమరావతిలో, హైకోర్టు బెంచి రాయలసీమలో ఉంటే ఇబ్బందులు ఉంటాయని అక్కడి న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారని, దీని కారణంగా తమ కేసులు అమరావతిలోని హైకోర్టులోనే విచారించాలని వారు పట్టుబట్టే అవకాశం ఉన్నట్లు సీనియర్ న్యాయవాది ఒకరు తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఆరు జిల్లాల కేసుల వివరాలను తెప్పించిన అనంతరం ఏం జరుగబోతుందో తెలుస్తుందని ఆయన అన్నారు.

పురపాలిక ప్యాకేజీ!

110 మున్సిపాలిటీలకు రూ.11 వేల కోట్లు

మౌలిక సదుపాయాల కల్పనపై మంత్రి నారాయణ



కర్నూలు జిల్లా నంద్యాలలో మాట్లాడుతున్న మున్సిపల్ మంత్రి నారాయణ

నంద్యాల, ఫిబ్రవరి 9: రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీల్లో నాలుగు రకాల మౌళిక సదుపాయాలు కల్పించేందుకు రూ.11 వేల కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, నెల రోజుల్లో ఈ పథకం అమలులోకి వస్తుందన్నారు. కర్నూలు జిల్లా నంద్యాలలో శుక్రవారం అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీలు, వాటి శివారు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న కాలనీల్లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కొత్త ప్రణాళిక రూపొందించిందని అన్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో కచ్చా రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, పార్కుల అభివృద్ధి కోసం స్థానిక మున్సిపాలిటీ నిధులు ఖర్చు చేయాలంటే ఆర్థికంగా వారికి వెసులుబాటు ఉండదన్నారు. సాధారణంగా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం సాధారణ, ఆర్థిక సంఘం నిధులు మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. అయితే ఆ నిధులతో అభివృద్ధి చేయాలంటే ప్రతి మున్సిపాలిటీకి పాతిక సంవత్సరాల కాలం పడుతుందని అధికారులు అంచనా వేయడంతో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీల్లో ఇటీవల తెలుగుదేశం పార్టీ నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా తెరపైకి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రతి మున్సిపల్ పట్టణంలో మౌళిక సదుపాయాల కల్పనకు అంచనాలు రూపొందించామన్నారు. ఇందుకోసం రూ.11 వేల కోట్లు అవసరం అవుతాయని అధికారులు నివేదిక సిద్ధం చేశారన్నారు. ఈ నివేదిక ప్రకారం ముఖ్యమంత్రితో చర్చించి నిధులను ఏవిధంగా సర్దుబాటు చేయాలో నిర్ణయించిన అనంతరం ఏప్రిల్ నెలలో టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తామన్నారు.

నంద్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఇటీవల కొత్తగా ఏర్పడిన కాలనీలు, శివారు ప్రాంతాల్లో నాలుగు రకాల మౌళిక సదుపాయాల కల్పన కోసం రూ.169 కోట్ల ఖర్చుతో అంచనాలు సిద్ధం చేశామన్నారు. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాహ్.. జీసీసీ!

లాభదాయకంగా ఇన్‌స్టెంట్ కాఫీ

తెలుగు రాష్ట్రాల్లో విశేష ఆదరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 9: అంతర్జాతీయ మార్కెట్‌లోకి అడుగుపెట్టిన అరకు కాఫీ మాదిరిగా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ప్రవేశపెట్టిన ఇన్‌స్టెంట్ కాఫీ ప్యాకెట్లకు విశేష ఆదరణ లభిస్తోంది. ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో ఈ ప్యాకెట్లు విరివిగా అమ్ముడుపోతున్నాయి. ఎప్పటికపుడు కాఫీ రుచి చూసేందుకుగాను, సరసమైన ధరకు సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వీలుగా ఇటీవల దీనిని జీసీసీ మార్కెట్‌లోకి విడుదల చేసింది. తొలి దశలో జీసీసీ సేకరించిన ఎనిమిది టన్నుల కాఫీ గింజలను పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సమీపానున్న దార్లమడుగు ప్రాంతంలో ఉండే ఫ్యాక్టరీకి తరలించింది. గింజలను ఇక్కడ పౌడర్‌గా మార్చి పది గ్రాములు, రెండు గ్రాముల ప్యాకెట్లను తయారు చేసింది. పది గ్రాముల ప్యాకెట్లను రూ.12లకు, రెండు గ్రాముల ప్యాకెట్‌ను మూడు రూపాయలకు విక్రయిస్తోంది. అందరికీ అందుబాటులో ఉండే ఈ కాఫీ ప్యాకెట్లను మార్కెటింగ్ కోసం జిల్లాలు, మండలాల వారీగా జీసీసీ పంపిణీదారులను నియమించింది. అలాగే జీసీసీ కౌంటర్లు, షాపింగ్‌మాల్స్‌ల ద్వారానే వీటి విక్రయాలు సాగిస్తోంది. దీంతో వారం రోజుల వ్యవధిలోనే పది గ్రాముల కాఫీ ప్యాకెట్లను లక్షన్నర వరకు, రెండు గ్రాముల కాఫీ ప్యాకెట్లను నాలుగు లక్షలకు పైగా విక్రయించగలిగింది. ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లో ఇన్‌స్టంట్ కాఫీ ప్యాకెట్లకు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభించడంతో ఇదే తరహాలో మార్కెట్‌లోకి ప్యాకెట్ల విక్రయాలను పెంచాలని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఏఎస్‌పిఎస్ రవిప్రకాష్ సిబ్బందిని ఆదేశించారు. జీసీసీ వార్షిక ఆదాయం మూడేళ్ల కింద కేవలం రూ.90 కోట్లు ఉండగా, - మిగతా 6వ పేజీలో



దక్షిణ కొరియాలోని పయాంగ్‌చాంగ్ నగరంలో శుక్రవారం అట్టహాసంగా జరిగిన వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెలిగిపోతున్న స్టేడియం. ఒలింపిక్ స్ఫూర్తికి చిహ్నమైన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) జెండాపై ఉండే ఐదు వృత్తాలను గుర్తుచేస్తున్న ఈ అద్భుత దృశ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈనెల 25వ తేదీ వరకు జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో 92 దేశాల నుంచి 2,952 మంది అథ్లెట్లు పోటీపడుతున్నారు

7

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939
శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
ఉత్తరాయణం, శిశిరఋతువు,
మాఘమాసం, కృష్ణపక్షం
తిథి: దశమి సా.4.05
నక్షత్రం: జ్యేష్ఠ రా.9.15, వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: ఉ.06.00 నుండి 07.36 వరకు
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు



యూపీలోని ఓ ఆసుపత్రిలో రోగుల నిరీక్షణ

‘ఆరోగ్యం’లో కేరళ భళా

8వ స్థానంలో ఆంధ్రప్రదేశ్
11వ స్థానంలో తెలంగాణ
అట్టడుగున ఉత్తరప్రదేశ్
నీతిఆయోగ్ ఆరోగ్య సూచిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:దేశంలోని ఆరోగ్య రంగం భేషుగ్గా ఉన్న పెద్ద రాష్ట్రాల్లో కేరళ అగ్రస్థానంలో నిలవగా ఉత్తర ప్రదేశ్ అట్టడుగున ఉండిపోయింది. గత ఏడాదితో పోలిస్తే యూపీలో పరిస్థితి మెరుగుపడినప్పటికీ జాబితాలో చివరిస్థానంతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. నీతి ఆయోగ్ విడుదల చేసిన తాజా ‘ఆరోగ్య సూచిక’లో ఈ వివరాలున్నాయి. కాగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో పంజాబ్, తమిళనాడు, నాలుగో స్థానంలో గుజరాత్ నిలిచాయి. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే ఆంధ్ర ప్రదేశ్ 8వ స్థానం, తెలంగాణకు 11వ స్థానం లభించింది. ‘ఆరోగ్య రాష్ట్రాలు-అభివృద్ధి దిశగా భారత్’ అనే అంశంపై మూడు కేటగిరీల్లో నీతిఆయోగ్ ‘ఆరోగ్యసూచీ’ని రూపొందించి విడుదల చేసింది. శిశుమరణాలు, ఐదేళ్ల లోపు చిన్నారుల మరణాలు, ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలు, రోగనిరోధక కార్యక్రమాల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నీతి ఆయోగ్ ఈ ‘ఆరోగ్యసూచీ’ని రూపొందించింది.

పెద్దరాష్ట్రాల విభాగంలో రాజస్థాన్, బిహార్, ఒడిశా పేలవమైన ఫలితాలను సాధిస్తే, ఎప్పటికప్పుడు ఆరోగ్యరంగంలో మెరుగైన పరిస్థితుల కోసం ప్రయత్నిస్తున్న రాష్ట్రాలుగా జార్ఖండ్, జమ్ముకశ్మీర్, యూపీ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. కాగా చిన్నరాష్ట్రాల విభాగంలో మిజోరాం అగ్రస్థానం సాధించగా మణిపూర్, గోవా తరువాతి స్థానాల్లో నిలిచాయి. ఇక కేంద్ర పాలిత ప్రాంతాల విభాగంలో లక్ష్మద్వీప్ రెండు ప్రత్యేకతలతో అగ్రస్థానంలో నిలిచింది. నీతిఆయోగ్ పరిగణనలోకి తీసుకున్న అన్ని అంశాలలోను, ఎప్పటికప్పుడు మెరుగైన పరిస్థితుల కోసం అత్యుత్తమ ప్రయత్నాలు చేస్తున్న ప్రాంతాలలోను లక్ష్మద్వీప్ అగ్రస్థానంలో నిలిచింది.

కాగా దేశంలో ఆరోగ్యరంగం అభివృద్ధిని పరుగులుపెట్టించడానికి ‘ఆరోగ్యసూచి’ చోదకశక్తిగా నిలుస్తుందని మేధోబృందం భావిస్తోందని నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ చెప్పారు. ఆరోగ్యసూచి జాబితాను విడుదల చేసిన సందర్భంగా ఆయన - మిగతా 6వ పేజీలో



ఏ.. మీరు మాత్రం ఆ ప్లాన్ ఈ ప్లాన్ అంటూూ అమరావతికి అడ్డమైన ప్రకటనలు చేయలా!?

బీజేపీపై టీడీపీ రివర్స్ గేర్!

- వైసీపీతో కమలం చెలిమికి పై ఎత్తు
- అద్వానీని ఆశ్రయించిన ఎంపీలు
- సోనియాకూ వివరించిన వైనం
- తాజాగా రాహుల్, రేణుక మద్దతు
- గొంతు కలిపిన టీఆర్ఎస్ ఎంపీ కవిత
- టిట్ ఫర్ టాట్ పాలసీతో 'దేశం'

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 9: తన రాజకీయ ప్రత్యర్థి వైసీపీని ప్రోత్సహిస్తూ తనకు చెక్ పెట్టాలన్న ధోరణితో బీజేపీ వెళుతోందన్న విషయాన్ని గ్రహించిన టీడీపీ దానిపై రివర్స్‌గేర్‌లో వెళుతుండటం ఆసక్తికరంగా మారింది. తన రాజకీయ ప్రత్యర్థిని ఉసిగొల్పుతున్న బీజేపీకి అదే పద్ధతిలో జవాబు చెప్పేలా టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సరికొత్త వ్యూహానికి తెరలేపారు. అందులో భాగంగా బీజేపీ కురువృద్ధుడు, నరేంద్ర మోదీ రాకతో ప్రాధాన్యం కోల్పోయిన లాల్ కృష్ణ అద్వానీని ఆశ్రయించడం ద్వారా, బీజేపీ శిబిరాన్ని విస్మయపరిచారు. రాష్ట్రంలో తాను నిరంతరం యుద్ధం చేస్తున్న వైసీపీని బీజేపీ ప్రోత్సహిస్తున్న తీరుతో ఆగ్రహిస్తున్న టీడీపీ, తాజాగా అదే వ్యూహం అనుసరిస్తున్నట్లు ఆ పార్టీ వ్యవహారశైలి స్పష్టమవుతోంది. తాను వ్యతిరేకిస్తున్న వైసీపీని బీజేపీ ప్రోత్సహిస్తున్న విధంగానే.. టీడీపీ కూడా బీజేపీలో వ్యక్తిగతంగా మోదీని వ్యతిరేకించే ఆ పార్టీ సీనియర్లు, విపక్షాలను ఆశ్రయించడం ద్వారా.. విభజించి పాలించే రాజకీయాలు తమకూ తెలుసన్న సంకేతాలు బీజేపీ నాయకత్వానికి పంపినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మోదీ పక్కకుపెట్టిన అద్వానీని టీడీపీ ఎంపీలు కలవడం కూడా ఈ వ్యూహంలో భాగంగానే కనిపిస్తోంది. రాష్ట్ర విభజనకు సహకరించిన బీజేపీ, ఎన్నికల ముందు ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేస్తోందని తాజాగా అద్వానీకి ఫిర్యాదు చేయడం, ఆయన కూడా తాను జైట్లీకి చెప్పానని, అయినా ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారన్న వార్త బయటకు రావడం చర్చనీయాంశమయింది. టీడీపీ ఈవిధంగా ఆందోళనను కొత్త మలుపు తిప్పుతుందని బీజేపీ కూడా ఊహించినట్టు లేదు. అటు మిత్రపక్షం కాకపోయినా కేంద్రానికి కీలకమైన అంశాల్లో మద్దతునిస్తోన్న టీఆర్ఎస్ మద్దతు కూడా సాధించడంలో టీడీపీ సఫలమయినట్లు కనిపిస్తోంది. ఆ పార్టీ ఎంపీ, తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత కూడా ఏపీకి న్యాయం చేయాలని, విభజన హామీలన్నీ నెరవేర్చాలని లోక్‌సభలో డిమాండ్ చేశారు. ఆమె మాట్లాడక ముందు నుంచీ సభలో ఆందోళన చేస్తున్న టీడీపీ ఎంపీలు, కవిత ప్రసంగం అప్పుడు మాత్రం నినాదాలు చేయకుండా సహకరించడం ప్రస్తావనార్హం. బీజేపీ మిత్రపక్షమైనా, ఆ పార్టీని మహారాష్ట్రలో విభేదిస్తోన్న శివసేన మద్దతు కూడా ఇప్పటికే టీడీపీ కూడగట్టింది. ఆ పార్టీ కూడా విభజన హామీల అమలు కోసం పోరాడుతున్న టీడీపీకి బాసటగా నిలిచి, బీజేపీ మిత్రధర్మం పాటించడం లేదని విమర్శించింది. అటు పంజాబ్‌లో బీజేపీ మిత్రపక్షమైన అకాలీదళ్ కూడా టీడీపీ ఎంపీల ఆందోళనకు సంఘీభావం ప్రకటించింది. ఇవన్నీ పరిశీలిస్తే.. బీజేపీ తీరుపై అసంతృప్తిగా ఉన్న ఎన్డీఏ పక్షాల మద్దతు కూడగట్టడంలో టీడీపీ సఫలమయిందని స్పష్టమవుతోంది. ఈ విషయంలో ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలు కూడా, మోదీపై వ్యతిరేకతతోనే టీడీపీ పోరాటానికి బాసటగా నిలుస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే బీజేపీ-టీడీపీ మధ్య జరుగుతున్న రాజకీయ దోబూచులాటలో తాజాగా కాంగ్రెస్ ప్రవేశించడం ఆసక్తికరంగా మారింది. సభలో సోనియా వద్దకు వెళ్లి, విభజన హామీలను గుర్తు చేసి తమకు అన్యాయం జరిగిందని టీడీపీలు చెప్పడం చానెళ్లలో రావడంతో, రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతలు కూడా బిత్తరపోయారు.

తాజాగా.. విభజన సమయంలో కేంద్రమంత్రిగా ఉండి కీలకపాత్ర పోషించిన జైరాం రమేష్, ఏపీ ఎంపీలు కోరకపోయినా వారి వద్దకు వచ్చి భుజం తట్టడం, ఆ వెంటనే కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ కూడా ఏపీ సమస్యలపై పోరాడుతున్న ఎంపీలకు తమ పార్టీ మద్దతునిస్తోందని ట్వీట్ చేయడం చకాచకా జరిగిపోవడాన్ని బీజేపీ కూడా ఊహించలేకపోయినట్లు వారి మాటలు స్పష్టం చేస్తున్నాయి. 'ఒకవేళ రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌తో టీడీపీ జతకట్టాలనుకుంటే అది ఎలాంటి సంకేతాలిస్తాయో మా మిత్రపక్షం వారే ఆలోచించుకోవాల'ని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు శుక్రవారం వ్యాఖ్యానించడం ప్రస్తావనార్హం. అటు ఈ పరిణామాలను గమనిస్తోన్న రాష్ట్ర బీజేపీ నేతలు కూడా.. తామేదో వైసీపీని ప్రోత్సహిస్తున్నారనే ఆగ్రహంతో, బాబు టిట్ ఫర్ టాట్ అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారని విశ్లేషిస్తున్నారు. అద్వానీని టీడీపీ ఎంపీలు కలుస్తారని, ఎన్డీఏ మిత్రపక్షాల మద్దతు కూడగడుతుందని, రాహుల్, రేణుకాచౌదరి, జైరామ్ రమేష్ టీడీపీ ఎంపీలకు మద్దతునిస్తారని ఊహించలేదని చెప్పారు. 'ఇదంతా మైండ్‌గేమ్. అసలు సమస్య టీడీపీ,వైసీపీది. దానితో మాకు సంబంధం లేదు. వైసీపీ వాళ్లకు పీఎంఓ అపాయింట్‌మెంట్ ఇవ్వడాన్ని టీడీపీ సహించలేకపోతోంది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వాళ్లూ మాకు మద్దతునిచ్చారు. దాన్ని పక్కకుపెడితే ఒక రాజకీయపార్టీ ప్రధానిని ఎప్పుడైనా కలవచ్చు. వైసీపీ వాళ్లకు బడ్జెట్ నచ్చి ఉండవచ్చు. అందుకే అభినందించారు. అంతమాత్రాన మాతో కుమ్మక్కయిందంటే భావ్యం కాదు. ఈ వ్యవహారం ఎలా మలుపు తిరుగుతుందో, ఎప్పటికి తెరపడుతుందో తమకూ అర్థం కావడం లేద'ని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

రూ.39.50 లక్షల రద్దయిన నోట్లు స్వాధీనం

★ ఏడుగురి అరెస్టు

ఆంధ్రభూమి బ్యూరో

కడప, ఫిబ్రవరి 9: కడప జిల్లా పోలీసులు రద్దయిన నోట్లు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఏడుగురిని అరెస్టుచేశారు. కలసపాడు పోలీసుస్టేషన్ పరిధిలోని కొప్పళ తిరుపతిరెడ్డికి చెందిన పొలంలో దాచిన రూ.39.50 లక్షల విలువచేసే రద్దయిన నోట్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రద్దు చేసిన రూ.500, రూ.1000 నోట్లను పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో కొంత మంది దాచినట్లు సమాచారం అందడంతో మైదుకూరు డీఎస్పీ బీఆర్ శ్రీనివాసులు, పోరుమామిళ్ల సీఐ పద్మనాభన్ విచారణ చేపట్టారన్నారు. తిరుపతిరెడ్డి పొలం సమీపంలో రద్దయిన నోట్లు తరలిస్తున్న పోరుమామిళ్లకు చెందిన షేక్ ఖాజాపీర్, షేక్ అమీర్‌బాషా, బత్తల ప్రసాద్, గుంటూరుకు చెందిన భూమిపల్లి కోటిరెడ్డి, షేక్ నాగూర్‌మీరా, ప్రొద్దుటూరుకు చెందిన షేక్ బాబాఖలందర్, ప్రకాశం జిల్లా వేపమానుపల్లె గ్రామానికి చెందిన పేర్ల శ్రీనివాసును అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పొలం యజమాని తిరుపతిరెడ్డి కోసం గాలిస్తున్నామన్నారు. తనకు తెలిసిన బ్యాంకు మేనేజర్ల సాయంతో పాత నోట్లు మారుస్తానని తిరుపతిరెడ్డి చెప్పడంతో తమకు తెలిసిన వారి వద్ద నుంచి పాత నోట్లు సేకరించినట్లు నిందితులు అంగీకరించారన్నారు. కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు.

జూన్‌లో నీటి సంఘాలకు ఎన్నికలు

- 12 నుంచి జలసంరక్షణ ఉత్సవం
- 116 రోజులు ఉద్యమంలా కార్యాచరణ
- నీరు-ప్రగతి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో మంత్రి దేవినేని ఉమా

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 9: జూన్‌లో నీటి సంఘాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరుపనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు వెల్లడించారు. ఈనెల 12 నుంచి జూన్ 7వ తేదీ వరకు 116 రోజులు నీరు-ప్రగతి జలసంరక్షణ రెండవ విడత ఉద్యమ కార్యక్రమం ఓ ఉత్సవంలాగా నిర్వహించనున్నట్లు చెప్పారు. సచివాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన నీరు-ప్రగతి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో నీరు-చెట్టు పనుల ప్రగతిని ఆయన సమీక్షించారు. వచ్చే ఏడాదికి రూపొందించిన పనుల ప్రణాళికపైన, జల సంరక్షణ ఉద్యమంలో చేపట్టే పనులపైన చర్చించారు. చేపట్టిన పనులను, పూర్తిచేసిన పనుల వివరాలను సంబంధిత శాఖల అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దేవినేని, జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌లు పనుల పురోగతిపై శ్రీకాకుళం, అనంతపురం, ప్రకాశం, చిత్తూరు జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. నీటి సంఘాల భాగస్వామ్యంతో జల సంరక్షణ ఉద్యమంలో చేపట్టే చెరువుల మరమ్మతులు, చెరువుల అనుసంధానం, కాలువల్లో పూడిక తొలగింపు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, ఊట గుంటల నిర్మాణం, నేలలో తేమ పెంపు పనులు, వాననీటి సంరక్షణ, కాంటూర్ కందకాలు, రాక్ ఫిల్ డ్యామ్స్, అటవీ సరిహద్దు కందకాలు, భూగర్భ జలాల పెంపు, ఊరూరా జలగణన, ఇతర జల సంరక్షణ నిర్మాణాలపై చర్చించారు. వర్షాలు పడిన వెంటనే నీరు భూమిలో ఇంకే ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెప్పారు. పెరిగిన భూముల సాగు, పంటల విస్తీర్ణం, సాగునీరు, నివాస ప్రాంతాలకు తాగునీరు, వనసంరక్షణ సమితులు, ఫారం ఫాండ్స్, బోర్‌వెల్స్ రీఛార్జి, చెరువుల్లో నీటి నిల్వ, వాటర్ షెడ్ల ఏర్పాటు తదితర అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయవలసిన పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కడప జిల్లాలో చెక్ డ్యామ్‌ల నిర్మాణం బాగుందని ప్రశంసించారు. అక్కడ భూగర్భ జలాలు గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. అక్కడ అభివృద్ధిని పరిశీలించమని అధికారులకు చెప్పారు. జూన్‌లో నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.



నీరు-చెట్టు పనుల ప్రగతిని సమీక్షిస్తున్న మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

ఆయేషా హత్య కేసులో కోర్టుకు సిట్ తొలి నివేదిక

విజయవాడ (క్రైం), ఫిబ్రవరి 9: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన బి ఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా హత్య కేసు పునర్విచారణకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన తొలి నివేదికను కోర్టుకు సమర్పించింది. ఆయేషా కేసు నుంచి పిడతల సత్యంబాబు నిర్దోషిగా విడుదలైన తర్వాత హైకోర్టు కేసు పునర్విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో దర్యాప్తు నిమిత్తం డిఐజి శ్రీకాంత్ నేతృత్వంలో డిఎస్పీలు హైమావతి, శ్రీలక్ష్మి, సిఐ సహేరాతో కూడిన ప్రత్యేక బృందాన్ని (సిట్) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో రంగంలోకి దిగిన సిట్ పునర్విచారణకు కొద్దిరోజుల ముందు తెర తీసింది. దీనిలో భాగంగా ఆయేషా చదివిన కళాశాల, హాస్టల్‌ను పరిశీలించి గత వారం రోజులుగా ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. ఇందుకు సంబంధించి ప్రాథమిక నివేదికను సిట్ శుక్రవారం విజయవాడ నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించింది.

ఫలించిన టీడీపీ పోరాటం!

- సాయంత్రం జైట్లీ ప్రకటన వెనుక ఫలించిన ఒత్తిళ్లు
- వెంకయ్య, జైట్లీ, అమిత్‌షాతో మంతనాలు
- హోదా నిధులపై కొంత గ్యాప్ ఉందన్న జైట్లీ
- ఆ తర్వాత రాజ్యసభలో జైట్లీ ప్రకటన
- బడ్జెట్‌లో పెడితేనే నమ్ముతామంటున్న టీడీపీ
- కేంద్రమే వీటిని ప్రకటించాలని పట్టు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 9: రాష్ట్రానికి రావలసిన నిధులపై పార్లమెంటులో పోరాడుతున్న టీడీపీ కృషి ఫలించింది. బడ్జెట్ కేటాయింపులు చేయాలంటూ ఆందోళన చేస్తున్న టీడీపీ ఎంపీలను ఆర్థిక మంత్రి జైట్లీ, అమిత్‌షా, పీయూష్‌గోయల్ చర్చలకు పిలిచారు. కేంద్రమంత్రి సుజనాచౌదరి, సీఎం రమేష్ వారితో భేటీ అయ్యారు. రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు సమక్షంలో కూడా ఒకసారి భేటీ జరిగినట్లు తెలిసింది. మధ్యాహ్నం రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో టీడీపీ ఎంపీలు డిమాండ్ చేస్తున్న వాటిలో మెజారిటీ అంశాలను ఆమోదించేందుకు జైట్లీ అంగీకరించారు. హోదా నిధులు ఒకేసారి విడుదల, పారిశ్రామిక కారిడార్లు వంటి డిమాండ్లు కూడా అందులో ఉన్నాయి. అయితే, సభా నిబంధనల ప్రకారం తాను వీటిని తన ప్రసంగంలో చేర్చలేదని జైట్లీ చెప్పినట్లు తెలిసింది. దుగ్గరాజపట్నం పోర్టు బదులు మరొకటి ఎంచుకోవాలని సూచించారు. రెవిన్యూలోటు, ప్యాకేజీపై కొంత గ్యాప్ ఉండటం వల్లే ఆలస్యమైందని వివరించారు. రైల్వే జోన్‌పై రెండు, మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని పీయూస్ చెప్పినట్లు సమాచారం. వీరి భేటీ ముగిసిన తర్వాత రాత్రి ఏడుగంటలకు జైట్లీ తన ప్రసంగంలో తొలి పేరాను ఏపీకి ఇచ్చే వాటిపైనే మాట్లాడటం బట్టి, టీడీపీ ఎంపీల ఒత్తిడి ఫలించినట్లు స్పష్టమవుతోంది. కాగా, సప్లిమెంటరీ సెషన్‌లో వీటిని ప్రకటించే అవకాశం ఉందని టీడీపీ ఎంపీలు అంచనా వేస్తున్నారు. అయితే.. దీనిపై టీడీపీ పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడం లేదు. వీటిని మొత్తం బడ్జెట్‌లో చేర్చే వరకూ ఆందోళన కొనసాగించాలని, దానిపై తాము పార్టీ పరంగా మాట్లాడే కంటే.. కేంద్రమే ప్రకటించాలన్న ధోరణి ప్రదర్శిస్తోంది. అందుకే దీనిపై పార్టీ నేతలు తొందరపడి హర్షం వ్యక్తం చేయకపోవడం గమనార్హం.

సస్పెండయినా సరే వెనుకాడవద్దు: బాబు

కాగా ఉదయం ఎంపీలతో టెలీకాన్ఫరెన్సులో మాట్లాడిన చంద్రబాబు, జైట్లీ ప్రసంగంలో పాతపాటే వినిపించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. డిమాండ్లు నెరవేరేవరకూ పోరాడాలని, సస్పెండయినా వెనుకాడవద్దన్నారు. కేంద్రం నుంచి కాలపరిమితతో కూడిన నిర్దిష్ట ప్రకటన వచ్చే వరకూ ఆందోళన కొనసాగించాలని ఆదేశించారు. బంద్‌లో మన పార్టీ పాల్గొనడం ద్వారా ఏపి ప్రజానీకం ఏం కోరుకుంటుందో కేంద్రానికి చెప్పామన్నారు. 19 హామీలు నెరవేర్చేవరకూ ఆందోళన కొనసాగించాలన్నారు. ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

శుక్రవారం రాత్రికి రాష్ట్రానికి 400 కోట్లు విడుదల

జైట్లీ ప్రకటన తర్వాత కేంద్రం నుంచి రాష్ట్రానికి 400 కోట్లు విడుదల చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించడం విశేషం. అయితే అవి చెప్పుకోదగ్గ స్థాయిలో కాకపోయినా టీడీపీ ఎంపీలు డిమాండ్ చేసిన సాయంత్రానికే విడుదల కావడం ప్రస్తావనార్హం. 14వ ఆర్థిక సంఘం నిధుల కింద 369.16 కోట్లు, జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల కింద 31.76 కోట్లు విడుదల చేసింది. దీనిపైనా టీడీపీ నుంచి స్పందన కనిపించలేదు.

గుణదలమాత మహోత్సవాలు

వైభవంగా ప్రారంభం

విజయవాడ (పటమట) ఫిబ్రవరి 9: భారతదేశంలోప్రసిద్ధి చెందిన కతోలిక క్రైస్తవ పుణ్యక్షేత్రాలలో మూడవ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న విజయవాడ గుణదలమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు (తిరునాళ్ల) శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరగనున్న గుణదల మాత మహోత్సవాలను శుక్రవారం ఉదయం కొండ దిగువున ఉన్న బిషప్ గ్రాసి హైస్కూల్ గ్రౌండ్‌లో విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వలప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆధ్యాత్మిక కళావేదికపై బిషప్ రాజారావు సిల్వర్ జూబిలేరియన్ గురువులు ఫాదర్ జి.జ్వాన్నేసు, ఫాదర్ నక్కా డేవిడ్ రాజు తదితర గురువులతో ప్రారంభోత్సవ 'సమిష్టి దివ్యపూజాబలి' సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ జోసఫ్ రాజారావు సందేశమిస్తూ గత 90 సంవత్సరాలుగా గుణలమాత ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. గుణదలమాత పుణ్యక్షేత్రం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మొదటి రోజు ఆంధ్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు గుణదల కొండపై మరియమాతను, కొండ శిఖరాన ఏసు క్రీస్తును బారులు తీరి దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌సి డైరెక్టర్ ఫాదర్ పసల తోమస్, ఫాదర్ వల్లే జోజిబాబు, ఫాదర్ జి. మైఖేల్ డయోసిస్‌కు చెందిన 80 మంది గురువులు, సిస్టర్లు వివిధ ప్రాంతాల నండి వచ్చిన భక్తులు ఆశేష సంఖ్యలో పాల్గొన్నారు.



గుణదలమాత మహోత్సవాలను ప్రారంభిస్తున్న బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

ముగ్గురు ఐజీలకు పదోన్నతి

విజయవాడ (క్రైం), ఫిబ్రవరి 9: రాష్ట్రంలో ముగ్గురు సీనియర్ ఐపిఎస్ అధికారులకు పదోన్నతి లభించింది. 1993 బ్యాచ్‌కు చెందిన ఐజిపిలు ముగ్గురికి అదనపు డిజీ హోదా కలిపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ఐబి జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ మహేష్ దీక్షిత్, సిఐడి ఐజి అమిత్‌గార్గ్, సిఐడి (ఎస్‌సి ఆర్‌బి అండ్ సైబర్ క్రైం) ఐజి పివి సునీల్‌కుమార్‌లకు అదనపు డీజీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యలుంటే పరిష్కరిస్తాం

తూ.గో. రొయ్యల రైతులకు మంత్రి ఆదినారాయణరెడ్డి హామీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 9: తూర్పుగోదావరి జిల్లాలో రొయ్యల చెరువుల అనుమతుల విషయంలో ప్రభుత్వపరంగా ఏవైనా అడ్డంకులు ఉంటే పరిశీలించి నిబంధనలకు లోబడి అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర, మార్కెటింగ్, గిడ్డంగులు, పశు సంవర్థక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ, సహకార శాఖల మంత్రి ఆదినారాయణ రెడ్డి తూ.గో జిల్లా రొయ్యల రైతులకు హామీ ఇచ్చారు. తూ.గో జిల్లా రొయ్యల సాగు రైతులు శుక్రవారం మధ్యాహ్నం మంత్రిని సచివాలయంలో కలిసి తమకు ఎదురవుతున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మంత్రి వారి సమస్యలను పశు సంవర్థక, మత్స్య శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ దివేదితో కలిసి సమావేశమై విన్నారు. నిబంధనలకు లోబడి వ్యవహరించాలని మంత్రి వారికి సూచించారు. తూర్పుగోదావరి జిల్లాలో 30 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతున్నా తొమ్మిది వేల ఎకరాల సాగుకే అనుమతులున్నాయని, మిగిలిన వాటి రెగ్యులరైజేషన్‌కు నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసినా అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రికి, ముఖ్య కార్యదర్శికి తూ.గో జిల్లా రొయ్యల సాగు రైతులు వివరించారు. మంత్రి, ముఖ్య కార్యదర్శి ఈ అంశమై ఆ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య ఏమిటో తెలుసుకుని పరిష్కరిస్తామని వారికి తెలిపారు. రొయ్యల చెరువులు రోడ్డుకు, డ్రైన్లకు మూడు మీటర్ల దూరంలో ఉండాలి. గట్ల మీద చెట్లను పెంచాలి, కాలుష్య నివారణ చర్యలు తదితరాలన్నీ నిబంధనలకనుగుణంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. జీవో 7 ప్రకారం మంచినీటి చేపల చెరువులకు అనుమతులు తీసుకుని రొయ్యల సాగు చేయాలనుకుంటే జీవో 15 ననుసరించి దరఖాస్తులు చేయాలని సూచించారు.

జిల్లా స్థాయి కమిటీలో విద్యుత్ అధికారి కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఈ సమావేశంలో అధికారులకు సూచించారు. విద్యుత్ అధికారి ఉండటం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో లోడ్ ఎక్కువ కాకుండా ఉంటేలా అనుమతులిచ్చేలా చూడగలరని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బీద మస్తాన్ రావు, అఖిల భారత రొయ్యల సాగు రైతు సమాఖ్య అధ్యక్షుడు రాజు, తూ.గో జిల్లా ఆక్వా రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రరాజు వెంకటరాజు, కార్యవర్గం, మత్స్యశాఖ అదనపు కమిషనర్ సీతారామరాజు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ డైరెక్టర్‌గా రాజేంద్రకుమార్

పదిమంది ల్యాబ్ అసిస్టెంట్ల నియామకం ఉత్తర్వులు విడుదల

విజయవాడ, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్ ఫోరెన్సిక్ ల్యాబరేటరీ డైరెక్టర్‌గా డాక్టర్ రాజేంద్రకుమార్ సారిన్‌ను నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవోను విడుదల చేసింది. రెండు సంవత్సరాలు పాటు రాజేంద్ర కుమార్ ఫోరెన్సిక్ డైరెక్టర్‌గా పని చేయనున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో ఈయన ఫోరెన్సిక్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అలాగే విజయవాడలోని రాష్ట్ర ఫోరెన్సిక్ కార్యాలయంలో పది మంది లాబ్ అసిస్టెంట్లను అత్యావసర అవసరాల దృష్ట్యా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో లాబ్ అస్టెంట్స్‌ను నియమించనున్నారు.

ఆంధ్రులతో ఆడుకోవద్దు

- విభజన హామీలు నెరవేర్చాల్సిందే
- ఏపీ ఎంపీలకు మద్దతుగా సచివాలయ ఉద్యోగుల ర్యాలీ

విజయవాడ (బెంజ్‌సర్కిల్), ఫిబ్రవరి 9: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేశారని ఆరోపిస్తూ ఉద్యమిస్తున్న ఆంధ్ర ఎంపీలకు మద్దతుగా వెలగపూడి సచివాలయం ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. సచివాలయం 3బ్లాక్ వద్ద శుక్రవారం మధ్యాన్నం భోజన విరామ సమయంలో ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉద్యోగులు సచివాలయంలో ర్యాలీ నిర్వహించారు. కేంద్రం ఏపీకి తీవ్ర అన్యాయం చేసిందంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విభజన హామీల విషయంలో రాష్ట్రానికి అన్యాయం చేస్తే ఉరుకోబోమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఎన్నో సార్లు ఢిల్లీ వెళ్లి రాష్ట్రం కోసం విజ్ఞప్తులు చేసినా కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. అడుగడుగునా రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తూనే ఉందని, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఇక సహించేది లేదన్నారు. కేంద్ర ఇప్పటికైనా దిగిరావాలని లేని పక్షంలో సమక్యాంధ్ర ఉద్యమ సమయంలో చెపట్టిన తరహాలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామన్నారు. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనాలను కల్పించలేదన్న ఆయన అత్యధిక పన్ను చెల్లింపుదారులైన ఉద్యోగుల విషయంలో కేంద్రం కనికరించలేదన్నారు. ఏపీకి న్యాయంగా రావాల్సిన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలోని అన్ని సంఘాలతో కలసి ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

'దింపుడు కల్లం ఆశ కూడా పోయింది'

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 9: 'ఆంధ్రప్రదేశ్ సమస్యల పట్ల అవగాహన ఉంది.. సానుభూతి ఉంది. అయితే కేంద్రంపై ఆర్థిక భారం ఉంది.. ఇంత కంటే ఎక్కువ చేయలేము.. అని గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి లోక్‌సభలో చెప్పటంతో దింపుడు కల్లం ఆశ కూడా పోయిందంటూ పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్రంలో డీడీపీ , జగన్ పార్టీలు అధికార, అనధికార మిత్రపక్షాలుగా ఉన్నంతకాలం విభజన చట్టంలోని అంశాలు, ప్రత్యేక హోదా అమలు కావన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే ఏకైక పరిష్కారమన్నారు. బీజేపీ, టీడీపీ, వైకాపా పార్టీలలో ఏ పార్టీకి ఓటేసినా బీజేపీకి ఓటేసినట్లేనన్నారు. చారిత్రక తప్పిదం చేసినట్లేనన్నారు.

పోలవరం ప్రాజెక్టు పనుల్లో 'నవయుగం'

- కొత్త కాంట్రాక్టు సంస్థ రంగప్రవేశం

పోలవరం, ఫిబ్రవరి 9: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కొత్తగా కాంట్రాక్టు దక్కించుకున్న నవయుగ సంస్థ శుక్రవారం పనులు ప్రారంభించింది. ఆ సంస్థ డైరెక్టర్ వై రమేష్ పూజలు చేసిన అనంతరం స్పిల్‌వేవద్ద లాంఛనంగా పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం సాయంత్రం మూడు, నాలుగు గంటల మధ్య జరిగింది. పాత అంచనాలకే ఈ సంస్థ పనులు నిర్వహిస్తోంది. ఈ కంపెనీ స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌లో 70 శాతం పనులు చేస్తుందని, మిగిలిన పనులు పాత కాంట్రాక్టు ఏజన్సీ అయిన ట్రాన్స్‌ట్రాయ్ చేస్తుందని తెలిసింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ వివిఎస్ రమేష్‌బాబు, నవయుగ కంపెనీ అధికారి క్రాంతి పాల్గొన్నారు.



పోలవరం ప్రాజెక్టు పనుల ప్రారంభానికి ముందు పూజలు నిర్వహిస్తున్న నవయుగ సంస్థ ప్రతినిధులు

కేంద్రం మొండి వైఖరి విడనాడాలి

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహర్

విజయవాడ (బెంజిసర్కిల్), ఫిబ్రవరి 9: విభజనతో తీవ్ర అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం మొండి వైఖరి విడనాడాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. ఐదు కోట్ల ప్రజల మనోభావాలకు కేంద్రం సంజాయిషీ ఇవ్వాలని ఆయన శుక్రవారం వెలగపూడి సచివాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. బడ్జెట్‌పై పార్లమెంట్‌లో ఆంధ్ర ఎంపీలు చేస్తున్న నిరసనకు సంఘీభావం తెలిపిన ఆయన రాష్ట్రం ఇచ్చిన నివేదికలకు కేంద్రం ప్రకటించిన నిధులకు ఏమాత్రం పొంతన లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానిని, పలువురు కేంద్ర మంత్రులను కలిసి నివేదికలు ఇచ్చారన్న ఆయన ఇప్పటికి ఐదు సార్లు బడ్జెట్ ప్రకటించినా మిత్ర ధర్మం కారణంగా ఓపికగా ఉన్నట్లు తెలిపారు. మెట్రోరైలు, రైల్వే జోన్, పెట్రోకారిడార్, అమరావతి నుండి రాష్ట్ర రహదారులకు కనెక్టివిటీ రహదారులు లేకపోవడం బాధకరమన్నారు. ప్రధానంగా 2017-18లో ఎస్సీలకు 52,393 కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది దానికి అదనంగా కేవలం మూడు వేల కోట్ల రూపాయలు మాత్రమే పెంచారన్నారు. ఇప్పటి వరకు మిత్ర బంధం కారణంగా ఓపిక పట్టిన ఐదు కోట్ల ఆంధ్రులు ప్రస్తుత బడ్జెట్‌తో రగిలిపోతున్నట్లు తెలిపారు. ఆంధ్రుల మనోభావాలను దెబ్బ తీస్తే ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు.

పొత్తులు తేల్చాల్సింది నేను కాదు


హామీల అమలుకు ఐదేళ్లు చాలదు : ఎమ్మెల్సీ సోము వీర్రాజు



ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9: బీజేపీ, టీడీపీల మధ్య స్నేహం, పొత్తు తదితర విషయాలు మాట్లాడాల్సింది తాను కాదని, అవి అమిత్‌షా, చంద్రబాబు నాయుడు చర్చించుకునే విషయాలని బీజేపీ ఎమ్మెల్సీ, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి కేంద్రం ఎంత ఇచ్చిందో, ఏమి చేసిందో, ఏమైనా అన్యాయం చేసిందా తదితర అంశాలన్నీ పవన్ ఆధ్వర్యంలో ఏర్పడనున్న జేఏసీ తేల్చితే బావుంటుందని అభిప్రాయపడుతున్నానన్నారు. తన బొందెలో ప్రాణమున్నంత వరకు బీజేపీ కోసమే శ్వాస ఆడుతుందన్నారు. తన ప్రాణమంతా బీజేపీ కోసమే పనిచేస్తుందని, రాష్ట్రాభివృద్ధికే కృషిచేస్తానన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ప్రత్యేక హోదా ఇచ్చివుంటే ఏపీకి ఏడాదికి రూ.2,500 కోట్లే వచ్చి ఉండేవని, హోదా ఇవ్వకపోవడంవల్ల మూడేళ్లలో ఏపీకి రూ. 1.26 లక్షల కోట్లు వచ్చాయన్నారు. తనను అమిత్‌షా మందలించారని ఒక పత్రికలో వచ్చిన వార్త అర్ధరహితమని సోము వీర్రాజు ఖండించారు. తాను వైసీపీ కోవర్టునని ప్రచారం చేస్తున్నారని, అలా అనుకుంటే అధికారంలోవున్న పార్టీకే ఉండొచ్చు కదా అని ప్రశ్నించారు. కొన్ని పత్రికల ద్వారా తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని, ఎంతమంది తనను అణగదొక్కడానికి ప్రయత్నించినా తాను పార్టీని రక్షించుకుంటూ ముందుకెళ్తానే ఉంటానన్నారు. పోలవరానికి బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోయినా ఇప్పటివరకు రూ.4,600 కోట్లు ఇస్తే, బడ్జెట్‌లో లేకుండానే రూ.417 కోట్లు కేటాయించిందన్నారు. బడ్జెట్‌లో లేకుండానే రోడ్లకు రూ. లక్ష కోట్లు కేటాయింపు జరిగిందని, రైల్వే లైన్లకు రూ.3600 కోట్లు కేటాయించారన్నారు. దేశవ్యాప్తంగా 3600 కిలోమీటర్లు రైల్వే లైన్ల డబ్లింగ్ జరుగుతుంటే, ఏపీలో 900 కిలోమీటర్లు జరుగుతోందని వివరించారు. పోలవరం నిర్మాణానికి అడ్డంకులు తొలగించింది బీజేపీయే అని, 2005లో వైఎస్ ప్రారంభించిన ఈ పథకం టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికి 60 శాతం పూర్తయ్యిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ ఐదేళ్ల కాలంలో అమలు చేయగలరా అని సోము వీర్రాజు ప్రశ్నించారు. దుగ్గరాజుపట్నం, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవన్నీ విభజన చట్టంలో పరిశీలనకు పెట్టారన్నారు. రెవెన్యూ లోటు కింద కేంద్రం రూ.4200 కోట్లు ఇచిందని,, రాష్ట్రం రూ.4000 కోట్లకు నివేదిక ఇచ్చిందని, లెక్కలు పరిశీలిస్తున్నారన్నారు. ఎక్స్‌ట్రనల్ ఎయిడెడ్ ప్రాజెక్టు కింద నేరుగా నాబార్డు ద్వారా రాష్ట్రానికి నిధులివ్వాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని అడిగారన్నారు. దీనికి సంబంధించి పరిశీలన జరుగుతుందన్నారు.

మల్లన్నకు మయూరవాహన సేవ



శ్రీశైలం, ఫిబ్రవరి 9: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మల్లికార్జునస్వామి, భ్రమరాంబిక అమ్మవార్లకు మయూర వాహనసేవ నిర్వహించారు. అక్క మహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మయూర వాహనంపై ఆశీనులను చేయించి హారతి ఇచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముందుభాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో దేవస్థానం ఈవో నారాయణ భరత్‌గుప్తా, అర్చకులు పాల్గొన్నారు. శనివారం స్వామివార్లకు రావణవాహన సేవ నిర్వహిస్తారు.

పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ ఈఓ

తిరుమల తిరుపతి దేవస్థానం వారు శుక్రవారం స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టువస్త్రాలు తీసుకవచ్చిన టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు విడివిడిగా టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు.

కూచిపూడి నాట్య గురు పసుమర్తి కన్నుమూత



విశాఖపట్నం (కల్చరల్), ఫిబ్రవరి 9: కూచిపూడి నాట్య గురు, కేంద్ర సంగీత, నృత్య అకాడెమీ అవార్డు గ్రహీత పసుమర్తి సీతారామయ్య (95) గురువారం అర్ధరాత్రి కన్నుమూశారు. కృష్ణాజిల్లా కూచిపూడిలో జన్మించిన పసుమర్తి సీతారామయ్య 1963లో విశాఖ వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఆంధ్రా యూనివర్శిటీ పాఠశాలలో కూచిపూడి నృత్య అధ్యాపకునిగా సేవలందించిన పసుమర్తి వేలాది మంది కూచిపూడి నృత్య కళాకారులను తీర్చిదిద్దారు. పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత స్వప్న సుందరి కూడా పసుమర్తి వద్ద నాట్యం అభ్యసించిన వారే. ఆయన చివరి శ్వాస విడిచే వరకూ నాట్య పాఠాలు నేర్పిస్తూనే ఉన్నారు. పసుమర్తికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. ఆయన విశాఖలో కూచిపూడి నృత్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పలువురికి శిక్షణ ఇస్తున్నారు. వయసు మీదపడటంతో ఆయన కుమారుడు నృత్య శిక్షణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. నాట్యగురు పసుమర్తికి పలువురు కళాకారులు, శిష్యులు నివాళులర్పించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన అంత్యక్రియలు విశాఖలో నిర్వహించారు.

ప్రత్యేక పీపీ నియామకంపై 12న విచారణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 9: విశాఖ జిల్లా ఏజన్సీ వాకపల్లి ఘటనకు సంబంధించి విచారణ కోర్టులో ప్రత్యేక పీపీగా పి.త్రినాథరావు నియామకాన్ని సవాలుచేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విశాఖపట్నం కలెక్టర్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం వచ్చే సోమవారం విచారించనున్నట్లు ప్రకటించింది. గతనెల 5వ తేదీన హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ కోర్టులో ప్రత్యేక పీపీగా పి త్రినాథరావును నియమించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించారు. దీనిని సవాలు చేస్తూ ఏపీ ప్రభుత్వం, విశాఖ కలెక్టర్ తరపున ఏపీ ప్రభుత్వ న్యాయవాది టి. ప్రద్యుమ్నకుమార్ రెడ్డి పిటిషన్లను ధర్మాసనం వద్ద దాఖలు చేశారు.

ఏప్రిల్ 1నుండి ఐదు జైళ్ళ మూసివేత

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్రంలోని ఐదు జైళ్ళను మూసివేసేందుకు రంగం సిద్ధమైంది. జైళ్ళలలో ఖైదీల సంఖ్య తగ్గిన నేపథ్యంలో ఆ జైళ్ళను మూసివేసి సమీపంలోని జైళ్ళలలో ఆ ప్రాంతంలోని వారిని ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు. ఖమ్మం జిల్లాలోని మధిర, వరంగల్ రూరల్ జిల్లాలోని నర్సంపేట, పరకాల, నిజామాబాద్ జిల్లాలోని బోధన్, ఆర్మూర్ కేంద్రాల్లోని జైళ్ళను మూసివేయాలని జైళ్ళశాఖ డీజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ జైళ్ళలలో ఉన్న కొద్ది మంది ఖైదీలను ఇతర జైళ్ళలోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. అక్కడ ఉన్న సిబ్బందిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో సర్దుబాటు చేయనున్నారు. జైళ్ళ మూసివేతకు డీజీ ఉత్తర్వులు జారీ చేసిన తరువాత రాజకీయ ఒత్తిళ్ళ వల్ల హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డి జైళ్ళను మూసివేయవద్దంటూ మౌఖికంగా అదేశాలు ఇచ్చారు. అయితే దానిని పట్టించుకోని ఉన్నతాధికారులు రెండు రోజుల క్రితం జైళ్ళ మూసివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మరోసారి జిల్లా జైళ్ళ సూపరింటెండెంట్‌లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో ఈ జైళ్ళు ఉన్న ప్రాంతాలలో జడ్జీలు లేకపోవటం, ఖైదీలను ఇతర ప్రాంతాలలోని జడ్జీల వద్ద ప్రవేశపెట్టి అక్కడే ఉన్న జైళ్ళకు రిమాండ్ చేస్తున్నారు. అలాగే ఇటీవల కాలంలో స్టేషన్ బెయిల్ అధికంగా ఇస్తున్న నేపథ్యంలో ఖైదీల సంఖ్య కూడా తగ్గుకుంటూ వస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఐదు జైళ్ళను మూసివేయాలని అదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మరో వైపు ఆయా జైళ్ళలో ఖైదీలు ఉండాల్సిన దానిలో నాలుగో వంతు కూడా ఉండటం లేదని అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఏప్రిల్ మొదటి నుండి ఈ జైళ్ళను పూర్తిగా మూసివేసి ఆ భవనాలను ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

సాక్షి దినపత్రికపై ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు

దేవరపల్లి/విజయవాడ, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం తరపున ముగ్గురు సభ్యుల బృందం సాక్షి తెలుగు దినపత్రికపై శుక్రవారం ప్రెస్‌కౌన్సిల్‌కు ఫిర్యాదుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఢిల్లీ వెళ్లిన ముగ్గురు సభ్యుల బృందం ప్రెస్ కౌన్సిల్ ఛైర్మన్ జస్టిస్ సీకే ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదును అందించింది. సాక్షి దినపత్రిక రాష్ట్రంలో ఒక పార్టీకి కొలబద్ధగా తయారయ్యిందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే దళిత తేజం కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వడంలేదని బృందం ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లింది. పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ప్రకాశం జిల్లా కొండెపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయులు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఈ బృందంలో ఉన్నారు.

ఎంపీలు రాజీనామా చేయాలి: రఘువీరా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు రాజీనామా చేసి కేంద్రంపై పోరాడాలని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని కోరుతూ ఆంధ్రాభవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏపీ కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రఘువీరా మీడియాతోమాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు బీజేపీ యత్నిస్తుంటే టీడీపీ, వైకాపా ప్రత్యేక్షంగా, పరోక్షంగా మద్దతు తెలుపుతున్నాయని ఆరోపించారు. ఏపీ ప్రజల హక్కుల కోసం ఈ రెండు పార్టీలు నాశనం చేస్తున్నాయని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచందర్‌రావు, టి సుబ్బరామిరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం పాల్గొన్నారు.

మోదీ ఇంటి వద్ద ధర్నా చేయండి: చలసాని

విజయవాడ (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9: ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్‌లో ఉద్యమం చేస్తున్న ఎంపీలు రాజీనామాలు చేయవద్దని, ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ కోరారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధన సమితి గత నాలుగు సంవత్సరాలుగా అనేక ఉద్యమాలు చేస్తున్నా ప్రోత్సాహించిన వారు లేరన్నారు. పార్లమెంటు సభ్యులు రాజీనామా చేసే ఆలోచన వద్దని, ఉద్యమాన్ని ఉద్ధృతం చేసి ప్రధాని నరేంద్రమోదీ ఇంటి ముందు 35మంది పార్లమెంటు సభ్యులు ధర్నా చేయాలని పిలుపునిచ్చారు. చేసిన పాపాలను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ బంద్‌కు మద్దతు ఇచ్చిదని, బంద్‌కు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు ధన్యవాదాలన్నారు. పార్లమెంట్‌లో ఎంపీలు అందరు కలిసి పోరాడాలని ప్రతిపక్ష నేత జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎంపీలందరూ సమైక్యంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంలో ఏపీ టాప్

23 రకాల పంటలకు కనీస మద్దతు ధర అమలు ■ నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్



విలేఖరులతో మాట్లాడుతున్న నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్‌చంద్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 9: ప్రస్తుతం దేశవ్యాప్తంగా 83 శాతం విస్తీర్ణంలో పండే 23 రకాల పంటలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటించి అమలు చేస్తోందని నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ రమేష్‌చంద్ వెల్లడించారు. రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అమలుచేస్తున్న జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన ఆయన శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకృతి వ్యవసాయంలో, టెక్నాలజీ వంటి రంగాల్లో దేశంలో మిగతా రాష్ట్రాల కంటే ముందు ఉందని ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో అనేక ఉత్తమ విధానాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వివిధ పంటలకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం 23 రకాల పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించి అమలు చేస్తోందని, దానివల్ల రైతులకు ప్రయోజనం కలుగుతోందని చెప్పారు. రైతు ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర బడ్జెట్‌లో అనేక పథకాలను ప్రవేశపెట్టారని, పంట దిగుబడులకు అనుగుణంగా ధరల స్థిరీకరణకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు తగిన భరోసా కల్పించేందుకు అన్ని విధాలా కృషి జరుగుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఆహార శుద్ధి సంస్థ వద్ద పెద్దఎత్తున నిధులు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకుని పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన కోల్డు స్టోరేజ్‌లు, గిడ్డంగులు వంటివి నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, రైతులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని రమేష్‌చంద్ సూచించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జీరో బేస్డ్ ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు పూర్తి సానుకూలంగా ఉన్నారని తన రెండు రోజుల పర్యటన సందర్భంగా వివిధ వర్గాల రైతులతో మాట్లాడినప్పుడు గమనించామని ఆయన పేర్కొన్నారు. రానురాను రసాయన ఎరువులతో సాగు కంటే ప్రకృతి వ్యవసాయ సేద్యానికి రైతులు ఆసక్తి చూపడం శుభ పరిణామమని ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. ఈ విధానంపై రైతులందరిలో మరింత అవగాహనను కలిగించేందుకు మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో పెద్దఎత్తున మైక్రో ఇరిగేషన్ చర్యలు తీసుకోవడంతోపాటు రైతులను పంటల మార్పిడి విధానానికి ప్రోత్సహించడం ప్రశంసించదగ్గ విషయమని పేర్కొన్నారు. వ్యవసాయంతోపాటు ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి పెద్దఎత్తున చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అప్పుడే రైతులకు తగిన లబ్ధి చేకూరుతుందని అన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ విధమైన సూచనలు, సలహాలను అందిస్తారని రమేష్‌చంద్ సమాధానం ఇస్తూ, రైతులు పండించిన పంటలకు తగిన ధరలను కల్పించడంతోపాటు రైతులకు పంటల బీమా వంటివి కల్పించి వారి ఆదాయాన్ని పెంపొందించే చర్యలు తీసుకోగలిగితే రైతు ఆత్మహత్యలను నివారించవచ్చని ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిందిగా సూచిస్తున్నామని వివరించారు. ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను, రాయితీలను ప్రకటించారని గుర్తుచేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు టి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ 2016-17 ఏడాదిలో 40వేల 656 మంది రైతులను జీరో బేస్డ్ ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేపట్టేందుకు 704 కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రెండవ ఏడాదిగా ఈ ఏడాది 334 మండలాల్లోని 874 గ్రామాల్లో 401 క్లస్టర్లలో లక్షా 63వేల 100 మంది రైతులను ఈ ప్రకృతి వ్యవసాయం కిందకు తీసుకువచ్చామన్నారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరిజవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లండి

సీపీఐ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ ■ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు 18న రౌండ్ టేబుల్



విలేఖరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 9: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సహా విభజన హామీలన్నింటినీ సాధించేందుకు అఖిపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లేందుకు టీడీపీ చొరవ తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. పార్టీ విశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాటు బీజేపీని నెత్తినపెట్టుకున్నారు. చివరి బడ్జెట్‌లో కూడా రాష్ట్రానికి మొండి చేయి చూపడంతో టీడీపీ కళ్లు తెరవడం మంచి పరిణామమేనన్నారు. రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ బీజేపీ మినహా ఎంపీలంతా కేంద్రాన్ని నిలదీయడం ద్వారా రాష్ట్ర ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తిని వ్యక్తీకరించారన్నారు. ఇదే తీరు భవిష్యత్‌లోనూ కొనసాగాలని, అన్ని రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుని ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకు టీడీపీ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై పాతగాయాలను రేపేవిధంగా ఉందని, కేవలం కాంగ్రెస్‌పై విమర్శలకే మోదీ పరిమితమయ్యారని ఆరోపించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా రూ.24,600 కోట్ల ప్యాకేజీ ఇవ్వాల్సి ఉండగా, జిల్లాకు కేవలం రూ.50 కోట్లతో సరిపెట్టి ఆంధ్రప్రదేశ్‌పై మోదీ తన కక్ష తీర్చుకుంటున్నారన్నారు. కడపలో ఉక్కు కర్మాగారం, దుగరాజపట్నం పోర్టు నిర్మాణం ఊసేలేదన్నారు. విభజన చట్టంలో పేర్కొన మేరకు నవ్యాంధ్ర రాజధాని అమరావతిని పూర్తిగా కేంద్రమే నిర్మించాలని అయితే ప్రపంచ బ్యాంకు రుణం ఇప్పిస్తామంటున్నారని, అలాగే పోలవరం జాతీయ ప్రాజెక్టుకు నాబార్డు నుంచి రుణం మంజూరు చేయిస్తామంటున్నారని మండిపడ్డారు. విభజన నాటికి రూ.96వేల కోట్ల రుణ భారంతో ఉన్న ఏపీ ప్రస్తుతం రూ.2.26 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. గత నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి పోరాడుతోందన్నారు. హోదా, హామీల అమలు సాధించే వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. దీనిలో భాగంగానే ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న విజయవాడ వేదికగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏపీలో 25 మంది పార్లమెంట్ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులను ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆహ్వానిస్తున్నామన్నారు. వివక్షపై రాష్ట్ర బీజేపీ స్పందించాలని డిమాండ్ చేశారు.

జీడీపీపై బాబు చెప్పేవన్నీ అబద్ధాలే

పీఏసి ఛైర్మన్, వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 9: ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీని సాధించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారని పీఏసీ ఛైర్మన్, వైకాపా ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఇక్కడ విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక హోదా విషయంలో ఎన్నికల ముందు చంద్రబాబు సంజీవని అని, తీరా అధికారంలోకి వచ్చాక అదేమైనా సంజీవనా అని అన్నారన్నారు. కోడలు మగ బిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా అని చంద్రబాబు హేళనగా అన్నారన్నారు. ఒక పద్ధతి ప్రకారం రాజధాని నిర్మించాలని ప్రతిపక్షంగా సూచిస్తే చంద్రబాబు తమ పార్టీ మాటలు వినకుండా ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తానని గొప్పలు చెప్పారన్నారు. న్యూయార్కు, సింగపూర్, కలకత్తా అంత గొప్పనగరాన్ని కట్టబోతున్నట్లు చెప్పారన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికి పోయిన తర్వాత చంద్రబాబు అమరావతికి పరుగులు తీశారన్నారు. ఏ దేశం వెళ్తే ఆ దేశం లాంటి రాజధాని కడతానని చెప్పిన చంద్రబాబు బాహుబలి సినిమా డైరెక్టర్ రాజమౌళికి రాజధాని డిజైన్లు అప్పగిస్తామన్నారన్నారు. ఏప్రిలో 12 శాతం జీడీపీ సాధించామని గొప్పలు చెప్పారని, అంత గొప్ప జీడీపీ ఉంటే ఏపిలో ఎందుకు రెవెన్యూ లోటు వస్తుందన్నారు. రాజధాని నిర్మాణం సినిమా డైరెక్టర్లకు సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. బెంగళూరు విధాన పరిషత్‌ను నాలుగేళ్లలో బ్రహ్మాండంగా కట్టారన్నారు. పరిపాలన గొప్పగా ఉందని చెప్పుకునేందుకు అబద్ధాలు చెప్పడంతో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. దీనికి సంపూర్ణ బాధ్యత చంద్రబాబుదేనన్నారు. వెనకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు తీసుకురావాల్సిందేనని చెప్పారు.



వెటర్నరీ యూనివర్శిటీలో భవనాల నమూనాలు పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

తాత్కాలిక హైకోర్టు భవనాల నమూనాలను పరిశీలించిన హైకోర్టు జడ్జీలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 8: ఆంధ్రప్రదేశ్ రాజధానిలో తాత్కాలికంగా హైకోర్టు ఏర్పాటు చేసేందుకు అనువైన భవనాలను హైకోర్టు జడ్జీలు శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తుల బృందం మూడు రోజులపాటు నగరంలో పర్యటించేందుకు హైదరాబాద్ నుండి విమానంలో గన్నవరం చేరుకుంది. వారికి గన్నవరం విమానాశ్రయంలో జిల్లా జడ్జీలు జస్టిస్ వై.లక్ష్మణరావు, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, పలువురు న్యాయమూర్తులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తుల బృందం గన్నవరంలోని వెటర్నరీ యూనివర్శిటీ భవనాన్ని పరిశీలించింది. హైకోర్టు భవన పరిశీలనకు విచ్చేసిన బృందంలో జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ పి.సత్యనారాయణమూర్తి ఉన్నారు. వీరికి వెటర్నరీ యూనివర్శిటీ డీన్ డా.జి.శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ పి.శ్రీమన్నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎఎల్ మాధవ స్వరూప్, డీఈ కిషోర్ బాబ్జీలు, యూనివర్శిటీ భవనాలకు సంబంధించిన ఆకృతులను, ప్రాంగణాన్ని చూపించారు.

లాభాల దిశగా విశాఖ స్టీల్ పరుగులు

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్ల లాభం ■ గణనీయంగా తగ్గిన నిర్వహణ నష్టం ■ గ్రామీణ ప్రాంతాలకు విశాఖ ఉక్కు

ఆంధ్రభూమి బ్యూరో



విలేఖరులతో మాట్లాడుతున్న స్టీల్ ప్లాంట్ సీఎండీ మధుసూదన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 9: జాతీయ, అంతర్జాతీయ స్టీల్ మార్కెట్‌లో ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల వైపు పరుగులు తీస్తోందని స్టీల్ ప్లాంట్ సీఎండీ మధుసూదన్ వెల్లడించారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015-16లో స్టీల్ ప్లాంట్‌కు 790 కోట్ల రూపాయలు, 2016-17లో 264 కోట్ల రూపాయల నష్టం వచ్చిందని అన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నష్టాలు రాలేదని, మార్చి నెలాఖరుకు 100 కోట్ల రూపాయల లాభాన్ని ఆర్జించే అవకాశం ఉందని చెప్పారు. కాగా, ఇప్పటి వరకూ ఉన్న నిర్వహణా నష్టాన్ని ఈ ఏడాది 900 కోట్ల రూపాయలకు తగ్గించగలిగామని ఆయన వివరించారు. స్టీల్ ఉత్పత్తికి కావల్సిన ముడి సరుకు ధర విపరీతంగా పెరగడం, కొద్ది కాలం పాటు ఐరన్ ఓర్ సరఫరాలో అంతరాయం ఏర్పడడం, మార్కెట్‌లో స్టీల్ ధరలు గణనీయంగా తగ్గిపోవడం వలన గత సంవత్సరం వరకూ స్టీల్ ప్లాంట్ నష్టాలు చవిచూడాల్సి వచ్చిందని అన్నారు. ఐరన్ ఓర్ ధర డిసెంబర్, జనవరి మధ్య టన్నుకు 300-500 రూపాయలు పెరిగిందని ఆయన చెప్పారు. 6.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంగా చేపట్టిన విస్తరణ పనులు పూర్తయ్యాయని, బ్లాస్ట్‌ఫర్నేస్-1,2లను ఎస్ఎంఎస్ మూడు కన్వర్టర్లను ఆధునీకరించడం వలన గణనీయమైన ఉత్పత్తిని సాధించగలుగుతున్నామని మధుసూదన్ తెలియచేశారు. పీసీఐ టెక్నాలజీని వినియోగించి బ్లాస్ ఫర్నేసలలో లోక్లాస్ కోల్ వాడి, హైక్లాస్ కోల్‌కు సరిసమానమైన ఉత్పత్తి సాధించగలుగుతున్నామని ఆయన తెలియచేశారు. ఈ ఏడాది జనవరిలో ఐదు లక్షల ఉక్కు ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించామని ఆయన చెప్పారు. అలాగే గత ఏడాది ఒక్క డిసెంబర్ నెలలోనే 2000 కోట్ల టర్నోవర్ సాధించి, రికార్డు నెలకొల్పామని అన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనుల కోసం నిరంతర ప్రయత్నం చేస్తున్నామని మధుసూదన్ తెలియచేశారు. గనుల కేటాయింపు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశం. రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆంక్షలు విధించడం వలన స్టీల్ ప్లాంట్‌కు గనులు దక్కడం లేదని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఐరన్ ఓర్ గనులను దక్కించుకునేందుకు విశాఖ స్టీల్ ప్లాంట్ ఆక్షన్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కనబరిచిందని, అనివార్య కారణాల వలన వాటిని దక్కించుకోలేకపోయామని చెప్పారు. రాజస్థాన్‌లో కూడా ఐరన్ ఓర్ గనులను దక్కించుకోవాలని ప్రయత్నించామని, కానీ, వివిధ కారణాల వలన విరమించుకున్నామని సీఎండీ తెలియచేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరులో ఐరన్ ఓర్ గనులను గుర్తించారని, వీటిని స్టీల్ ప్లాంట్‌కు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, ఏదైనా జాయింట్ వెంచర్ కంపెనీతో కలిసి, ఆ గనులు వెలికి తీస్తామని మధుసూదన్ వెల్లడించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి 10 శాతం వాటాలను ఉపసంహరించుకునేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, అయితే, అది ఎప్పుడు, ఏవిధంగా జరుగతుందో స్పష్టత లేదని ఆయన చెప్పరు. స్టీల్ ప్లాంట్ నుంచి 10 శాతం వాటాలను విక్రయించడం వలన 489 కోట్ల రూపాయలు వస్తుందని, అయితే, ఈ మొత్తం కేంద్ర ప్రభుత్వ ఖజానాకు చేరుతుందా? స్టీల్ ప్లాంట్ అవసరాలకు ఉపయోగిస్తారా? అన్నది ఇదమిద్ధంగా ఉందని సీఎండీ పేర్కొన్నారు.

అమరావతిలో పెరిగిన విశాఖ స్టీల్ వాడకం

అమరావతిలో విశాఖ స్టీల్ వినియోగం గణనీయంగా పెరిగిందని సీఎండీ మధుసూదన్ తెలియచేశారు. గతంలో సంవత్సరానికి 30 నుంచి 35 వేల టన్నుల స్టీల్ వినియోగించేవారని, గడచిన 10 నెలల్లో లక్ష టన్నుల స్టీల్ విక్రయాలు ఆ ప్రాంతంలో జరిగాయని అన్నారు. ఇక విశాక స్టీల్ దృష్టి ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలపై ఉందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే నిర్మాణాల్లో విశాఖ స్టీల్‌ను విరివిగా వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డీలర్స్ నెట్‌వర్క్‌ను పటిష్ఠం చేయనున్నామని తెలిపారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

శనివారం, 10 ఫిబ్రవరి 2018

వ్యూహాత్మక వైఫల్యం

మాల్‌దీవుల ప్రభుత్వ 'ప్రత్యేక దూత' మన దేశానికి రాకూడదని మన ప్రభుత్వం గురువారం నిర్దేశించడం దౌత్య వైపరీత్యం. ఈ వైపరీత్యానికి ఒడిగట్టడం వల్ల కల్లోలగ్రస్తమై ఉన్న మాల్‌దీవుల్లో ప్రశాంత స్థితిని నెలకొల్పడానికి వీలుగా 'మధ్య వర్తిత్వం' వహించే అవకాశాన్ని మన ప్రభుత్వం మరోసారి జారవిడుచుకుంది. మాల్‌దీవుల్లో తన నియంతృత్వ 'పాలన'ను శాశ్వతం చేసుకొనడానికి అబ్దుల్లా యమీన్ చేస్తున్న ప్రయత్నం ప్రస్తుత కల్లోలానికి కారణం. రాజకీయ ప్రత్యర్థులను జైళ్లపాలు చేసిన యమీన్ తమ దేశంలోని సర్వోన్నత న్యాయస్థానం- సుప్రీం కోర్టు- జారీ చేసిన ఆదేశాలను లెక్కచేయకపోవడంతో మాల్‌దీవుల్లో సంక్షోభం ముదిరింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడు మహమ్మద్ నషీద్‌ను 2012లో ప్రభుత్వ సాయుధ దళాలు పదవి నుంచి తొలగించిన నాటి నుంచి మాల్‌దీవుల్లో 'రాజ్యాంగ ప్రక్రియ' కూలబడి ఉంది. ప్రస్తుతం పెత్తనం చెలాయిస్తున్న అబ్దుల్లా యమీన్ 'పోలీసుల-సైనికుల' మద్దతుతో అరాజకం సృష్టిస్తున్నాడు, రాజకీయ ప్రత్యర్థులను నిర్బంధించాడు. అన్యాయంగా పదవీచ్యుతుడైన మహమ్మద్ నషీద్ శ్రీలంక నుంచి తన ప్రజాస్వామ్య ఉద్యమాన్ని కొనసాగిస్తున్నాడు. ఆయన నాయకత్వంలోని మాల్‌దీవ్ ప్రజాస్వామ్య పక్షం- మాల్‌దీవియన్ డెమొక్రాటిక్ పార్టీ- ఎండీపీ- ప్రస్తుతం శ్రీలంక రాజధాని కొలంబోలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేసుకుంది. నిర్బంధంలో ఉన్న మరో మాజీ అధ్యక్షుడు అబ్దుల్ మామున్ గయూమ్‌ను, మరో ఎనిమిది మంది రాజకీయ నాయకులను నిర్బంధం నుంచి విడుదల చేయవలసిందిగా సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాన్ని యమీన్ తిరస్కరించాడు. తమ దేశంలో ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థను పునరుద్ధరించడానికి వీలుగా జోక్యం చేసుకోవాలని మాల్‌దీవుల సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఈనెల నాలుగవ తేదీన మన ప్రభుత్వాన్ని అర్థించారు. కానీ మన ప్రభుత్వం మౌనం వహించింది. తమ ప్రజాస్వామ్య రాజ్యాంగ సార్వభౌమ వ్యవస్థను యమీన్ నియంతృత్వం నుంచి విముక్తం చేయడానికై జోక్యం చేసుకోవాలని ఏడవ తేదీన మహమ్మద్ నషీద్ మన ప్రభుత్వాన్ని కోరాడు. ఇది రెండవ అభ్యర్థన! సుప్రీం కోర్టు ఆదేశాన్ని ఖాతరు చేయని యమీన్ ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితి- ఎమర్జన్సీ-ని ప్రకటించింది. సర్వోన్నత న్యాయమూర్తులపై అసత్య అభియోగాలను నమోదు చేసింది, వారిని నిర్బంధించడానికి రంగం సిద్ధం చేసింది. ప్రతిపక్ష రాజకీయ నాయకులను నిర్బంధం నుంచి విడుదల చేయాలన్న తమ తీర్పును సర్వోన్నత న్యాయమూర్తులు రద్దు చేశారన్న ప్రచారాన్ని కూడా యమీన్ ప్రభుత్వం చేయిస్తోంది. కానీ ఇరుగు పొరుగు దేశాల్లో మాత్రమే గాక అంతర్జాతీయంగా ఈ 'కల్లోలం' గురించి ప్రచారం అవుతుండడంతో యమీన్ భయపడుతున్నాడు. అందువల్ల మన ప్రభుత్వానికి తన వాదం వినిపించడానికై ప్రత్యేక ప్రతినిధిని మన దేశానికి పంపిస్తున్నట్టు యమీన్ ప్రకటించాడు. కానీ మన ప్రభుత్వం మాత్రం 'ప్రత్యేక దూత'ను రానివ్వరాదని నిర్ణయించింది..

మాల్‌దీవుల్లోకి చైనా చొరబడకుండా నిరోధించలేకపోవడం మన విదేశాంగ విధాన వైఫల్యం. ఈ వైఫల్యం దశాబ్దికి పైగా కొనసాగుతున్న మన 'నిర్లిప్తత' ఫలితం! మన దేశానికి నైరృతి దిశలో హిందూ మహాసముద్రంలో నెలకొని ఉన్న చిన్న దేశం 'మాల్‌దీవులు'. మాలా ద్వీపాలుగాను, పగడాల ద్వీపాలుగాను ప్రసిద్ధికెక్కిన మాల్‌దీవులు ఒకప్పుడు మన దేశంలో భాగం. క్రీస్తుశకం పన్నెండవ శతాబ్ది నుంచి జిహాదీలు, ఆ తరువాత ఐరోపావారు దురాక్రమించిన కారణంగా 'మాలా ద్వీపాలు' మన దేశం నుంచి విడిపోయి ప్రత్యేక దేశంగా ఏర్పడింది. మన లక్ష ద్వీపాలకు అత్యంత సమీపంలో ఉన్న మాల్‌దీవులు 2000వ సంవత్సరం వరకూ మనకు సన్నిహిత మిత్రదేశం. మాల్‌దీవులకు, లక్ష ద్వీపాలకు మధ్య ఉన్న ఇరుకైన సముద్రం 'అంతర్జాతీయ జలమార్గం'గా ఏర్పడి ఉండడం ఉభయ దేశాల భద్రతతో ముడివడి ఉన్న భౌగోళిక వాస్తవం. చైనా 2010లో మాల్‌దీవుల్లో దౌత్య కార్యాలయం ఏర్పరచుకొన్న నాటి నుంచి 'మాల్‌దీవులు' మనకు దూరంగా జరుగుతోంది. మన దేశానికి దక్షిణంగా ఉన్న మాల్‌దీవులతో చైనాకు ఎలాంటి చారిత్రక సంబంధాలు లేవు. కేవలం మన దేశాన్ని దక్షిణం వైపునుంచి దిగ్బంధం చేయడానికి వీలుగా చైనా యుద్ధనౌకలు, గస్తీ నౌకలు, జలాంతర్గాములు మాల్‌దీవుల్లో, శ్రీలంకలో తరచూ తిష్ఠ వేస్తున్నాయి. శ్రీలంకలోని 'హంబన్ తోట' ఓడరేవును చైనా అభివృద్ధి చేయడం 'భారత్‌ను దిగ్బంధం చేసే' వ్యూహంలో భాగం. కానీ గుట్టుచప్పుడు కాకుండా చైనా కొనసాగిస్తున్న ఈ 'విస్తరణ' కుట్రను మన ప్రభుత్వం ఏళ్ల తరబడి నిరోధించలేక పోవడం మాల్‌దీవుల సంక్షోభానికి కారణం. పాక్, చైనాలు కలసికట్టుగా మాల్‌దీవుల్లో జిహాదీలను సమర్థిస్తున్నాయి. 2012లో 'పోలీసులు-సైనికులు' తిరుగుబాటు చేసి నషీద్‌ను- మాల్‌దీవుల్లో మొదటిసారి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నషీద్‌ను తొలగించడానికి 'పాకిస్తాన్- చైనా' ఉమ్మడి షడ్మంత్రం కారణం. మాల్‌దీవుల్లో 'పోలీసులు-సైనికులు' ఒకే ఏకీకృత వ్యవస్థ.. వీరిలో అత్యధికులు జిహాదీలు..

నషీద్‌పై పోలీసులు తిరుగుబాటు చేసిన సమయంలోనే మన ప్రభు త్వం సైనిక జోక్యం చేసుకుని ఉండవలసింది. గయూమ్‌పై 'కిరాయి' జిహాదీ మూకలు తిరుగుబాటు చేశాయి. ఆ సమయంలో మన సైనికులు- నౌకాదళం వారు వె ళ్లి కిరాయి మూకల నుంచి మాల్‌దీవుల ప్రభుత్వాన్ని విముక్తం చేశారు. మాల్‌దీవుల ప్రభుత్వ అభ్యర్థన మేరకు మన ప్రభుత్వం ఈ 'విముక్తి'ని ప్రసాదించింది. 'భారతీయులు విముక్తి ప్రదాతలు, విస్తరణవాదులు కాదు, దురాక్రమణ కారకులు కాదు..' అని నషీద్ ఈ నెల ఏడవ తేదీన అభివర్ణించడానికి ఇదీ నేపథ్యం. కానీ 2012లో నషీద్ సైనిక సహాయం కోరినపుడు మన ప్రభుత్వం సహాయం చేయలేదు. ఇది మన ప్రభుత్వం చేసిన వ్యూహాత్మక మహాపరాధం. 1988లో వలెనే 2012లో కూడ మన నౌకాదళం మాల్‌దీవులకు వెళ్లి ఉండినట్టయితే ప్రజాస్వామ్య ప్రభుత్వం కూలిపోకుండా నిలబడి ఉండేది. మహమ్మద్ నషీద్ పదవీచ్యుతుడై ఉండేవాడు కాదు. ఇరుగు పొరుగు దేశాల్లోని ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మనతో మైత్రిని పాటిస్తున్నాయి. కానీ నేపాల్‌లోని మావోయిస్టులు, మాల్‌దీవుల్లోని జిహాదీలు, బర్మా- మ్యాన్మార్-లోని మాజీ సైనిక నియంతలు చైనా మద్దతుదారులు..

చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం 2012 నాటి మన విధానం. కనీసం ఇప్పుడైనా మన ప్రభుత్వం మధ్యవర్తిత్వం ద్వారా కాని, సైనికచర్య ద్వారా కాని మాల్‌దీవుల్లో ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థను, మానవ అధికారాలను పునరుద్ధరించడానికి పూనుకోవాలి. 2012 నాటి మన నిర్లిప్త విధానం వల్ల చైనా ఇప్పటికే ఆర్థికంగా, వ్యూహాత్మకంగా మాల్‌దీవుల్లో ప్రాబల్యం పెంచుకొంది. మనం మధ్యవర్తిత్వాన్ని తిరస్కరించినట్టయితే ఆ 'బాధ్యత'ను నిర్వహించడానికి చైనా సిద్ధంగా ఉంది. మధ్యవర్తిత్వం నిర్వహించడానికి తాను సిద్ధమని చైనా ప్రకటించింది కూడ. నషీద్ మన దేశాన్ని ప్రశంసించడానికి, చైనాను 'దురాక్రమణ శక్తి'గా వర్ణించడానికి ఇదీ నేపథ్యం.


'మధ్య తరగతి' పెదవి విరుపు ఎందుకు?

ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మరుక్షణం ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు, రైతులు, పేదలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. కొన్ని వర్గాలకు రాయితీలు ప్రకటించిన జైట్లీ తమను పూర్తిగా విస్మరించారని ముఖ్యంగా మధ్య తరగతి వారు వాపోయారు. నిజాయితీగా పన్నులు చెల్లిస్తున్నది తామే అయినా తమను పట్టించుకోలేదని వీరు విమర్శలు గుప్పించారు. భారతీయ జనతాపార్టీకి తొలినుండి దన్నుగా ఉంటున్న తమను విస్మరించి, ఇన్నాళ్లూ పార్టీకి దూరంగా వుంటున్న పేదలను ఆకట్టుకునేలా బడ్జెట్ రూపొందించారన్న నిరసనలు మధ్య తరగతి జీవుల్లో చెలరేగుతున్నాయి. భాజపా పాలిత రాష్ట్రాలలో ఆందోళనలకు దిగుతున్న రైతులు, వ్యవసాయ ఆధారిత వర్గాలను ఆకట్టుకునేందుకు జైట్లీ ప్రయత్నం చేశారని అంటున్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా అటువంటి ప్రయత్నం చేయకుండా ఉండలేదు. ఆ ప్రయత్నాల వల్ల సంబంధిత వర్గాలకు ఏ మేరకు ప్రయోజనం కలుగుతుందన్నది వేరే విషయం.

బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని పెంచుతారని ఉద్యోగులు ఎంతగానో ఆశలు పెట్టుకున్నా వారికి ఫలితం దక్కలేదు. దీంతో ఉద్యోగులలో సహజంగానే అసంతృప్తి చెలరేగింది. 'మా ఓట్లు లేకుండా, మా సహకారం లేకుండా మోదీ మళ్లీ ప్రధాని అవుతారా?' అంటూ మొన్నటివరకు ఆయనకు వీరాభిమానులుగా ఉన్నవారు సైతం ఇప్పుడు శపించడం ప్రారంభించారు. దేశ జనాభాలో మధ్య తరగతి వారు ఇప్పుడు 10 శాతంగా ఉన్నప్పటికీ, 2040 నాటికి వీరు 70 శాతం నుండి 80 శాతానికి పెరిగే అవకాశం ఉందన్న అంచనాలున్నాయి. ఏ సమాజంలోనైనా మధ్య తరగతి ప్రజల సంక్షేమంతోనే ఆ దేశ పురోభివృద్ధి ఆధారపడి వుంటుందని ఆర్థికవేత్తలు చెబుతూ ఉంటారు. ఎందుకంటే వారు అటు పేదలకు, ఇటు ధనికులకు మధ్య వారధులుగా ఉంటారు. పేదల పట్ల సానుభూతి చూపి, వారి ఉన్నతి కోసం ఆరాటపడేది వీరే కావడం గమనార్హం. జీతాలు, పెన్షన్లు పొందుతున్నవారు ఆదాయపు పన్ను పరిమితి గురించి బడ్జెట్‌లో జైట్లీ ప్రస్తావించకపోవడంతో కంగుతిన్నారు. వాస్తవానికి దేశంలో తక్కువ పనికి ఎక్కువ జీతాలు పొందేవారెవరైనా ఉంటే వారు ప్రభుత్వ ఉద్యోగులే అని చెప్పాలి. వారికి ఉన్న సౌకర్యాలు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు వంటి అవకాశాలు ఇతర రంగాల్లో దాదాపుగా లేవని చెప్పవచ్చు. ప్రైవేటు రంగంలో భారీ జీతాలు పొందే ఐటి ఉద్యోగులు రాత్రికి రాత్రి నిరుద్యోగులుగా మారడం మనం చూస్తునే ఉన్నాం.

కేంద్రీయ విద్యాలయాలలో ఒక్కొక్క విద్యార్థి చదువుకు కేంద్ర ప్రభుత్వం రూ.40వేలకు పైగా ఖర్చుపెడుతోంది. అంత భారీ వ్యయం హైదరాబాద్ వంటి నగరాల్లో ఉండే కార్పొరేట్ పాఠశాలలో కూడా పెట్టడం లేదు. ఆదాయపు పన్ను పరిమితిని మాత్రమే కాకుండా ఇటువంటి పలు సదుపాయాలను సైతం ఉద్యోగుల విషయంలో పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగుల కన్నా ఉన్నత చదువులు చదివి, మంచి నైపుణ్యం ఉన్నవారు అనేకమంది నామమాత్రపు జీతాలకు పనిచేస్తుండడం తెలిసిందే. అయినా పని పట్ల నిర్లక్ష్యం, నిరాసక్తత చూపడంలో ప్రభుత్వ ఉద్యోగులను మించినవారెవ్వరూ ఉండరు. బలమైన యూనియన్లు ఉండడంతో వారిని ప్రశ్నించే సాహసం ఏ ప్రభుత్వం చేయదు. చివరకు అనైతిక పనులకు పాల్పడినా వారిపై క్రమశిక్షణ చర్య తీసుకోవడం చాలా అరుదు. పన్ను రాయితీలు కల్పించకపోయినా ఉద్యోగులను విస్మరించి జైట్లీ ప్రభుత్వాన్ని నడపగలరని ఆశించలేము. అందుకే వారికి అంతకన్నా ఎక్కువ ప్రయోజనం కలిగించే అనేక రాయితీలు కల్పించారు. గత నాలుగేళ్లుగా 'మిగులు డబ్బు'ను మధ్య తరగతి చేతుల్లోనే పెడుతూ వస్తున్నామని జైట్లీ పేర్కొనడం గమనార్హం. దీనికి సంబంధించి కొన్ని చర్యలను గమనించాల్సిందే.

ఉదాహరణకు 2013లో గృహ రుణాలపై వడ్డీలు 9.5 నుండి 11.25 శాతం వరకు ఉన్నాయి. ఇప్పుడు ఎస్‌బిఐ 8.5 శాతానికి తగ్గించింది. మిగిలిన బ్యాంకులు కూడా దాదాపు అదే రీతిలో తగ్గించాయి. ఇంటి నిర్మాణానికి రూ. 30 లక్షల రుణం తీసుకొంటే, కనీసం 2 శాతం వడ్డీ తగ్గినా తద్వారా ఏటా రూ.45 వేలు మేరకు అదనపు ప్రయోజనం కలుగుతుంది. ఈ ప్రయోజనం ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకే కదా ఎక్కువగా వర్తించేది! 2013లో సగటున వినియోగ ధరల సూచిక 10.92 శాతంగా ఉండగా, ఇప్పుడు 2.49 శాతానికి తగ్గింది. వినియోగ వస్తువుల ధరలు తగ్గితే కలిగే ప్రయోజనాన్ని ఎవరైనా సులభంగా అంచనా వేయవచ్చు. 2013లో ద్రవ్య లోటు 4.1 శాతంగా ఉంటే, ఇప్పుడు 3.3 శాతానికి దిగింది. ద్రవ్యోల్బణం అదుపులో ఉంటూ ప్రభుత్వానికి పన్నులు చెల్లించేవారి సంఖ్యతో పాటు ఎగుమతులు, పెట్టుబడులు పెరిగి ఆర్థిక వ్యవస్థలో కదలిక ఏర్పడుతుంది. దీంతో కలిగే ప్రయోజనాలు ఎక్కువగా ఈ



2013లో గృహ రుణాలపై వడ్డీలు 9.5 నుండి 11.25 శాతం వరకు ఉన్నాయి. ఇప్పుడు ఎస్‌బిఐ 8.5 శాతానికి తగ్గించింది. మిగిలిన బ్యాంకులు కూడా దాదాపు అదే రీతిలో తగ్గించాయి. ఇంటి నిర్మాణానికి రూ. 30 లక్షల రుణం తీసుకొంటే, కనీసం 2 శాతం వడ్డీ తగ్గినా తద్వారా ఏటా రూ.45 వేలు మేరకు అదనపు ప్రయోజనం కలుగుతుంది. ఈ ప్రయోజనం ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకే కదా ఎక్కువగా వర్తించేది! 2013లో సగటున వినియోగ ధరల సూచిక 10.92 శాతంగా ఉండగా, ఇప్పుడు 2.49 శాతానికి తగ్గింది. వినియోగ వస్తువుల ధరలు తగ్గితే కలిగే ప్రయోజనాన్ని ఎవరైనా సులభంగా అంచనా వేయవచ్చు.

వర్గాలకే చేరుతాయని గమనించాలి.

మనమంతా ఆందోళన చెందవలసింది పెట్రోల్ ధరలు నిత్యం పెరుగుతూ ఉండడం. 2013లో ముంబయిలో లీటర్ పెట్రోల్ రూ.78.46కాగా, ఇప్పుడు 81రూపాయలకు చేరింది. డీజిల్ ధర కూడా ఎనిమిది రూపాయలు పైగా పెరిగింది. జైట్లీ ఆర్థిక మంత్రిగా వచ్చిననాటికన్న ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోల్ ధరలు 40 శాతానికి పైగా తగ్గినా, దేశంలో మాత్రం ఎప్పటికన్నా ఎక్కువగానే ధరలున్నాయి. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి గత ఆరు నెలల్లో అంతర్జాతీయంగా 70 శాతం మేరకు ధరలు పెరిగాయని మాత్రమే చెబుతున్నారు. చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు ఆదాయపు పన్ను పరిమితి రూ.2.5 లక్షల నుండి రూ.3 లక్షలకు పెరుగుతుందని ఎదురుచూశారు. ఆ విధంగా జరిగితే ఉద్యోగులు సాలీనా రూ.2,500 వరకూ పొదుపు చేసే అవకాశం ఉండేది. ఇతరత్రా లభించిన ప్రయోజనాలతో పోల్చితే అదంత ఎక్కువ మొత్తమా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ మొత్తం వ్యక్తిగతంగా చాలా చిన్నదే అయినా ప్రభుత్వం మాత్రం రూ.15,750 కోట్ల మేరకు ఆదాయం కోల్పోవలసి వస్తుంది. దాని ప్రభావం బడ్జెట్‌పైన ఎక్కువగానే ఉంటుంది. ఆ మొత్తం ద్రవ్య లోటుకు తోడయితే ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది.

యూపీఏ హయాంలో 2006 నుండి 2009 వరకు ఆదాయపు పన్ను పరిమితిని రూ.1.6 లక్షల నుండి రూ.2 లక్షలకు పెంచారు. ప్రస్తుత ప్రభుత్వం 2014లో రూ. 2 లక్షల నుండి రూ.2.5 లక్షలకు పెంచింది. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుత ప్రభుత్వమే ఎక్కువ పన్ను రాయితీ కల్పించింది. మోదీ ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు కల్పిస్తున్న రాయితీలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాలి. వారికి ఈ పరిమితిని రూ.3 లక్షలకు పెంచారు. ఇంటి ఋణం పరిమితిని రూ.2 లక్షలకు, రూ.2.5 లక్షల నుండి రూ.5 లక్షల వరకు వచ్చే ఆదాయంపై చెల్లించవలసిన పన్నును 10 శాతం నుండి 5 శాతానికి తగ్గించారు. వీటన్నిటికి మించి సాధారణ తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) రూ.40 వేలుగా పేర్కొన్నారు.

హృద్రోగులకు అమర్చే స్టెంట్ ధరలను రూ.1.5 లక్షల నుండి రూ.35 వేలకు తగ్గించారు. మోకాళ్ల శస్త్రచికిత్సకు వ్యయాన్ని రూ.1.5 లక్ష నుండి రూ.45 వేలకు మార్చారు. ఏటా రూ.333 ప్రీమియంకు రూ.2లక్షల బీమాను ప్రభుత్వం కల్పిస్తున్నది. ఈ ప్రయోజనాలు ఉద్యోగ, మధ్యతరగతి వారికి వర్తించవా?

మరే వర్గం కన్నా ఉద్యోగ, మధ్యతరగతి వర్గాల వారికే ప్రభుత్వం ఎక్కువ ప్రయోజనం కల్పించినట్లు భావించవలసి వస్తుంది. వాస్తవానికి రైతులు, పేదలు, అణగారిన వర్గాలకు భారీ పథకాలు ప్రకటించినా వాటికి అవసరమైన నిధుల కేటాయింపు జరగకపోవడం గమనించాలి. ఏ దేశంలోనూ లేనంతగా చాలా తక్కువ ఆదాయపు పన్ను మన దేశంలోనే ఉందని ఆర్థిక మంత్రులు తరచూ అంటుంటారు. అదనపు పన్నుల భారం మోపకుండా ఉదారత ప్రదర్శిస్తున్నట్లు పాలకులు వ్యవహరిస్తుంటారు. అయితే ప్రజల జీవన ప్రమాణాలు, స్థితిగతులు, జీడీపీ వృద్ధిని బట్టి ఇదంతా ఆధారపడి ఉండదని గమనించాలి. ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా పేరుపొందిన భారత్‌లో 73 శాతానికి పైగా సంపద కేవలం ఒక శాతం మంది సంపన్నుల వద్ద కేంద్రీకృతమై ఉన్నట్లు తాజా నివేదిక స్పష్టం చేయడం ఆందోళన కలిగించే అంశం.

గత రెండు దశాబ్దాలలో మన జీడీపీ ఆరు రెట్లకుపైగా పెరిగినట్లు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక ప్లీనరీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ గర్వంగా పేర్కొన్నారు. అయినా దేశ ప్రజల్లో ఆర్థిక అసమానతలు ఘోరంగా ఉన్నాయి. పెరుగుతున్న ఆర్థిక తారతమ్యాలను ఒక హెచ్చరికగా అందరూ భావించాలి. వీటిని సరిచేయలేని పక్షంలో మన సమాజం తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకోవడం ఖాయం. ఈ పరిస్థితులను చూస్తుంటే అభివృద్ధి అంటే ఏమిటి? అది ఎవరి కోసం? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జీడీపీ, వృద్ధిరేటు పెరుగుదలనే అభివృద్ధిగా పరిగణించాలా?

భారతీయ బ్యాంక్‌లలో నిరర్థక ఆస్తులు రూ.9.5లక్షల కోట్ల మేరకు ఉన్నట్లు తాజా గణాంకాలు తెలుపుతున్నాయి. అంటే ప్రభుత్వం అరచేయి అడ్డుపెట్టి అడ్డుకోని పక్షంలో ప్రధాన బ్యాంకులన్నీ మూతబడడానికి సిద్ధంగా ఉన్నట్లు అర్థం అవుతుంది. మన ఆర్థిక వ్యవస్థ ప్రమాదం అంచున ఉన్నదని గ్రహించాలి. ఈ ప్రమాదకర పరిస్థితుల నుండి బైటపడవేయగల సామర్థ్యం, సాహసం మన పాలకుల వద్ద కనిపించడం లేదు. ఎన్నికలలో ఓట్లు దండుకోవడానికే బడ్జెట్‌ను రూపొందించే పాలకులు ఉన్నంతకాలం ఇటువంటి ప్రమాదాలను అధిగమించలేము. ★


-చలసాని నరేంద్ర | 98495 69050

టీటీడీ చైర్మన్ పీఠం రాజకీయ పదవా?

ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన హిందువుల ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల ఆలయంపై రాజకీయ నేతల పెత్తనం ఎందుకు? దేశంలోనే అత్యంత సంపన్న ఆలయం కావడంతో తిరుమల తిరుపతి దేవస్థానంపై చిరకాలంగా ప్రభుత్వాలు అజమాయిషీ చేస్తున్నాయి. ఈ కారణంగానే టీటీడీ ట్రస్టు బోర్డు చైర్మన్ పదవికి, సభ్యుల పదవులకు జరిగే నియామకాల్లో రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. టీటీడీ పాలకమండలికి చైర్మన్, ఇతర సభ్యులను ఎంపిక చేయడంలో తరచూ వివాదాలు రాజుకుంటున్నాయి. తాజాగా చైర్మన్ పదవికి కడప జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఏపీ ముఖ్యమంత్రి ఎంపిక చేశారన్న ఊహాగానాలు ఇప్పుడు వేడి పుట్టిస్తున్నాయి. టీటీడీ పాలకమండలిని నియమించే అధికారం చట్ట ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, ఈ బోర్డును ఇతర కార్పొరేషన్లతో సరిపోల్చరాదు. రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో నడిచే వివిధ కార్పొరేషన్లు, ఆర్థిక సంస్థల్లో నామినేటెడ్ పదవుల్లో నియమితులయ్యే వారికి కొద్దిపాటి పాలనానుభవం ఉన్నా చాలు. ఇందుకు పూర్తి భిన్నమైనది టీటీడీ పాలకమండలి. పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రంగా, కోట్లాది మంది హిందువుల విశ్వాసాలకు ఆలవాలంగా భాసిల్లుతున్న తిరుమల ఆలయంపై రాజకీయ నేతల ఆధిపత్యం సరికాదు. టీటీడీ పాలకమండలి చైర్మన్‌గా నియమితులయ్యే వ్యక్తికి ఉండాల్సిన అర్హతలేమిటో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన అవగాహన ఉండాలి. ఇటువంటి జాగ్రత్తలేవీ తీసుకోకుండా టీటీడీ ట్రస్టుబోర్డు చైర్మన్ పీఠాన్ని 'ఒక రాజకీయ పదవి'గా భావించి ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటే మెజారిటీ ప్రజలు సహించరు. వివాదాస్పద నేపథ్యం ఉన్న సుధాకర్ యాదవ్‌ను టీటీడీ చైర్మన్‌గా నిర్ణయిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాష్ట్ర ప్రజలకు ఇస్తున్న సందేశం ఏమిటి?

నిజానికి పుట్టా సుధాకర్ పేరు తొలిసారిగా తెరపైకి వచ్చినపుడే పలు హిందూ సంస్థలు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశాయి. క్రైస్తవ సమావేశాలకు సుధాకర్ హాజరైన ఫొటోలు, అన్యమత సంస్థతో ఆయనకు ఉన్న సంబంధాల గురించి ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరిగింది. దీంతో సుధాకర్ నియామకంపై ప్రస్తుతానికి సందిగ్ధత ఏర్పడింది. అయితే, ఆయన నియామకం విషయంలో ముఖ్యమంత్రి తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు ఎక్కడా ప్రకటించలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కడప జిల్లా మైదుకూరు నుంచి పోటీచేసి ఓటమి చెందిన సుధాకర్ యాదవ్ ప్రస్తుతం అదే నియోజకవర్గం తెదేపా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా టీటీడీ చైర్మన్ పదవిని కట్టబెట్టాలన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా కనిపిస్తోంది. ఇతర పార్టీల నేతలను తెదేపాలో ఎడాపెడా చేర్చుకుంటున్నందున అందరికీ ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించలేని పరిస్థితి ఏర్పడింది. మాజీ మంత్రి అయిన ఓ కాంగ్రెస్ నేతను ఇటీవల తెదేపాలోకి చంద్రబాబు ఆహ్వానించడంతో సుధాకర్ యాదవ్‌ను మైదుకూరు బరి నుంచి తప్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఈ కారణంగానే యాదవ్‌ను టీటీడీ చైర్మన్ పదవికి సీఎం ఎంపిక చేశారట! కొన్ని వర్గాల నుంచి నిరసనలు రావడంతో నియామకానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు ఇంకా విడుదల కాలేదట!

నామినేటెడ్ పదవులకు ఎవరిని నియమించాలన్నది ముఖ్యమంత్రి ఇష్టం. దీన్ని ఎవరూ కాదనలేరు. అయితే, నేతలను బుజ్జగించేందుకు టీటీడీ పాలక మండలి పదవులను వాడుకోవడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో ఉన్న ఏదో ఒక కార్పొరేషన్‌కు చైర్మన్‌గా సుధాకర్‌ను నియమించుకోవచ్చు. ఏ



గతంలో టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి నాస్తికుడని, తీవ్రవాదంతో సంబంధాలున్నాయని ఆరోపణలు వచ్చినా అప్పటి సీఎం పట్టించుకోలేదు. పదవుల కోసం హిందువుగా నాటకం ఆడితే పవిత్రత రాదు, అలాంటివారు ఈ పదవులకు అనర్హులే. ఆధ్యాత్మిక కోణంలో ఆలోచించి టీటీడీ పాలకమండలికి నియామకాలు జరపాలి. రాజకీయ నేతలకు, పారిశ్రామికవేత్తలకు పదవులు కట్టబెట్టడం సరికాదు. తిరుమలలో కొందరు అన్యమత ప్రచారానికి పాల్పడుతున్నారన్న వార్తలు తరచూ వింటూనే ఉన్నాం. క్రైస్తవ సంస్థలతో సంబంధాలున్న వ్యక్తికి చైర్మన్ పదవిని అప్పగించడమంటే- అన్యమత ప్రచారానికి అధికారికంగా అవకాశం ఇవ్వడమే అవుతుంది.

పదవీ లేనట్టు టీటీడీ చైర్మన్ పీఠాన్నే ఆయనకు కట్టబెట్టాలనుకోవడం సమంజసం కాదు. సుధాకర్ నియామకంపై ఉత్తర్వులు వెలువడితే- హిందువుల మనోభావాలను ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని భావించక తప్పదు. టీటీడీపై పెత్తనానికి సుధాకర్ తగిన నాయకుడని చంద్రబాబు భావిస్తున్నారా? భక్తుల మనోభావాలకు, హిందూ సంస్థల అభ్యంతరాలకు విలువ లేదా? ముఖ్యమంత్రి మొండిపట్టుకు పోకుండా హిందువుల విశ్వాసాలను గౌరవించాలి.

తిరుమలలో అన్యమత ప్రభావాన్ని సహించబోమని పాలకులు అనునిత్యం చెబుతుంటారు. అయితే, క్రైస్తవం స్వీకరించి టీటీడీలో పనిచేస్తున్న ఓ అధికారిణి గుట్టు ఇటీవల రట్టయింది. హైందవేతరులు ఇంకా కొందరు టీటీడీలో ఉన్నారని దేవస్థానం ఈఓ అంగీకరించారు. ఎవరి ప్రమేయంతో అన్యమతస్థులు కీలక స్థానాల్లో ఉన్నారో ప్రజలు సైతం గమనిస్తున్నారు. క్రైస్తవ మత ప్రార్థనల్లో పాల్గొంటూ, ఓ తీవ్రవాద సంస్థతో సంబంధాలు కలిగి ఉన్నానని అంగీకరించిన నాయకుడిని గతంలో టీటీడీ చైర్మన్‌గా నియమించడం వివాదాస్పదమైంది. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఓ అన్యమతస్థురాలిని నియమించడం, ఆమె తన కార్యాలయంలో వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని తొలగించడంతో ఉద్యమం కొనసాగడం సీఎం స్థాయిలో ఉన్న నేతలకు తెలియనిది కాదు. 'తిరుమల ఇకపై ఏడు కొండలు కాదు, టీటీడీకి మూడు కొండలు చాలున'ని వ్యాఖ్యానించిన అప్పటి సీఎం గురించి ప్రస్తుత ముఖ్యమంత్రికి తెలియనిది కాదు. తిరుమల కొండలపై అప్పటి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ, 'తిరుమల క్షేత్ర పవిత్రతతో ఆటలు వద్దు.. ఆ దేవుడి మహిమ తెలిసిన వాడిగా చెబుతున్నా..' అంటూ అన్న మాటలను హిందువులెవరూ మరచిపోలేరు. అలాంటి చంద్రబాబు ఇపుడు సీఎం హోదాలో- ఓ వివాదాస్పద వ్యక్తిని టీటీడీ చైర్మన్‌గా నియమించేందుకు నిర్ణయం తీసుకుంటే ప్రజలు ఏమనుకోవాలి?

టీటీడీ పాలకమండలి పదవులకు అర్హతలేమిటి? ఈ అర్హతల కొలమానం ప్రకారమే నియామకాలు జరగాలి. హిందూ ధర్మంపై అంచంచల విశ్వాసం ఉండాలి. హిందువుగా జన్మించిన వ్యక్తికే ఇది సాధ్యం. గతంలో టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి నాస్తికుడని, తీవ్రవాదంతో సంబంధాలున్నాయని ఆరోపణలు వచ్చినా అప్పటి సీఎం పట్టించుకోలేదు. పదవుల కోసం హిందువుగా నాటకం ఆడితే పవిత్రత రాదు, అలాంటివారు ఈ పదవులకు అనర్హులే. ఆధ్యాత్మిక కోణంలో ఆలోచించి టీటీడీ పాలకమండలికి నియామకాలు జరపాలి. రాజకీయ నేతలకు, పారిశ్రామికవేత్తలకు పదవులు కట్టబెట్టడం సరికాదు. తిరుమలలో కొందరు అన్యమత ప్రచారానికి పాల్పడుతున్నారన్న వార్తలు తరచూ వింటూనే ఉన్నాం. క్రైస్తవ సంస్థలతో సంబంధాలున్న వ్యక్తికి చైర్మన్ పదవిని అప్పగించడమంటే- అన్యమత ప్రచారానికి అధికారికంగా అవకాశం ఇవ్వడమే అవుతుంది. అనుమానాలు, ఆరోపణలు ఉన్న వ్యక్తిని అందలం ఎక్కించాల్సిన పనిలేదు. హిందూ మతంపై నిబద్ధత, వేంకటేశ్వరునిపై భక్తిశ్రద్ధలు ఉన్న వారినే టీటీడీ పాలకమండలికి నియమించాలి. ఆధ్యాత్మిక రంగంలో ఇలాంటి అర్హతలున్న వారు దొరకడం కష్టమేమీ కాదు. అనవసర వివాదాల్లోకి టీటీడీ చైర్మన్ పదవిని నెడితే హిందూ సమాజం నుంచి వ్యతిరేకత వస్తుందన్న విషయాన్ని పాలకులు గ్రహించాలి. ఎన్నికల ముందు ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలు అధికారంలో ఉన్నవారికి క్షేమకరం కాదు. ★

- పీవీ శ్రీరామశాయి | సెల్: 98480 76295

ఉత్తరాయణం

ఉపశమనం ఏదీ?

సంపన్న వర్గానికి చెందిన విద్యావంతుడు అరుణ్ జైట్లీ ప్రవేశపెడుతున్న బడ్జెట్ల వల్ల సామాన్య ప్రజానీకానికి ఎలాంటి మేలు జరగడం లేదు. బడ్జెట్ ప్రవేశ పెట్టినపుడు ఆయన చెబుతున్న మాటలు దీర్ఘకాలిక ప్రయోజనాలకు సంబంధించినవే తప్ప అత్యధిక సంఖ్యలో ఉన్న పేదలకు తక్షణ ఉపశమనం దక్కడం లేదు. గొంతెండి పోయిన వాడికి వెంటనే గుక్కెడు నీళ్లిస్తే ప్రాణం నిలుస్తుంది కానీ ఎప్పుడో నోట్లో అమృతం పోస్తానంటే ఎలా? సంస్కరణల పుణ్యమాని దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయే తప్ప కనీస సౌకర్యాలు లేక అల్పాదాయ వర్గాలవారు నానా అవస్థలు పడుతున్నారు. కేంద్రంలో ఎన్‌డిఏ సర్కారు చేపట్టిన చర్యలతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం పెరిగినా సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదు. సగటు జీవులపై పన్నుల భారం తగ్గించకుండా విమానయానం, బుల్లెట్ రైళ్లు, భారీ రహదారుల పేరిట అవసరానికి మించి ఖర్చు చేస్తున్నారు. అవినీతి, అక్రమాల వల్ల సంక్షేమ పథకాలు సరైన ఫలితాలను ఇవ్వడం లేదు. రెండంకెల వృద్ధిరేటు, తలసరి ఆదాయం, స్టాక్ మార్కెట్ల వైభవం అంటూ సంబరపడితే చాలదు. ప్రధాని పిలుపు మేరకు సంపన్నులే కాదు కొందరు సామాన్యులు సైతం వంట గ్యాస్‌పై సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకుంటుండగా, పెట్రో కంపెనీలు ధరలను పెంచుతున్నాయి. చిన్న మొత్తాలపై వడ్డీ శాతం తగ్గించడం దారుణం. తలసరి ఆదాయం భారీగా పెరగకున్నా, జీవన వ్యయం మితి మీరకుండా పెట్రోధరలను, నిత్యావసర సరకుల ధరలను తగ్గించేలా బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేవు. ప్రజారవాణా వ్యవస్థ సామాన్యుడికి నానాటికీ కష్టమవుతోంది. రైతులకు మేలు చేసేలా దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి. అభివృద్ధి కేవలం నినాదాలకే పరిమితం కాకుండా ప్రజల స్థితిగతులను వాస్తవ దృక్పథంతో అంచనా వేసి, పేదలకు ప్రయోజనం కలిగేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, నర్సరావుపేట

వేతనజీవులకు నిరాశే

2018-19 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం కలిగే అవకాశం లేదు. వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచకపోవడం ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసింది. మరోవైపు సామాన్య వర్గాలవారు సైతం బడ్జెట్ పట్ల నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాగునీటి పథకాలు, రైల్వే ప్రాజెక్టులకు, జాతీయ స్థాయి విద్యాసంస్థలకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేకపోవడం దారుణం. రైతులకు కొన్ని వరాలను ప్రకటించినప్పటికీ ఆచరణలో నిధుల కేటాయింపు ఎలా ఉంటుందో చెప్పలేం. కొద్దినెలల్లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో పెద్దపీట వేసినట్లు కనిపిస్తోంది. కొత్తగా ఏర్పడిన తెలుగు రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయింపులో వివక్ష చూపారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

- కామిడి సతీష్‌రెడ్డి, పరకాల



శుక్రవారం ఢిల్లీలో జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా

జనంలోకి వెళ్తేనే జయం

పథకాలను ప్రచారం చేయండి ● ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జనంలోకి తీసుకెళ్లాలని బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతిపాదించిన సంక్షేమ పథకాల ప్రయోజనాల గురించి ప్రజలకు ఎంతగా వివరించగలిగితే అంత గానూ వచ్చే ఎన్నికల్లో పార్టీ లబ్ధిపొందే అవకాశం ఉంటుందని బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం అన్నది పూర్తిగా ఈ సంక్షేమ పథకాలకు ప్రజలకు వివరించటంతోపాటు అంతిమ ఫలితం వారికి అందేలా చూడటంపైనే ఆధారపడి ఉంటుందని మోదీ తెలిపారు. ముఖ్యంగా ఎంపీలు ఎంతగా తమ బాధ్యతలను, విధులను సమర్థంగా నిర్వహిస్తే పార్టీ పనితీరు అంతగానూ మెరుగుపడుతుందని, ఆ విధంగా ఉద్దేశిత ప్రయోజనాలు ప్రజలకు చేరువయ్యే అవకాశాలు ఇనుమడిస్తామని మోదీ సమావేశంలో స్పష్టం చేశారు. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్ గురించి విస్తృతంగా మాట్లాడిన మోదీ, రైతులు పేదలకు దీనివల్ల ఎంతో ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. పది కోట్ల కుటుంబాలకు చారిత్రక రీతిలో ఆరోగ్య బీమా పథకాన్ని ప్రకటించిన విషయాన్నీ మోదీ ప్రధానంగా ప్రస్తావించారు. అలాగే రైతులకు మేలు చేసే ఎన్నో పథకాలను కూడా ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. వీటన్నింటి గురించి కేవలం మాటలకే పరిమితం కాకుండా ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియజేయాల్సిన అవసరం ఉందని, బడ్జెట్‌లోని ప్రజానుకూల అంశాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని మోదీ సూచించారు. ఎంపీలు స్థానికంగా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, విస్తృతస్థాయిలో వీటికి ప్రచారాన్ని కల్పించాలని మోదీ ఉద్ఘాటించారు. ముఖ్యంగా ఎన్నికల్లో గెలవాలంటే ప్రభుత్వ పథకాలు, వాటివల్ల ఒనగూడే ప్రయోజనాలు ప్రజలకు తెలియచేయడం కీలకం అన్న విషయాన్ని ఈ సమావేశంలో ప్రధాని మోదీ స్పష్టంగా తెలియజేశారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ మీడియాకు తెలిపారు.



పశ్చిమాసియాతో మరింత సాన్నిహిత్యం

మూడు దేశాల పర్యటనకు మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ప్రధాని నరేంద్ర మోదీ మూడు పశ్చిమ ఆసియా దేశాల పర్యట నిమిత్తం శుక్రవారం బయలుదేరి వెళ్లారు. ఆయన సాయంత్రానికి జోర్డాన్ చేరుకున్నారు. ఆర్నేళ్ల క్రితం ఇజ్రాయెల్‌లో పర్యటించిన ప్రధాని ఆసారి పాలస్తీనా వెళ్తున్నారు. భద్రత, వాణిజ్యానికి సంబంధించి ఆయన పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో మోదీ వ్యూహాత్మక చర్చలు జరుపుతారు. ముందు జోర్డాన్ రాజధాని అమ్మాన్ చేరుకుని అక్కడ నుంచి పాలస్తీనా వెళ్తారని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ వెల్లడించారు. మూడు దేశాల్లో మోదీ నాలుగు రోజులు పర్యటించి సోమవారం స్వదేశానికి తిరిగి వస్తారన్నారు. పాలస్తీనా తరువాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్‌లో పర్యటిస్తారని ఆయన స్పష్టం చేశారు. శనివారం నుంచి మోదీ అధికారిక కార్యక్రమాలు మొదలవుతాయి. జోర్డాన్‌లో కింగ్ అబ్దుల్లా 2తో ఆయన భేటీ అవుతారు. గల్ఫ్, పశ్చిమాసియా దేశాల్లో పరిస్థితులపై ఇరువురు నేతలు మంతనాలు జరుపుతారు. అలాగే ఆ దేశాలతో బలమైన సంబంధాలు భారత్ కోరుకుంటోందని కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే ప్రధాని నాలుగురోజుల పర్యటన ప్రాధాన్యతతో కూడుకున్నదని ఆయన అన్నారు. పాలస్తీనాలో పర్యటిస్తున్న తొలి ప్రధాని మోదీ కాగా పశ్చిమ ఆసియాదేశాల్లో 2015 నుంచి ఇప్పటి వరకూ ఐదు సార్లు ఆయన పర్యటించి వచ్చారు. ఆ దేశాలంతో భద్రత, వాణిజ్యపరంగా వ్యూహాత్మక సంబంధాలు కోరుకుంటున్నట్టు పర్యటనకు బయలుదేరే ముందు మోదీ వ్యాఖ్యానించారు. పాలస్తీనా అభివృద్ధి అలాగే పలు కీలక అంశాలపై ఆ దేశాధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో మాట్లాడతానని ఆయన అన్నారు. ఎమిరేట్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'గల్ఫ్ మాకు విలువైన వ్యూహాత్మక భాగస్వామి' అని స్పష్టం చేశారు. ఆర్థిక రంగం, ఇంధనం, అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించి ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. దీన్లో భాగంగా యూఏసీ ఉపాధ్యక్షుడు, ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మకౌమీతో సమావేశమవుతామని అన్నారు. అలాగే అబుదాబీ రాజు షేక్ మహ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌తో భేటీ కానున్నట్టు మోదీ వెల్లడించారు. దుబాయిలో జరిగే వరల్డ్ గవర్నమెంట్ సమ్మిట్‌లో ప్రధాని ప్రసంగించనున్నారు. ఒమెన్ ప్రభుత్వంతో అనేక కీలక అంశాలపై చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు.

మరో డోక్లాం కానివ్వొద్దు

మాల్దీవుల సమస్యపై భారత్‌కు చైనా స్పష్టీకరణ

బీజింగ్, ఫిబ్రవరి 9: గత కొన్నిరోజులుగా మాల్దీవుల సంక్షోభంపై వరుస ప్రకటనలు గుప్పిస్తున్న చైనా, తాజాగా భారత్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ మరో మెలిక పెట్టింది. మాల్దీవుల్లో సైనిక జోక్యం చేసుకోవాలని, అక్కడి పరిస్థితిని అదుపు చేయాలని భారత్‌పై డిమాండ్లు పెరుగుతున్న నేపథ్యంలో మాట్లాడిన చైనా 'ఈ సమస్యను మరో డోక్లాంలా మార్చొద్దు' అని భారత్‌కు స్పష్టం చేసింది. అయితే, మాల్దీవుల సమస్యను ఏవిధంగా పరిష్కరించాలన్న దానిపై భారత్‌తో చర్చిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ సమస్య సామరస్యపూర్వకంగా పరిష్కారం కావాలే తప్ప భారత్, చైనాల మధ్య మరో డోక్లాం మాదిరిగా పెచ్చరిల్లకూడదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఏక్షణంలోనైనా భారత్ ప్రత్యేక దళాలు మాల్దీవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉందన్న కథనాల నేపథ్యంలో చైనా మరింత స్పష్టంగా తన వైఖరిని వ్యక్తం చేసింది. అన్య జోక్యం వల్ల మాల్దీవుల సమస్య మరింత ముదిరిపోతుందే తప్ప, పరిష్కారానికి అందదని తెలిపింది. ఇప్పటికే భారత్-చైనాల మధ్య అనేక కీలక సమస్యలు కొరకరాని కొయ్యలుగా మారుతున్నాయి. ఇటీవలి కాలంలో డోక్లాం వ్యవహారం దాదాపుగా సైనిక ఘర్షణల వరకూ వెళ్లింది. అలాగే పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాదులను అంతర్జాతీయ ఉగ్రవాదులుగా ప్రకటించే విషయంలోనూ చైనా అడ్డుకోవడం కూడా వివాదంగా మారింది. ఈ పరిస్థితుల్లో మాల్దీవుల పేరుతో మరో సమస్య పుట్టుకురావడం ఎంతమాత్రం అభిలషణీయం కాదని చైనా అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటికే మాల్దీవుల సమస్యపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో భారత్ ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఎక్కడ భారత్ జోక్యానికి ఆస్కారం ఏర్పడుతుందోనన్న ఆందోళన చైనాలో మొదలైంది. ఒక్క భారతదేశమే కాదు, ఏ ఇతర దేశమూ కూడా మాల్దీవుల వ్యవహారంలో వేలు పెట్టకూడదని, అంతర్గత ప్రయత్నాల ద్వారానే ఆ సమస్య పరిష్కారానికి దోహదం చేయాలని చైనా విదేశాంత మంత్రిత్వ శాఖ ప్రతినిధి షువాంగ్ స్పష్టం చేశారు.

మసీదు తరలింపునకు సానుకూలం

ముస్లిం వర్గాలు మద్దతిస్తున్నాయి ● అయోధ్య వివాదంపై శ్రీశ్రీ రవిశంకర్



బెంగళూరు, ఫిబ్రవరి 9:ఆయోధ్య వివాదంలో కీలకమైన మసీదును వివాదాస్పద ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలన్న ప్రతిపాదనకు వివిధ ముస్లిం వర్గాలు మద్దతు ప్రకటించాయని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీ రవిశంకర్ పేర్కొన్నారు. ఈ వివాదంపై అయోధ్యలో త్వరలో అతిపెద్ద సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంలో కోర్టు బయట పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం నెరపుతున్న రవిశంకర్ మరోసారి తన ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగా శుక్రవారం నాడు వివిధ ముస్లిం వర్గాల ప్రతినిధులు బెంగళూరులో రవిశంకర్‌తో భేటీ అయి చర్చలు జరిపారు. ఈ సమావేశం వివరాలను 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్, సున్నీ వక్ఫ్‌బోర్డ్‌తోపాటు వివిధ సంస్థలకు చెందిన పదహారు మంది ప్రతినిధులు శుక్రవారంనాడు రవిశంకర్‌తో భేటీ అయ్యారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మేధావులు, ముస్లిం సంస్థల ప్రతినిధులు వారిలో ఉన్నారు. మసీదు తరలింపు ప్రతిపాదనను వారంతా సమర్థించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీశ్రీతో జరిపిన సమావేశంలో పాల్గొన్నవారిలో ముస్లిం పర్సనల్ లాబోర్డ్ కార్యనిర్వాహక సభ్యుడు మౌలానా సయ్యద్ సల్మాన్ హుస్సేన్ నద్వీ, యూపీ సున్నీ వక్ఫ్‌బోర్డ్ చైర్‌పర్సన్ జుఫర్ అహ్మద్ ఫరూఖీ, లక్నోకు చెందిన తీలేవాలీ మసీదు మౌలానా వసీఫ్ హసన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ అనిస్ అన్సారీ ఉన్నారు. వీరితో పాటు సెంటర్ ఫర్ ఆబ్జెక్టివ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఓఆర్‌డీ) డైరక్టర్ అతార్ హుస్సేన్ సిద్దిఖి, వ్యాపారవేత్త ఏఆర్‌రెహ్మాన్, లండన్‌కు చెందిన వరల్డ్ ఇస్లామిక్ ఫోరం చైర్మన్ మౌలానా ఇసా మన్సూరీ, లక్నో న్యాయవాది ఇమ్రాన్ అహ్మద్, భారత హజ్ కమిటీ మాజీ చైర్మన్ అబూబకర్, బెంగళూరుకు చెందిన డాక్టర్ మూసా కైసర్ ఈ చర్చల్లో పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంలో భాగంగా రవిశంకర్ ప్రారంభించిన చర్చల ప్రక్రియపై మొదట పెదవివిరుపులు ఎదురైనా తాజా ప్రయత్నాలపై ఇరువర్గాల నుంచి సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి. కాగా శ్రీశ్రీ మధ్యవర్తిత్వ ప్రయత్నాలకు దూరంగా ఉన్న విశ్వహిందూ పరిషత్ తాజా పరిస్థితులపై పెద్దగా స్పందించలేదు. అయితే తమను విశ్వాసంలోకి తీసుకోకుండా శ్రీశ్రీ ఈ వివాద పరిష్కారానికి ప్రయత్నించడాన్ని ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్, విశ్వహిందూ పరిషత్ గతంలో సమర్థించలేదు. కాగా అదేనెలలో రవిశంకర్ యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా మాట్లాడిన శ్రీశ్రీ ఈ చర్చలు ఎక్కడికి దారితీస్తాయో ప్రతి ఒక్కరికి తెలుసునని వ్యాఖ్యానించారు. కాగా శుక్రవారం అయోధ్య వివాదంపై ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారణను మార్చి 14కు వాయిదా వేసింది.





ఇందిరా గాంధీ హత్యానంతరం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అల్లర్లలో మరణించినవారి కుటుంబాలు తమకు న్యాయం చేయాలంటూ శుక్రవారం హస్తినలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ఆ ప్రదర్శనలో పాల్గొన్న ఓ మహిళ దోషులను శిక్షించి తీరాల్సిందేనంటూ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్న దృశ్యమిది.

మళ్లీ షట్‌డౌన్

అమెరికా ద్రవ్యబిల్లుకు దక్కని సెనేట్ ఆమోదం

కొలంబియా, ఫిబ్రవరి 9: అమెరికా ప్రభుత్వం మరోసారి షట్‌డౌన్ అయింది. ప్రభుత్వ ఖర్చుకు సంబంధించి వినిమయ బిల్లుకు ఈసారీ సెనేట్ ఆమోదం లభించలేదు. గత నెల 20న బిల్లుకు రిపబ్లికన్ పార్టీ సెనెటర్లు మద్దతు ఇవ్వకపోవడంతో ఆమోదం లభించలేదు. వాస్తవానికి బిల్లుకు గురువారం రాత్రికి ఆమోదం తెలపాల్సి ఉంది. అయితే నిధులు కేటాయింపుపై సంతృప్తి చెందని కెంటకీ రిపబ్లికన్ పార్టీ సెనెటర్ రాండ్‌పాల్ ఆమోదానికి అంగీకరించలేదు. దీంతో మూడువారాల వ్యవధిలో కథ మళ్లీ మొదటికి వచ్చింది. దేశంలో పాలనను గాడిలోపెట్టాలన్న ఉద్దేశంతో డెమోక్రటిట్ పార్టీ కృషి చేసి ఓ ఒప్పందానికి వచ్చింది. ఈనెల 8 తేదీవరకు ఖర్చుచేయాల్సిన నిధులకు సంబంధించి అంగీకారం కుదిరింది. బిల్లుకు ఆమోదం లభించడంతో శుక్రవారం వరకూ నిధులు విడుదల అయ్యాయి. కానీ ఓ సెనేటర్ వల్ల ఆమోదం పొందలేకపోయారు. బిల్లుకు సెనెట్ ఆమోదం తెలిపిన మరుక్షణమే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం కోసం పంపించాల్సి ఉంది.

రాహుల్ తీరు గర్హనీయం

బీజేపీ చీఫ్ అమిత్‌షా విమర్శ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీపై బీజేపీ చీఫ్ అమిత్‌షా శుక్రవారం ఇక్కడ తీవ్రమైన ఆరోపణలు చేశారు. పార్లమెంటులో రాహుల్ వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామ్యంగా ఉందని అమిత్‌షా మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగానికి ప్రతిపక్ష పార్టీ అడ్డుతగలడం దారుణమని ఆయన విమర్శించారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరైన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాహుల్ తీరుపై తీవ్రంగా ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ కూడా మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. పార్లమెంటు సమావేశాలను స్తంభింపచేయాలన్న ఏకైక ఉద్దేశంతోనే ప్రతిపక్ష కాంగ్రెస్ వ్యవహరిస్తోందని బీజేపీ అధ్యక్షుడు చెప్పారు. రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందాన్ని కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తోందని ఆయన ఆరోపించారు.'ఫ్రాన్‌తో చేసుకున్న రాఫెల్ ఒప్పందం దేశ ప్రయోజనాలకు దోహదపడుతుంది. అందరితో చర్చించిన తరువాత ఒప్పందం కుదిరింది'అని ఆయన స్పష్టం చేశారు. కాగా 2018 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ అధ్యక్షుడు షా ప్రశంసలు కురిపించారు. రైతులు, మధ్యతరగతి ప్రజలు ఎంతోమేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

బ్రిటిష్ వంతెనలే నయం

స్వాతంత్ర్యానంతర నిర్మాణాల్లో నాణ్యత లోపం ● ఈ-టెండర్లతో అక్రమాలకు చెక్ ● పార్లమెంటరీ సభాసంఘం నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:స్వాతంత్ర్యానంతరం దేశంలో నిర్మించిన రైల్వే వంతెనలకన్నా ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన కొన్ని రైల్వే వంతెనలే ఇప్పటికీ నాణ్యంగా, పటిష్టంగా ఉన్నాయని పార్లమెంటరీ సభాసంఘం తన నివేదికలో పేర్కొంది. కొత్తగా కట్టిన, పునరుద్ధరించిన వంతెనల్లో నాణ్యత లోపానికి అధికారులు, గుత్తేదారుల మధ్య ఉన్న సంబంధాలే కారణమని తప్పుబట్టింది. కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలోని సభాసంఘం దేశంలో రైల్వే వంతెనల నిర్వహణపై ప్రజాపద్దుల సంఘానికి ఇచ్చిన నివేదికను పార్లమెంటుకు సమర్పించింది. వంతెన పనులకు నిధుల మంజూరులో జరుగుతున్న జాప్యం ప్రయాణీకుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేస్తోందని కమిటీ అభిప్రాయపడింది. అతిపెద్ద ప్రజారవాణా సంస్థ రైల్వే, వంతెనల నిర్వహణలో లోపాలను కమిటీ ఎత్తిచూపింది.

బ్రిటిష్ కాలంలో నిర్మించిన కొన్ని వంతెనల నాణ్యత ఇప్పటికీ చెక్కుచెదరలేదని, స్వాతంత్ర్యానంతరం నిర్మించిన కొన్ని వంతెనల పనులు నాసిరకంగా ఉన్నాయని పేర్కొన్న సభాసంఘం, రైల్వే అధికారులు, కొందరు కంట్రాక్టర్ల మధ్య ఉన్న సంబంధాలే ఇందుకు కారణమని తేటతెల్లం చేసింది. ఈ పరిస్థితులను చక్కదిద్దడానికి కొన్ని సూచనలు చేసిన కమిటీ వంతెనల నిర్మాణం లేదా పునరుద్ధరణ పనులు చేపట్టడానికి ఈ-టెండర్ల విధానం ద్వారా చేపట్టాలని సిఫార్సు చేసింది. అందువల్ల ఈ తరహా పనుల్లో అనుభవం ఉన్న, పేరున్న సంస్థలు పెద్దసంఖ్యలో టెండర్లు వేసే అవకాశం ఉంటుందని సభాసంఘం అభిప్రాయపడింది. నాసిరకంగా కట్టిన, దీర్ఘకాలం మన్నేలా కట్టని గుత్తేదారులు, లేదా సంస్థలు భవిష్యత్‌లో టెండర్ల ప్రక్రియలో పాల్గొనకుండా నిషేధించాలని, వారిపై భారీ జరిమానా విధించాలని కమిటీ సూచించింది.

Office of the Joint Commissioner of Income Tax, Range-1
2nd Floor, Central Revenue Buildings, Near PWD Grounds, M.G.Road, Vijayawada-520002, Andhra Pradesh. Ph No.0866-2572755, Fax : 2575756

F.No.Infra Committee/R-1/VJA/2017-18

TENDER NOTICE

Sealed Quotations are invited from the reputed furniture dealers for infrastructure facilities in respect of work sattions, chairs and other Furniture including curtains for the staff of O/o Joint Commissioner of income tax, Range`1,2nd Floor, CR Buildings, Vijayawada-520002. The complete details and information regarding the tender can be obtained from Shri P.Siva Athcaiah, ITO, Ward-1(2), Vijayawada. Mobile : 8985970253, e-mail : vijayawada.ito1.2@incometax.gov.in

The last date for filing of Quotations is 19-02-2018 by 16.00 hrs.

Sd/- T.SATYANANDAM I.R.S.
09.02.2018 Joint Commissioner of Income tax, Range-1. Vijayawada.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ

నెం.44-50/To/ 2017 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు** తేది.06.02.2018

పర్యవేక్షక ఇంజనీరు, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ విజయవాడ వారిచే నూతన రక్షిత మంచినీటి సరఫరా పథకము ఏర్పాటు చేయుటకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. 7 పనులకు అంచనా విలువ: రూ.171.00 లక్షలు. టెండర్ డాక్యుమెంట్ల లభ్యత తేది: 19.2.2018 ఉ.11.00 గం.ల నుండి 5.3.2018 మ.1 గం.ల వరకు. టెండర్ డాక్యుమెంట్ స్వీకరించుట తేది: 19.2.2018 ఉ.11 గం.ల నుండి 5.3.2018 సా. 5గం.ల వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది: 5.3.2018 సా.5.30 గం.కు. మిగిలిన వివరాలకు ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నందు చూడగలరు. ఫోన్ నెం.0866-2573944.

సం/- పర్యవేక్షక ఇంజనీరు,
R.O.No.3365/CL/Advt/1/1/2017-18 గ్రామీణ నీటిసరఫరా వలయము, విజయవాడ

బాలల హక్కులను రక్షించండి

● ప్యానల్స్‌ను భర్తీ చేయండి ● కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అన్ని చిన్నారుల హక్కుల సంఘాలలో ఖాళీలను భర్తీ చేయాలని, తద్వారా బాల్య న్యాయ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానం ఈ మేర కు శరపరంపరగా ఆదేశాలను జారీ చేసింది. అలాగే బాల్య న్యాయ మండళ్లు, శిశు సంక్షేమ సంఘాలలో అన్ని స్థాయిలలోను పదవులలో నిబంధనల మేరకు తగిన వారిని త్వరితగతిన నియమించాలని జస్టిస్ మదన్ బి లోకూర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ విషయం లో జాప్యం జరిగితే చిన్నారుల భవితవ్యంపై ప్రతికూ ల ప్రభావం పడుతుందని, అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ధర్మాసనం స్పష్టం చేసింది. బాల్య న్యాయ చట్టాన్ని సమర్థంగా అమలు చేయడం లేదని, వీటి అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. పిల్లల సంరక్షణ, భద్రతకు కీలకమైన బాల్య న్యాయ చట్టాన్ని ప్రభావవంతంగా అమలు చేసే విధివిధానాలు రూపొందించే బాధ్యతను ఆయా రాష్ట్రాల ఉన్నత న్యాయస్థానాల ప్రధాన న్యాయమూర్తులు భుజాన వేసుకోవాలని ధర్మాసనం కోరింది. అలాగే ప్రతి జిల్లాలో 'చిన్నారుల స్నేహపూర్వక న్యాయస్థానాలు', 'కీలక సాక్ష్యాల నమోదు న్యాయస్థానాల' ఏర్పాటు అంశాన్ని తీవ్రంగా పరిశీలించాలని సూచించింది. చిన్నారుల సంరక్షణ, భద్రతకు అవసరమైన ఈ చర్యలను కేంద్ర మహిళాశిశు సంక్షేమ శాఖ, రాష్ట్రప్రభుత్వాలు, కేంద్ర, రాష్ట్ర చిన్నారుల హక్కుల పరిరక్షణ సంఘాలు తక్షణం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది.

మరో మైలురాయి దాటిన విశాఖ లోకో షెడ్

● పట్టాలెక్కిన 300వ ఇంజిన్ ● జెండా ఊపి ప్రారంభించిన డీఆర్‌ఎం



విశాఖలోని డీజిల్ లోకో షెడ్ రూపొందించిన 300వ ఇంజన్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 9: విశాఖ డీజిల్ లోకోషెడ్ మరో మైలురాయి దాటింది. భారతీయ రైల్వేలో అత్యంత ప్రతిభ కనబరుస్తున్న లోకో షెడ్‌లో 300వ ఇంజన్‌ను తయారు చేసి, రికార్డు సృష్టించింది. ఈ ఇంజన్‌కు విశాఖ డీఆర్‌ఎం ముకుల్ శరణ్ మాథుర్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. విశాఖ డీజిల్ లోకో షెడ్‌లో అత్యాధునిక రైల్వే ఇంజన్‌లు నిర్మితమవుతున్నాయి. భారతీయ రైల్వే ఇచ్చిన లక్ష్యాలను దాటి, ఇంజన్‌లను ఇక్కడ రూపొందిస్తున్నారు. అలాగే నిర్వహణలో విశాఖ లోకో షెడ్‌కు భారతీయ రైల్వేలో మంచి పేరు ప్రతిష్ఠలు ఉన్నాయి. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు ఇంజన్‌లను తయారు చేసిన ఘనత ఈ లోకో షెడ్‌కు దక్కింది. వాల్తేర్ డివిజన్ నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నందుకు ఐఎంఎస్ సర్టిఫికెట్ (ఐఎస్‌ఓ:9001:2015)ను దక్కక్కించుకుంది. అలాగే పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ఐఎస్‌ఓ:14001:2015, సర్టిఫికెట్‌ను సాధించుకుంది. నిబద్ధత, సమయపాలనలో డీజిల్ లోకోషెడ్ భారతీయ రైల్వేలో గౌరవప్రదమైన స్థానంలో ఉంది. ఈ లోకోషెడ్‌కు ఉన్న మరో ప్రత్యేకత ఏంటంటే.. రిమోట్ మోనటరింగ్ అంట్ మేనేజ్‌మెంట్ ఆఫ్ లోకోమోటివ్స్, అండ్ ట్రైన్స్ సిస్టమ్‌ను ఈ లోకోషెడ్ రూపొందించింది. 203లోకోలను డీజిల్ లోకోషెడ్ కంట్రోల్ రూం నుంచే మోనిటర్ చేయడానికి అవకాశం ఉంది. దీనివలన ఇంజన్లలో ఏర్పడిన లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దే అవకాశం ఉంది. కొత్తగా రూపొందించిన అన్ని ఇంజన్‌ల స్థితిగతులను ఇక్కడి నుంచే తెలుసుకునేందుకు అవకాశం ఉంది.

Jocil Limited (A Subsidiary of The Andhra Sugars Limited)
CIN : L28990AP1978PLC002260
Factory & Registered Office : DOKIPARRU, GUNTUR - 522 438, A.P.
Ph: 0863 2290190 • Fax : 0863 2290090 • Email : jocil@jocil.net • Web : www.jocil.in

Jocil

EXTRACT OF STANDALONE FINANCIAL RESULTS
FOR THE QUARTER AND NINE MONTHS ENDED 31-12-2017

(₹ in Lakhs)

Sl. No.	Particulars	Unaudited / Quarter ended			Unaudited/ Nine Months ended		Audited/ Year ended
		31-12-2017	30-09-2017	31-12-2016	31-12-2017	31-12-2016	31-03-2017
1.	Total Income from Operations	8980.40	7114.71	8788.69	26457.02	28981.75	41478.11
2.	Net Profit/(loss) for the period (before Tax, Exceptional and /or Extraordinary items)	(111.70)	(103.49)	17.26	(343.56)	654.78	1018.61
3.	Net Profit/(loss) for the period before Tax (after Exceptional and/or Extraordinary items)	(111.70)	(103.49)	17.26	(343.56)	654.78	1018.61
4.	Net Profit /(loss) for the period after Tax (after Exceptional and /or Extraodinary items)	(111.70)	(38.64)	38.87	(263.10)	520.36	820.80
5.	Total Comprehensive Income for the period [Comprising Profit/(Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	165.67	81.39	102.59	117.77	615.08	955.69
6.	Equity Share Capital	888.12	888.12	888.12	888.12	888.12	888.12
7.	Other Equity excluding Revaluation Reserve	-	-	-	-	-	15931.29
8.	Earnings Per Share of Rs.10 each - Basic and Diluted (Before and after extraordinary items) (Not annualised)	(1.26)	(0.44)	0.44	(2.96)	5.86	9.24

Notes :
The above is an extract of the detailed format of Quarterly Standalone Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015. The full format of the Quarterly Standalone Financial Results are available on the Stock Exchange Website www.nseindia.com, and on the company's website www.jocil.in.

For and on behalf of Board of Directors
J. MURALI MOHAN
Managing Director
DIN :00114341

Hyderabad
09-02-2018

వాణిజ్యభూమి

రూ. 1,600 కోట్లు ఆదా

- ఆహార ధాన్యాల సేకరణపై 18 శాతం తగ్గిన పన్ను
- జీఎస్‌టీ ప్రవేశంతో లాభం
- కేంద్ర ప్రభుత్వం అంచనా
- మంత్రి పాశ్వాన్ వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ను ప్రవేశపెట్టిన తరువాత ఆహార ధాన్యాల సేకరణపై పన్ను వ్యయం తగ్గడం వల్ల ప్రభుత్వానికి ఏటా రూ. 1,600 కోట్లు ఆదా అవుతుందని అంచనా వేసినట్టు కేంద్ర ఆహార శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ వెల్లడించారు. ప్రభుత్వం సేకరించే ఆహార ధాన్యాలపై కేవలం జీఎస్‌టీని మాత్రమే విధించడం జరుగుతోందని, రాష్ట్ర పన్నులు విధించడం లేదని, అందువల్ల మొత్తం మీద 18 శాతం పన్ను తగ్గిందని ఆయన వివరించారు. ఫలితంగా ఏటా రూ. 1,600 కోట్లు ఆదా అవుతుందని ప్రభుత్వం అంచనా వేసినట్టు ఆయన వివరించారు. 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)లో మూలధన పునర్ వ్యవస్థీకరణ గురించి ఆయన మాట్లాడుతూ, ఎఫ్‌సీఐపై వడ్డీ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆ సంస్థకు కొంత మూలధనాన్ని సమకూరుస్తుందని చెప్పారు. అలాగే ఎఫ్‌సీఐ దీర్ఘకాలిక బాండ్లను కూడా జారీ చేస్తుంది. ఎఫ్‌సీఐ ఆహార ధాన్యాల సేకరణ, పంపిణీకి ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది. పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను 1.5 రెట్లు పెంచడం వల్ల ద్రవ్యోల్బణంపై దాని ప్రభావం గురించి అడగగా, సామాన్య ప్రజలపై దాని ప్రభావం పడబోదని మంత్రి బదులిచ్చారు. ఎందుకంటే, ప్రభుత్వం దేశంలోని 80 కోట్లకు పైగా మంది ప్రజలకు ఒక్కొక్కరికి రూ. రెండు నుంచి మూడుకే కిలో చొప్పున గోధుమలు, బియ్యం పంపిణీ చేస్తోందని ఆయన వివరించారు. 2018-19 బడ్జెట్‌లో ఆహార మంత్రిత్వ శాఖకు కేటాయింపులు రూ. 2.24 లక్షల కోట్లకు పెరిగాయని పాశ్వాన్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.96 లక్షల కోట్లు కేటాయించినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ. 1,44,781.69 కోట్లు ఉన్న ఆహార సబ్సిడీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 1,73,323 కోట్లకు పెరిగిందని మంత్రి వివరించారు.

మళ్లీ స్టాక్ మార్కెట్ పతనం

- భారీగా కుంగిన కీలక సూచీలు
- 407 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- 121 పాయింట్లు పడిపోయిన నిఫ్టీ



TOP LOSERS 9 FEB — 34,005.76

POINTS		%
325.55	Yes Bank	-2.84%
326.75	ICICI Bank	-2.33%
1773.20	HDFC	-2.13%
1111.80	Infosys	-2.01%
1031.00	Kotak Mahi	-1.81%
421.75	Bharti Airtel	-1.80%
296.40	SBI	-1.68%
285.00	Wipro	-1.59%
559.50	Axis Bank	-1.58%
369.20	Tata Motors	-1.51%

BSE SENSEX -407.40 PTI GRAPHICS.

ముంబయి, ఫిబ్రవరి 9: అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయనే భయంతో పాటు అమెరికా సహా ప్రపంచ మార్కెట్లు పడిపోయిన ప్రతికూల ప్రభావం శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్‌పై పడింది. దీంతో మార్కెట్ కీలక సూచీలు భారీగా దిగజారాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) సెన్సెక్స్ ఒక శాతానికి పైగా పడిపోయి, నెల రోజుల కనిష్ఠ స్థాయి వద్ద ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్‌ఈ) నిఫ్టీ 10,500 స్థాయికన్నా దిగువకు దిగజారింది. సెన్సెక్స్ 407.40 పాయింట్లు (1.18 శాతం) తగ్గి, 34,005.76 పాయింట్ల వద్ద ముగిసింది. జనవరి నాలుగో తేదీ తరువాత సెన్సెక్స్ ఇంత దిగువ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. జనవరి నాలుగున ఈ సూచీ 33,969.64 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ శుక్రవారం 121.90 పాయింట్లు (1.15 శాతం) పడిపోయి, 10,454.95 పాయింట్ల వద్ద స్థిరపడింది. వారం రీత్యా చూస్తే, సెన్సెక్స్ ఈ వారంలో భారీగా 1,060.99 పాయింట్లు (3.02 శాతం) పడిపోగా, నిఫ్టీ 305.65 పాయింట్లు (2.84 శాతం) దిగజారింది. ఈ రెండు కీలక సూచీలు ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ఒకే వారంలో ఇంత భారీగా పడిపోవడం ఇదే మొదటిసారి. అమెరికా స్టాక్ మార్కెట్ మరోసారి అమ్మకాల ఒత్తిడికి లోనయింది. ముఖ్యంగా అమెరికా స్టాక్ మార్కెట్ కీలక సూచీ డౌ భారీగా పడిపోయింది. అమెరికా స్టాక్ మార్కెట్ ప్రభావం భారత మార్కెట్లపై బాగా పడింది. దీనికి తోడు అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగితే, అక్కడి నుంచి భారత స్టాక్ మార్కెట్లలోకి నిధుల ప్రవాహం తగ్గిపోతుందనే ఆందోళన కూడా మదుపరులలో నెలకొంది. పైగా, దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం కూడా మదుపరులను వెంటాడింది. వీటన్నింటి కారణంగా శుక్రవారం మదుపరులు అమ్మకాలకు ఎగబడటంతో దేశీయ మార్కెట్ సూచీలు తీవ్రంగా పడిపోయాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌పై అమ్మకాల ఒత్తిడి తీవ్రంగా కనపడింది. దీంతో బీఎస్‌ఈ బ్యాంకెక్స్, నిఫ్టీ బ్యాంక్ సూచీలు 1.76 శాతం వరకు పడిపోయాయి. యెస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ల ధరలు 2.84 శాతం, 2.33 శాతం చొప్పున పడిపోయాయి. శుక్రవారం నాటి లావాదేవీల్లో షేర్ల ధరలు దిగజారిన ఇతర కంపెనీలలో హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, విప్రో, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదాని పోర్ట్స్, ఎల్అండ్‌టీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హీరో మోటోకార్ప్, మారుతి సుజుకి, బజాజ్ ఆటో, ఐటీసీ లిమిటెడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఎంఅండ్ఎం, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ ఉన్నాయి. వీటి షేర్ల విలువ 2.13 శాతం వరకు పడిపోయింది. ఇందుకు భిన్నంగా టాటా స్టీల్, ఆసియన్ పెయింట్, డాక్టర్ రెడ్డీస్, టీసీఎస్, హిందుస్తాన్ యూనిలీవర్, కోల్ ఇండియా సంస్థల షేర్ల విలువ 1.83 శాతం వరకు పెరిగింది.

రంగాల వారీగా చూస్తే, బీఎస్‌ఈ బ్యాంకింగ్ సూచీ అత్యధికంగా 1.75 శాతం వరకు పడిపోయింది. ఫైనాన్స్ సూచీ 1.54 శాతం, టెలికం 1.15 శాతం, ఆటో 0.95 శాతం, టెక్నాలజి 0.90 శాతం, ఐటీ 0.77 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.73 శాతం, చమురు- సహజ వాయువు 0.72 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 0.60 శాతం, పీఎస్‌యూ 0.50 శాతం చొప్పున దిగజారాయి. మరోవైపు, లోహ, స్థిరాస్తి, పవర్, కన్స్యూమర్ డ్యూరేబుల్స్ రంగాల సూచీలు పైకి ఎగబాకాయి. మిడ్-క్యాప్ ఇండెక్స్ 0.09 శాతం పడిపోగా, స్మాల్-క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం పెరిగింది.

హైదరాబాద్‌లో ఎన్‌పీసీసీ

కార్యకలాపాలు ప్రారంభం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 9: ప్రముఖ ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నేషనల్ పెట్రోలియం కంపెనీ (ఎన్‌పీసీసీ) తన కార్యకలాపాలను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు ప్రకటించింది. ఓఎన్‌జిసి ఇటీవలనే దాదాపు రూ.1800 కోట్లకు పైబడిన ఆఫ్‌షోర్ కాంట్రాక్టును ఎన్‌పీసీసీకి ఇచ్చింది. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు సంబంధించి సేవలను అందించేందుకు నైపుణ్యం ఉన్న ఉద్యోగులను ఇక్కడకు పంపినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ సంస్థ ఇక్కడ కార్యకలాపాలను ప్రారంభించడం వల్ల స్థానికంగా యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు.

ఎన్‌పిసిసి-ఒఎన్‌జిసి అనుబంధం వల్ల భారతదేశం-యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడం వల్ల వాణిజ్య సంబంధాలను పెంపొందిస్తున్నట్లు ఎన్ఇఎల్ అనివా బోర్డు చైర్మన్ అఖిల్ మదీ చెప్పారు.

ఆర్టీజీఎస్ పనితీరు అమోఘం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ(ఆర్టీజీఎస్) అద్భుతంగా పనిచేస్తోందని కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ రమేష్ చంద్ కితాబిచ్చారు. వెలగపూడి సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ స్టేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అహ్మద్ బాబు ఆర్టీజీఎస్ పనితీరును వివరించారు. ప్రజలకు, ప్రభుత్వానికి ఈ కేంద్రం సేవలు అందిస్తున్న తీరును తెలియజేశారు.

పరిష్కార వేదిక 1100 కాల్ సెంటర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని ఎలా పరిష్కరిస్తున్నదీ వివరించారు. తొమ్మిది నెలల కాలంలో పరిష్కార వేదిక ద్వారా 1,48,50,297 ఫిర్యాదులు స్వీకరించామని అందులో 93 శాతం పరిష్కరించామని తెలిపారు.

దేశంలో తొలిసారిగా
క్లౌడ్ హబ్ పాలసీ



- డీటీపీ పాలసీ ద్వారా రెంటల్ సబ్సిడీ
- డెస్క్ ఎరా కంపెనీ సీఈవోతో మంత్రి లోకేష్ భేటీ
- విశాఖ కేంద్రంగా త్వరలో ప్రారంభం

విజయవాడ(బెంజిసర్కిల్), ఫిబ్రవరి 9: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా మొదటి సారిగా క్లౌడ్ హబ్ పాలసీని నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. సార్ట్‌అప్ కంపెనీలను ప్రోత్సహించే క్రమంలో వారికి డీటీపీ పాలసీ ద్వారా రెంటల్ సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం ఏపీ మంత్రి నారా లోకేష్.. డెస్క్ ఎరా కంపెనీ సీఈఓ శషాంక్ దీక్షిత్, కో ఫౌండర్ సోమేష్ మిత్రతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ వారికి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ అభివృద్ధి కోసం తీసుకొచ్చిన పాలసీలు, కల్పిస్తున్న రాయితీలను వివరించారు. ముఖ్యంగా ఆఫీస్ స్పేస్ ఇబ్బందులను అధిగమించే క్రమంలో ప్లగ్ అండ్ ప్లే విధానం ద్వారా సార్టప్ కంపెనీలకు అవసరమైన స్పేస్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే డీటీపీ పాలసీ ద్వారా రెంటల్ సబ్సిడీని కల్పిస్తున్నామన్న ఆయన క్లౌడ్ కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే క్లౌడ్ హబ్ పాలసీని తీసుకు వచ్చినట్లు వివరించారు. డెస్క్ ఎరా కంపెనీ సిఈఓ శషాంక్ దీక్షిత్ మాట్లాడుతూ విశాఖపట్నంలో గత నెలలో జరిగిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా విశాఖ కేంద్రంగా త్వరలోనే కంపెనీ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముందుగా 500 మంది ఉద్యోగులతో కలిసి కంపెనీని అతిత్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. పబ్లిక్, ప్రైవేట్ క్లౌడ్, మల్టీటేనన్సీ, వెబ్ సర్వీసస్, ఇంటిగ్రేషన్ సర్వీసెస్‌లలో ఈకంపెనీకి అపూర్వ అనుభవం ఉంది.



గ్రేటర్ నోయిడాలో నిర్వహిస్తున్న 2018 ఆటో ఎక్స్‌పోలో శుక్రవారం యమహా వైజెడ్ఎఫ్-ఆర్3 మోటార్ సైకిల్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న బాలీవుడ్ నటుడు, యమహా బ్రాండ్ అంబాసిడర్ జాన్ అబ్రహాం

1వ పేజీ తరువాయి

ఏదీ వదలం అన్నీ చేస్తాం

జైట్లీ వివరించారు. దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణం, కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు, విశాఖపట్నం పెట్రో కెమికల్ కాంప్లెక్స్, ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు, వైజాగ్-చెన్నై- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ తదితర అన్ని ప్రాజెక్టులనూ వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా మంత్రిత్వ శాఖల మంత్రులకు సూచించామని జైట్లీ వివరించారు. ఈ పథకాల విషయంలో కేంద్రం చొరవ తీసుకుని, వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రాజెక్టులను ఎప్పటిలోగా పూర్తిచేస్తారన్న విషయాన్ని ప్రకటించాలని సీఎం రమేష్ డిమాండ్ చేయడంతో, వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తామని జైట్లీ బదులిచ్చారు. ప్రాజెక్టులను బడ్జెట్‌లో చేరిస్తే తమకు భరోసా ఉంటుందని టీజీ వెంకటేష్ సూచించారు. అమరావతి, ఇతర ప్రాజెక్టులకు వీలైనంత ఎక్కువ నిధులు కేటాయించాలని టి సుబ్బిరామిరెడ్డి డిమాండ్ చేశారు. అమరావతికి ఇప్పటికే నిధులిచ్చామని ఆర్థిక మంత్రి చెప్పారు. రాష్ట్ర విభజన చట్టాల్లో ఆంధ్రతోపాటు తెలంగాణ కూడా ఉంది కనుక, తెలంగాణ ప్రాజెక్టులనూ త్వరగా పూర్తి చేయించాలని తెరాస ఎంపీ కె కేశవరావు డిమాండ్ చేయడంతో తప్పకుండా చేస్తామని జైట్లీ బదులిచ్చారు. ఇదిలావుంటే రాజ్యసభ అధ్యక్షుడు ఎం వెంకయ్యనాయుడు శుక్రవారం సాయంత్రం తమ చాంబర్‌లో అరుణ్ జైట్లీతో సమావేశమై విభజన చట్టం హామీలపై చర్చించారు. సమావేశానికి తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు, కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి సుజనా చౌదరి సైతం హాజరయ్యారు. విభజన చట్టంలోని హామీలను వీలైనంత త్వరగా అమలు చేయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీకి వెంకయ్య సూచించినట్టు తెలిసింది.

'ఆరోగ్యం'లో కేరళ భళా

మాట్లాడుతూ సహకారం, పోటీతత్వంతో కూడిన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ సూచీ ఎంతో ప్రభావం చూపుతుందని కాంత్ అన్నారు. దేశంలో 730 ఆస్పత్రుల పనితీరు ఆధారంగా ఈ ఏడాది జూన్ నాటికి ర్యాంకులు ప్రకటిస్తామని, బాగాపనిచేసేవారిని ప్రోత్సహించడానికి, పనిచేయనివారి పనిపట్టడానికి ఈ చర్య తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆరోగ్యసూచీ నిబంధనల మేరకు ఆరోగ్యరంగంలో మేలైన పరిస్థితులు కల్పించడం, అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో వివిధ రాష్ట్రాల మధ్య సహకారం పెరుగుతోందని నీతి ఆయోగ్ సభ్యుడు వినోద్‌కుమార్ పాల్ ఈ సందర్భంగా చెప్పారు. 'ఆరోగ్యసూచి' విషయంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన రాష్ట్రాలకు త్వరలో తమ మంత్రిత్వశాఖ నుండి ప్రోత్సాహకాలు ప్రకటిస్తామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ప్రీతీ సుదన్ వెల్లడించారు. ప్రపంచంలో ఈ తరహా కార్యక్రమం చేపట్టిన అతిపెద్ద దేశం భారత్ మాత్రమేనని, ఇతర దేశాల్లో ఈ విధానాన్ని అమలు చేయాల్సి ఉంటుందని ప్రపంచబ్యాంక్ డైరక్టర్ (ఇండియా) జునాయిడ్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. ఆరోగ్య ఫలితాల సాధన (70 శాతం), ప్రభుత్వ విధానాలు, సమాచారం (12శాతం), కీలక వివరాలు, విధానాల అమలు (18శాతం)లను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు కేటాయించారు. పెద్ద, చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య మొత్తంమీది ఫలితాల సాధన విషయంలో చాలా వ్యత్యాసం ఉందని, ఆరోగ్యసూచీలో మొదటి స్థానం పొందిన కేరళ ఆరోగ్యరంగం ఫలితాలు 76.55 శాతమైతే, అట్టడుగు స్థానంలో నిలిచిన యూపీ 33.69 శాతం పాయింట్లు సాధించిందని నివేదికలో పేర్కొన్నారు.

వాహ్.. జీసీసీ!

గత ఏడాదికి దీనిని రూ.247 కోట్లకు పెంచగలిగామన్నారు. ఈ ఏడాది రూ.317 కోట్ల టర్నోవర్ లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. అలాగే రాబోయే రెండేళ్లకాలంలో రూ.500 కట్లో వ్యాపార లక్ష్యాన్ని సాధించే దిశలో ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.



తెలంగాణకు అరకొర నిధులా?

★ కేంద్రంపై కేకే నిప్పులు
★ పోరాడతామని హెచ్చరిక

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయింపుజరిగిందని టీఆర్ఎస్ ఎంపీ కే కేశవరావుఆరోపించారు. నిధుల విషయంలో కేంద్రంపై పోరాడి సాధించుకుంటామని శుక్రవారం ఆయన హెచ్చరించారు. బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న కేకే ఆంధ్రాకు అన్యాయం జరిగిందంటూ ఆ రాష్ట్రానికి చెందిన ఎంపీలు చేస్తున్న పోరాటంపై స్పందిస్తూ అసలు సభలో ఏం జరుగుతోందని ప్రశ్నించారు. ఒక రాష్ట్రానికి అన్యాయం జరిగితే కేంద్రం చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగిందన్న ప్రధాని నరేంద్రమోదీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఒక ప్రధాన మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజనపై లోక్‌సభ, రాజ్యసభలో నిబంధనలు ప్రకారం 15 రోజులు చర్చ జరిగిందని కేశవరావుగుర్తుచేశారు. విభజన బిల్లు రెండు సభల్లో అశాస్త్రీయపద్ధతిలో జరిగిందని మోదీ ఎలా అంటారని కేకే నిలదీశారు. ఎన్డీయే ప్రభుత్వం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను సమానంగా చూస్తామని చెప్పిన ఏపీకి 13 సంస్థలు ఇచ్చారని అన్నారు. తెలంగాణకు ఒకటైనా ఇచ్చారా?అని ఆయన ప్రశ్నించారు. లోక్‌సభలో ఏపీకి కేటాయించిన నిధులు జాబితాను చదివి వినిపించారు. కాని ఒక్క రూపాయి కూడా తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వలేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఎయిమ్స్ కేంద్రం ప్రకటించిందని, నిధులు కేటాయింపులు ఇప్పటివరకు జరగలేదని చెప్పారు.

దశాబ్దాల సాంప్రదాయానికి తెర

ఆర్టీసీలో ఇక ట్రే బాక్స్‌లు కనపడవు ★ సర్క్యులర్ జారీచేసిన ఈడీ జయరావు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 9: ఏపీఎస్ఆర్టీసీలో గడచిన కొన్ని దశాబ్దాలుగా కండక్టర్ల చేతుల్లో కన్పిస్తూ వచ్చే ట్రే బాక్స్‌లు ఇక బూతద్దం పెట్టి వెతికినా కన్పించబోవు. టికెట్ ఇష్యూయింగ్ మిషన్‌లు 'టిమ్స్' వచ్చిన తర్వాత కూడా వీటిని తమ వెంట ఉంచుకుని కాపాడుకోవాల్సి రావటం కండక్టర్లకు శిరోభారంగా మారుతోంది. దీనివల్ల కండక్టర్ ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతున్నందున ట్రే బాక్స్‌లను తొలగించాలంటూ ఎంతోకాలంగా కార్మికులు యాజమాన్యాన్ని కోరుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయరావు ఈ ట్రే బాక్స్‌ల విధానాన్ని రద్దుపరుస్తూ సర్క్యులర్ జారీ చేశారు. దీనిపై ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవి రావు, ప్రధాన కార్యదర్శి కె.పద్మాకర్, అదనపు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరిగే గుర్తింపు ఎన్నికల్లో తాము గెలిచిన వెంటనే ఇతర అపరిష్కృత సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీలో గత దశాబ్దకాలంగా క్రమేణా అన్ని బస్సుల్లోను కండక్టర్లు 'టిమ్స్' వినియోగించేలా చర్యలు చేపట్టారు. అంతకుముందు డ్యూటీలోకి ప్రవేశించే ముందు టిక్కెట్లను ట్రే బాక్సుల్లో పెట్టి ఇచ్చేవారు. అయితే 'టిమ్స్' వచ్చినా నేటికీ అదే విధానం కొనసాగుతున్నది. అదేమని ప్రశ్నిస్తే మార్గ మధ్యంలో 'టిమ్స్' మిషన్‌లు ఆగిపోతే టిక్కెట్లు ఇచ్చేందుకు వీలుగా కొన్ని టిక్కెట్లను ఆ బాక్స్‌ల్లో పెట్టి అందజేస్తున్నారు. అయితే ఈ విధానం సరికాదని 'టిమ్' ఆగిపోతే ఎంఆర్ బుక్ ఇచ్చి పంపిస్తే ప్రయాణికులకు అందులో నుంచి రశీదు ఇచ్చి డిపోకు చేరుకుంటామని లేదంటే ఆ ట్రే బాక్సుల్లో విలువైన టిక్కెట్లలో ఏ ఒక్కటి గాలికి ఎగిరిపోయినా, లేక గల్లంతయినా మార్గమధ్యంలో తనిఖీ అధికారులు కేసులు రాస్తున్నారని భయపడుతూ వచ్చారు. దానివల్ల తమకు ఉద్యోగ భద్రత లేకుండా పోతున్నదని అన్నారు. ఇక నుంచి ట్రే బాక్స్‌లను తొలగిస్తున్నందున ఒక్కో డిపోకు అదనంగా 20 టిమ్స్‌ను అందచేయబోతున్నారు. అయితే మార్గమధ్యంలో పొరబాటున టిమ్స్ పాడైపోతాయనే ఉద్దేశంతో కండక్టర్‌కు ఇక రూ.5, రూ.10ల టిక్కెట్లు కొన్ని ఇస్తారు. వాటిని తాత్కాలికంగా ఉపయోగించి డిపోకు చేరిన తర్వాత మరో టిమ్స్ తీసుకుని వెళ్లవచ్చు. ఈ విధానం తక్షణం అమల్లోకి వస్తుంది. ఇప్పటివరకు ప్రతి కండక్టర్ కూడా తమ వద్దనున్న ట్రే బాక్సుల్లో టిక్కెట్లు సరిగ్గా ఉన్నాయో, లేవో ఎవరైనా తీసి వేసారేమో, టిక్కెట్లు రాలిపోయాయేమో అనే భయంతో టెన్షన్‌గా ఉండేవారు.

ఎందుకు ఆదుకోరూ?

- కేంద్రాన్ని నిలదీయడానికి హస్తిన వెళ్లిన కేసీఆర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 9: బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం మొండి చూపడాన్ని తెలంగాణ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతుంది. బడ్జెట్‌పై ఇప్పటి వరకు అసంతృప్తి మాత్రమే వ్యక్తం చేసిన టిఆర్ఎస్ పార్లమెంట్‌లో గళాన్ని పెంచింది. కొత్త రాష్ట్రం తెలంగాణకు కేంద్రం ఇతోధిక సహాయం చేయకపోగా కనీసం విభజన చట్టంలో ఇచ్చిన హామీలనైనా నెరవేర్చక పోవడం పట్ల టిఆర్ఎస్ ఆగ్రహంగా ఉంది. కేంద్ర బడ్జెట్‌లో తమకు అన్యాయం జరిగిందంటూ ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఆందోళన పథాన్ని ఎంచుకోవడంతో అదే ఇదే ఆదునుగా తెలంగాణ సర్కార్ కూడా గత రెండు మూడు రోజులుగా పార్లమెంట్‌లో గళాన్ని పెంచింది. ఒకవైపు కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ సర్కార్ నిలదీస్తుంటే తెలంగాణ సర్కార్ నోరు మెదపకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని టిఆర్ఎస్ భావిస్తుంది. కేంద్రం వైఖరి పట్ల తెలంగాణ మంత్రులు, ఎంపీలు బహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ సిఎం కె చంద్రశేఖర రావు ఇప్పటి వరకు మౌనంగానే ఉన్నారు. తన అసంతృప్తిని నేరుగా ప్రధాన మంత్రికే తెలియజేయాలని శుక్రవారం సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ప్రధాని మోదీతో అపాయింట్ లభించే పక్షంలో నేరుగా ఆయనకే తన అసంతృప్తిని వ్యక్తం చేసే అవకాశం ఉన్నట్టు టిఆర్ఎస్ వర్గాల సమాచారం. ఒకవేళ అపాయింట్‌మెంట్ లభించని పక్షంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో చర్చించనున్నారని తెలిసింది.

ఎన్డీయేకు మిత్రపక్షం కాకపోయినా పెద్ద నోట్ల రద్దుతో పాటు కేంద్రం తీసుకున్న ప్రతీ నిర్ణయానికి అండగా నిలబడినప్పటికీ కొత్త రాష్ట్రం తెలంగాణను ఆదుకోవడంలో మాత్రం ఆశించిన మేరకు చొరవ కనబర్చడం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని తన ఢిల్లీ పర్యటనలో ఎన్డీయో పెద్దల వద్ద వ్యక్తం చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. బడ్జెట్‌లో కేటాయింపులో న్యాయం జరుగకపోయినా కనీసం విభజన హామీలనైనా ఎందుకు నెరవేర్చడం లేదని ముఖ్యమంత్రి నిలదీయనున్నారని పార్టీ వర్గాల సమాచారం. కోటి ఎకరాలకు సాగునీటి అందించే లక్ష్యంతో చేపట్టిన కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఒక దానిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని మొదటి నుంచి కోరుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం పట్ల తెలంగాణ ప్రభుత్వం అసంతృప్తిని వ్యక్తం చేస్తుంది. ఇప్పటికే జాతీయ హోదా కల్పించిన ప్రాజెక్టులకు బడ్జెట్‌లో వంద కోట్లకు మించి కేటాయించకపోవడం ఈ డిమాండ్ పట్ల తాము వత్తిడి చేయడం లేదని టిఆర్ఎస్ ఎంపి బి వినోద్‌కుమార్ అన్నారు. అయితే దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో వినూత్న పథకాలు చేపట్టడంతో ఇతర రాష్ట్రాలు, నీతి ఆయోగ్ ముఖ్యంగా కేంద్ర మంత్రులు సైతం రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రశంసిస్తున్నారు తప్ప నయా పైసా విదిలించడం లేదని టిఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ. 5 వేల కోట్ల సహాయం చేయాలని నీతి ఆయోగ్ కేంద్రానికి సిఫారసు చేసింది.

క్రీడాభూమి



ఆరంభం అదిరింది

అట్టహాసంగా వింటర్ ఒలింపిక్స్ మొదలు

పయాంగ్‌చాంగ్, ఫిబ్రవరి 9: ఎన్నో అనుమానాలు తలెత్తినప్పటికీ, చివరికి వింటర్ ఒలింపిక్స్ ఇక్కడి జాతీయ స్టేడియంలో శుక్రవారం ఘనంగా మొదలయ్యాయి. చలి తీవ్రత కారణంగా ప్రేక్షకుల సంఖ్య తగ్గుతుందని కొందరు అనుకుంటే, మార్చిఫాస్ట్‌కు చాలా మంది అథ్లెట్లు దూరమవుతారని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఉత్తర కొరియా బృందం పాల్గొనడంపైన కూడా భిన్నస్వరాలు వినిపించాయి. కానీ, అన్ని అనుమానాలకు తెరదించుతూ, పయాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఉత్తర, దక్షిణ కొరియా అథ్లెట్లు 'యునైటెడ్ ఫ్లాగ్'తో కవాతులో పాల్గొనడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జయే ఇన్, అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ తదితరులు స్టాండ్స్‌లో కూర్చొని ఈ కార్యక్రమాన్ని తిలకించారు. అమెరికా అథ్లెట్లు గాంగ్నమ్ స్టయిల్‌లో డాన్స్ చేస్తూ ప్రేక్షకులను అలరించారు. అయితే నాలుగు పర్యాయాలు స్వర్ణ పతకాలు సాధించిన శాంతి డావిక్‌ను కాదని ఎరిన్ హామ్లిన్‌ను ఫ్లాగ్ బేరర్‌గా అమెరికా అధికారులు ఎంపిక చేయడంపై నిరసనలు వ్యక్తమయ్యాయి.

రష్యా అథ్లెట్లకు చుక్కెదురు

వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనాలనుకున్న 47 మంది రష్యా అథ్లెట్లకు క్రీడా మధ్యవర్తిత్వ కోర్టు (సీఏఎస్)లో చుక్కెదురైంది. డోప్ దోషులను లేదా డోప్ కేసులో ఇరుక్కున్న వారిని వింటర్ ఒలింపిక్స్‌కు ఆహ్వానించేది లేదని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) తీసుకున్న నిర్ణయాన్ని కాదనలేమని సీఏఎస్ స్పష్టం చేసింది. నిషిద్ధ మాదక ద్రవ్యాలను వినియోగించిన కారణంగా డోప్ పరీక్షల్లో దోషులుగా పట్టుబడిన రష్యా అథ్లెట్లలో కొంత మందిపై ప్రపంచ డోపింగ్ నిరోధక విభాగం (వాడా) సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. కాగా, తనపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిషేధానికి గురైన అథ్లెట్లు చేసిన అప్పీల్‌ను పరిశీలించిన సీఏఎస్ సరైన సాక్ష్యాధారాలు లేవన్న కారణంగా 28 మంది అథ్లెట్లకు క్లీన్ చిట్ ఇచ్చింది. వారిపై నిషేధాన్ని ఎత్తివేయాలని వాడాను ఆదేశించింది. ఇలావుంటే, సమ్మర్ లేదా వింటర్ ఒలింపిక్స్‌కు ఎవరెవరిని ఆహ్వానించాలనే విషయంలో నిర్ణయాధికారం తమకే ఉందని, కాబట్టి, డోప్ దోషులను పయాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌కు ఆహ్వానించేది లేదని ఐఓసీ తేల్చిచెప్పింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ 47 మంది మరోసారి సీఏఎస్‌లో పిటిషన్ వేశారు. అప్పటికే సీఏఎస్ నుంచి క్లీన్ చిట్ పొందిన వారిలో 15 మంది ఈ పిటిషనర్ల జాబితాలో ఉన్నారు. మిగతా 32 మందిలో కొరియాలో జన్మించి, రష్యాకు వలస వెళ్లిన స్కేటర్ విక్టర్ ఆన్, బయాథ్లాన్ స్వర్ణ పతక విజేత ఆంటన్ షిపులిన్ తదితరులు ఉన్నారు. వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం కల్పించాలని వీరు చేసుకున్న పిటిషన్‌పై సీఏఎస్ స్పందిస్తూ, ఐఓసీ నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. వాడా విధించిన సస్పెన్షన్‌పై తీర్పునిచ్చామని, అయితే, ఎవరిని ఆహ్వానించాలి? ఎవరిని ఆహ్వానించకూడదు? అనే విషయంలో ఐఓసీ తీసుకున్న నిర్ణయాన్ని కాదనలేమని తెలిపింది. అప్పీల్‌ను సీఏఎస్ తోసిపుచ్చడంతో, వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశాన్ని 47 మంది రష్యా అథ్లెట్లు కోల్పోయారు. డోపింగ్‌కు విరుద్ధంగా ఐఓసీ గట్టి ప్రయత్నాలు చేస్తున్న కారణంగా రష్యాసహా ఏ దేశానికీ డోప్ పరీక్షల నుంచి ఉపశమనం లభించడం లేదు.

బరిలో 168 మంది రష్యన్లు

ఇలావుంటే, వ్యూహాత్మక డోపింగ్‌కు పాల్పడినట్టు ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన రష్యా నేరుగా వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయింది. అయితే, తమ పతాకంపై అథ్లెట్లు పోటీ చేయవచ్చని, వారిని న్యూట్రల్ టీంగా పరిగణిస్తామని ఐఓసీ ఇది వరకే ప్రకటించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని, 168 మందితో కూడిన బలమైన జట్టును ఈసారి వింటర్ ఒలింపిక్స్‌కు రష్యా పంపింది. వీరిలో ఎంత మంది పతకాలు సాధిస్తారో, ఎంత మంది డోప్ పరీక్షల్లో పట్టుబడతారో చూడాలి. డోప్ రహిత ఈవెంట్‌గా వింటర్ ఒలింపిక్స్‌ను నిర్వహిస్తున్నామని, అందుకే కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని ఐఓసీ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. ఇలావుంటే, మధ్య వర్తిత్వ కోర్టుకు వెళ్లిన కొంత మంది అథ్లెట్లకు చుక్కెదురైనప్పటికీ, రష్యా అథ్లెట్లు ఉత్సాహంగా మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. ఐఓసీ పతాకం కింద తాము తలపడుతున్నామన్న బాధగానీ, అలాంటి ఆలోచనగానీ వారిలో కనిపించలేదు. ప్రేక్షకులకు ఉత్సాహంగా అభివాదం చేస్తూ వారు ముందుకు కదిలారు. ఒలింపిక్స్‌ను కుదిపేస్తున్న డోపింగ్ మహమ్మారికి రష్యా నుంచే పుట్టిందన్న విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. అక్కడి ప్రభుత్వమే అథ్లెట్లకు ఉద్దేశపూర్వకంగా ఉత్ప్రేరాలను అందిస్తున్నట్టు వాడా ఆధ్వర్యంలోని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రష్యాపై అంతర్జాతీయ క్రీడా సమాఖ్యలు నిషేధాన్ని విధించాయి.



ఐఓఏ పతాకం కింద పోటీకి దిగనున్న రష్యా వింటర్ ఒలింపిక్స్ అథ్లెట్ల బృందం. డోపింగ్ కారణంగా రష్యాపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే.



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) డైరెక్టర్‌గా వ్యవహరించనున్న పెప్సీ కంపెనీ కో-చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంద్రా నూయి. ఐసీసీలో మొట్టమొదటి మహిళా డైరెక్టర్ ఆమే కావడం విశేషం. అదనంగా మరో డైరెక్టర్ నియమించబడడం, అందులోనూ మహిళకు ఈ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని ఐసీసీ అధ్యక్షుడు శశాంక్ మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. కాగా, ఈ బాధ్యతను తాను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని ఇంద్రా నూయి తెలిపింది. ఐసీసీలోని మిగతా డైరెక్టర్లతో కలిసి పని చేయడానికి తాను చాలా ఉత్సాహపడుతున్నానని తెలిపింది.

ఆసియా బాడ్మింటన్ టీ చాంపియన్‌షిప్

భారత్ నిష్క్రమణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఆసియా బాడ్మింటన్ టీం చాంపియన్‌షిప్ పురుషులు, మహిళల విభాగాల్లో భారత్ పోరాటానికి క్వార్టర్ ఫైనల్స్‌లోనే తెరపడింది. చైనాను ఎదుర్కొన్న భారత్ 1-3 తేడాతో పరాజయాన్ని చవిచూసింది. మహిళల బృందం కూడా అదే తేడాతో ఇండోనేషియా చేతిలో ఓడింది. పురుషుల మొదటి సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 14-21, 21-16, 21-7 తేడాతో షి యుకీని ఓడించి భారత్‌కు శుభారంభాన్ని అందించాడు. అయితే, డబుల్స్ మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ 17-21, 18-21 తేడాతో హీ జిటింగ్, టాంగ్ కియాంగ్ జోడీ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. రెండో సింగిల్స్‌లో కియావో బిన్‌ను ఎదుర్కొన్న సాయి ప్రణీత్ 21-8, 11-21, 17-21 తేడాతో ఓడాడు. రెండో డబుల్స్‌లో మను అత్రి, సుమీత్ రెడ్డి జోడీ 21-14, 19-21, 14-21 తేడాతో హన్ చెంగ్‌కాయ్, జూ హావోడాంగ్ జోడీ చేతిలో పరాజయాన్ని చవిచూడడంతో చైనా 3-1 ఆధిక్యంతో గెలిచింది. దీనితో సమీర్ వర్మ, జావో జున్‌పెంగ్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ని రద్దు చేశారు.


మహిళల విభాగంలోనూ విజయంతోనే క్వార్టర్ ఫైనల్ పోరు మొదలైంది. తెలుగు తేజం పీవీ సింధు 21-13, 24-22 తేడాతో ఫినేత్రిని ఓడించింది. అయితే, ఆతర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో భారత్ పరాజయాలను చవిచూసింది. అశ్వినీ పొన్నప్ప, సిక్కీ రెడ్డి జోడీపై గ్రేసియా పోలి, అప్రియానీ రహయూ 21-5, 21-16 తేడాతో విజయం సాధించారు. శ్రీకృష్ణ ప్రియ కుందరవల్లిపై హన్నా రమాదినీ 21-8, 21-15 తేడాతో చిత్తుచేసింది. సంయోగిత గోర్పాడే, పీవీ సింధు జోడీని అన్గియా షిట్టా అవాండా, నీ కెటూర్ మహాదేవి ఇస్టారాణి జోడీ 21-9, 21-18 ఆధిక్యంతో సులభంగానే ఓడించింది. ఈ విజయంతో 3-1 ఆధిక్యాన్ని అందుకోగా, రుతుపర్ణ పాండ, జార్జియా మరిస్కా టుంజంగ్ మధ్య జరగాల్సిన చివరి మ్యాచ్ రద్దయింది.



ఎముకలు కొరికే చలిలోనూ ఒంటిపై చొక్కా లేకుండానే వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ సమయంలో మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొన్న టోంగాకు చెందిన క్రాస్ కంట్రీ స్కీయర్ పిటా టౌంటోఫువా

ఆంక్షల సడలింపు

పయాంగ్‌చాంగ్, ఫిబ్రవరి 9: ఉత్తర కొరియా అధికారులపై విధించిన ఆంక్షలను వింటర్ ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకొని ఐక్యరాజ్య సమితి సడలించింది. దక్షిణ కొరియాలోని పయాంగ్‌చాంగ్‌లో శుక్రవారం ప్రారంభమైన వింటర్ ఒలింపిక్స్‌లో ఉత్తర కొరియాకు చెందిన కొంత మంది ఉన్నతాధికారులు హాజరయ్యే విషయంలో చివరి వరకూ ఉత్కంఠ నెలకొంది. అణు పరీక్షలు, క్షిపణుల ప్రయోగాలు వంటి కార్యకలాపాలతో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ చాంగ్ ఉన్ యావత్ ప్రపంచాన్ని ఆందోళనకు గురి చేస్తున్న విషయం తెలిసిందే. అమెరికా వంటి అగ్రరాజ్యాలు ఎన్నిసార్లు హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో, ఉత్తర కొరియాపై ఐక్యరాజ్య సమితి ఆంక్షలు విధించింది. అయితే, దేశాధ్యక్షుడు కిమ్ చెల్లెలు కిమ్ యో జాంగ్, ఉత్తర కొరియా క్రీడా మార్గదర్శక కమిటీ చైర్మన్ చో వెయ్ తదితరులు దక్షిణ కొరియాకు వెళ్లేందుకు అనుమతినివ్వాల్సిందిగా చేసుకున్న విజ్ఞప్తిపై సమితి సానుకూలంగా స్పందించింది. వారిపై ఆంక్షలను సడలించడంతోపాటు, తమతోపాటు విలువైన సామాగ్రిని తీసుకెళ్లడానికి కూడా అనుమతించింది. ఐక్యరాజ్య సమితి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, పలువురు అధికారులతో కలిసి కిమ్ యో జాంగ్ శుక్రవారం ఉదయం పయాంగ్‌చాంగ్ చేరుకుంది. విమానాశ్రయంలో దక్షిణ కొరియా అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.



వింటర్ ఒలింపిక్స్ క్రీడాజ్యోతిని దక్షిణ కొరియా ఫిగర్ స్కేటర్ యునా కిమ్‌వెలిగించింది. అనంతరం జరిగిన కవాతులో ఉత్తర, దక్షిణ కొరియా అథ్లెట్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అవిభక్త కొరియా బొమ్మతో ఉన్న జెండాతో ఇరు దేశాల అథ్లెట్లు కవాతు చేశారు. ఎవరు, ఏ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారో తెలియని రీతిలో వీరు కలిసి పోయి కనిపించారు.

ఫెడ్ కప్ టెన్నిస్

హాంకాంగ్‌పై భారత్ గెలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఫెడ్ కప్ టెన్నిస్ ఆసియా/ఓషియానియా గ్రూప్ వన్ లీగ్‌లో భాగంగా శుక్రవారం హాంకాంగ్‌ను ఢీకొన్న భారత్ 0-3 తేడాతో విజయం సాధించింది. మొదటి మ్యాచ్‌లో కర్మాన్ కౌర్ 6-3, 6-4 ఆధిక్యంతో ఇడియా చోంగ్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో అంకిత రైనా 6-3, 6-2 ఆధిక్యంతో లింగ్ జాంగ్‌పై గెలిచి, భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించింది. డబుల్స్ మ్యాచ్‌లో ప్రార్థన తంబారే, ప్రాంజలా యడ్లపల్లి 6-2, 6-4 ఆధిక్యంతో వాన్ యా ఇంగ్, చింగ్ హు ఊ జోడీని ఓడించారు.



పోచెఫ్‌స్ట్రూమ్‌లో శనివారం జరిగే చివరి, మూడో వన్డేకు సిద్ధమైన భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్. మొదటి రెండు వన్డేల్లో గెలిచిన భారత్ తన ప్రత్యర్థిపై క్లీన్ స్వీప్ సాధించాలన్న పట్టుదలతో ఉంది.

'రికార్డు' విజయమే భారత్ లక్ష్యం

నేడు దక్షిణాఫ్రికాతో కోహ్లీ సేన నాలుగో వన్డే

జొహాన్నెస్‌బర్గ్, ఫిబ్రవరి 9: ఆరు మ్యాచ్‌ల వన్డే ఇంటర్నేషనల్స్ సిరీస్‌లో ఇప్పటికే మూడు విజయాలు సాధించిన విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా శనివారం జరిగే నాలుగో మ్యాచ్‌లోనూ గెలవడమే లక్ష్యంగా ఎంచుకుంది. తద్వారా ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్‌ను పదిలంగా నిలబెట్టుకోవడంతోపాటు, దక్షిణాఫ్రికాపై దక్షిణాఫ్రికాలోనే తొలిసారి వన్డే సిరీస్‌ను గెల్చుకుంటుంది. 1992-93లో మొదటిసారి దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్ ఆడిన భారత జట్టు 2010-11 టూర్‌లో సిరీస్‌ను సాధించే దిశగా ముందుకు సాగింది. మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్‌గా వ్యవహరించిన ఆ సిరీస్‌లో మొదటి మూడు మ్యాచ్‌లు ముగిసే సమయానికి భారత్ 2-1 ఆధిక్యాన్ని సంపాదించింది. సిరీస్‌పై ఆశలు రేపినప్పటికీ, చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ పరాజయాలను చవిచూసింది. ఫలితంగా సిరీస్‌ను 2-3 తేడాతో చేజార్చుకుంది. ఆతర్వాత వన్డే సిరీస్‌ను సాధించే అవకాశానికి చేరువకాడంవ ఇదే మొదటిసారి. దీనిని కోహ్లీ బృందం ఎంత వరకూ సద్వినియోగం చేసుకుంటుందో చూడాలి. ఈ మ్యాచ్‌ని గెల్చుకుంటే, చివరి రెండు వన్డేలతో సంబంధం లేకుండా సిరీస్‌ను భారత్ సొంతం చేసుకుంటుంది. మొదటి మూడు మ్యాచ్‌ల్లో మాదిరిగానే, చివరి మూడు మ్యాచ్‌ల్లోనూ టీమిండియా దూకుడును కొనసాగించనుంది. ఈ విషయాన్ని కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు. నాలుగో మ్యాచ్‌లోనూ విజయం సాధించి, సిరీస్‌ను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశాడు. అంతటితో ఆగకుండా ఆతర్వాత కూడా దక్షిణాఫ్రికాపై దాడి కొనసాగుతుందని అన్నాడు. మూడో వన్డేలో సెంచరీతో చెలరేగిన కోహ్లీ మరోసారి అలాంటి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. కెరీర్‌లో 34వ వన్డే సెంచరీ చేసిన అతను, దక్షిణాఫ్రికా పిచ్‌లపై అద్భుతంగా రాణిస్తున్నాడు. శిఖర్ ధావన్ ఫామ్‌లోకి రావడం భారత్‌కు ఊరటనిస్తున్నది. రోహిత్ శర్మ వైఫల్యాలను మినహాయిస్తే, టీమిండియా ఆందోళన చెందాల్సిన అవసరమేమీ కనిపించడం లేదు. పైగా, వరుసగా మూడు మ్యాచ్‌ల్లో పరాజయాలను చవిచూసి, సిరీస్‌ను డ్రా చేసుకోవాలంటే మిగతా మూడు వన్డేల్లోనూ తప్పక గెలవాల్సి ఉన్న దక్షిణాఫ్రికా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. ప్రత్యర్థిని మరింత ఒత్తిడికి గురిచేసి, తద్వారా నాలుగో వన్డేను, సిరీస్‌ను సొంతం చేసుకోవడమే భారత్ వ్యూహంగా ఎంచుకోవడం ఖాయం. కాగా, మూడో వన్డేలో డేల్ స్టెయిన్, మోర్నీ మోర్కెల్ బంతులను ఎదుర్కోవడానికి నానా ఇబ్బందులు పడిన రోహిత్ శర్మ 43 బంతులు ఎదుర్కొని, కేవలం 18 పరుగులు చేయగలిగాడు. ఒకవేళ అతను ఫామ్‌లోకి వస్తే, భారత బ్యాటింగ్ లైనప్ మరింత బలోపేతమవుతుంది. అంతేగాక, కోహ్లీపై ఒత్తిడి కూడా తగ్గుతుంది. స్వదేశంలో దక్షిణాఫ్రికా రెచ్చిపోతుందని, అందుకే ఆ జట్టును ఓడించడం అనుకున్నంత సులభం కాదని ఇన్నాళ్లూ ఉన్న భయాలను దూరం చేస్తూ, వరుసగా మూడు వన్డేల్లో విజయభేరి మోగించిన భారత్ శనివారం నాటి మ్యాచ్‌ని కూడా గెల్చుకుంటుందని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. దక్షిణాఫ్రికాను తక్కువ అంచనా వేయడానికి వీల్లేకపోయినా, ప్రస్తుతం అన్ని విభాగాల్లోనూ పటిష్టంగా ఉన్న భారత్‌నే ఫేవరిట్‌గా అభివర్ణిస్తున్నారు. సిరీస్‌ను కోల్పోకుండా ఉండాలంటే, తప్పక గెలవాల్సిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా ఏ స్థాయిలో భారత్‌కు పోటీనిస్తుందో చూడాలి.

భారత కాలమానం ప్రకారం మ్యాచ్ శనివారం సాయంత్రం 4.30 గంటలకు మొదలవుతుంది.

డివిలియర్స్‌పైనే భారం!

జొహాన్నెబర్గ్, ఫిబ్రవరి 9: స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ వేలి గాయం నుంచి కోలుకొని మళ్లీ జట్టులోకి రావడం దక్షిణాఫ్రికాకు ఊరటనిస్తున్నది. అతనొక్కడే మ్యాచ్‌ల ఫలితాలను ఒంటిచేత్తో గెలిపిస్తాడా అన్న అనుమానాన్ని పక్కపెడితే, అతని రాకతో జట్టు ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం ఖాయంగా పెరుగుతుంది. అంతేగాక, ఒకసారి ఫామ్‌లోకి వస్తే, డివిలియర్స్‌ను నిలువరించడం హేమాహేమీ బౌలర్లకు కూడా సాధ్యం కాదని గతంలో చాలాసార్లు స్పష్టమైంది. డివిలియర్స్ పూర్తి ఫిట్నెస్‌తో ఉన్నాడా? లేదా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్లేయింగ్ ఎలెవెన్‌లో అతను ఉంటాడా? అన్న ప్రశ్నకు కూడా సరైన సమాధానం లేదు. ఈ విషయంలో దక్షిణాఫ్రికా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

పింక్ వన్డేల్లో తిరుగులేని హీరో

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కోసం ప్రత్యేకించే వన్డేలో స్టేడియం మొత్తం గులాబీమయంగా కనిపిస్తుంది. 2011 నుంచి జరుగుతున్న ఈ ప్రత్యేక వన్డేల్లో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు కూడా పింక్ జెర్సీలే ధరిస్తారు. బ్యానర్లు, చివరికి స్కోరుబోర్డు చుట్టూ ఉండే బార్డర్ కూడా గులాబీ రంగులో మెరిసిపోతుంది. ఇలాంటి పింక్ వన్డేల్లో డివిలియర్స్‌కు ఎదురులేదనే చెప్పాలి. 2015 పింక్ వన్డేలో అతను వెస్టిండీస్‌పై కేవలం 44 బంతుల్లో 149 పరుగులు సాధించాడు. అంతకు ముందు 2013 పింక్ వన్డేలో 47 బంతులు ఎదుర్కొని 77 పరుగులు చేశాడు. మరోసారి అతను అదే స్థాయిలో విజృంభిస్తాడన్న ఆశ అభిమానుల్లోగాక, దక్షిణాఫ్రికా జట్టులోనూ ఉంది. శనివారం నాటి వన్డేలో డివిలియర్స్ బరిలోకి దిగినా, కెప్టెన్సీ పగ్గాలు మాత్రం అయిడెన్ మర్క్రామ్ చేతిలోనే ఉంటాయి. డివిలియర్స్ ఫస్ట్‌డౌన్ (మూడో స్థానం)లో బ్యాటింగ్‌కు దిగుతాడు కాబట్టి, జీన్ పాల్ డుమినీ నాలుగో స్థానంలో వచ్చే అవకాశం ఉంది. డేవిడ్ మిల్లర్ లేదా ఖయా జొన్డొలో ఎవరో ఒకరు తమ స్థానాన్ని డివిలియర్స్ కోసం త్యాగం చేయకతప్పదు. దక్షిణాఫ్రికా జట్టులో ఒకటి రెండు మార్పులు ఉంటాయని అంటున్నారు. భారత్ మాత్రం విన్నింగ్ టీంలో ఎలాంటి మార్పులు లేకుండానే బరిలోకి దిగే అవకాశాలున్నాయి.







విభజన చట్టంలోని అంశాలు అమలుచేయాలంటూ ఢిల్లీలోని ఏపీ భవన్ ఎదుట నినదిస్తున్న కాంగ్రెస్ నేతలు. పార్లమెంట్ ముందు పోతరాజు వేషంలో వినూత్న నిరసన తెలుపుతున్న టీడీపీ ఎంపీ శివప్రసాద్. ప్రత్యేక హోదా డిమాండ్‌తో వైకాపా ఎంపీల ప్లకార్డుల ప్రదర్శన

దద్దరిల్లిన లోక్‌సభ

• ప్లకార్డులతో పోడియం వద్ద ఏపీ ఎంపీల నినాదాలు • మార్చి 5వరకూ సమావేశాలు వాయిదా

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించం ద్వారా గతనెల 29న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు మార్చి 5వ తేదీ వరకూ వాయిదా పడ్డాయి. ఆరు రోజుల పాటు సమావేశాలు జరిగిన తరువాత వచ్చేనెల 5కు వాయిదా వేస్తూ లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. శుక్రవారం నాడు లోక్‌సభ కేవలం 15 నిముషాలు నడిచింది. టీడీపీ, వైకాపా సభ్యులు గత నాలుగు రోజుల మాదిరిగానే శుక్రవారం కూడా స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని ఏపీకి జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూడా పోడియం వద్దకు వచ్చి రాఫెల్ ఒప్పందంపై తామడిగిన ప్రశ్నలకు జవాబు ఇవ్వాలంటూ సభ దద్దరిల్లేలా నినాదాలు ఇచ్చారు. తెలుగుదేశం సభ్యుడు శివప్రసాద్ పోతరాజు వేషంలో లోక్‌సభకు వచ్చారు. ఆయన పోడియం వద్ద కొద్ది సేపు పూనకం వచ్చినట్లు నటించి అందరినీ నవ్వించారు. లోక్‌సభ ఉదయం పదకొండు గంటలకు సమావేశం కాగానే సుమిత్రా మహజన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టేందుకు ప్రయత్నించారు.

అయితే అప్పటికే పోడియం వద్దకు వచ్చిన తెలుగుదేశం, వైఎస్‌ఆర్‌సీపీ సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు ఇస్తూ సభా కార్యక్రమాలను స్తంభింపజేశారు. కాంగ్రెస్ సభ్యులు 'ప్రధాన మంత్రి జవాబు' ఇవ్వాలని రాసిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు ఇచ్చారు. దీంతో సుమిత్రా మహాజన్ సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కాగానే సుమిత్రా మహాజన్ ప్రభుత్వ పత్రాలను సభకు సమర్పించే కార్యక్రమం చేపట్టారు. అయితే టీడీపీ,వైకాపా సభ్యులు పోడియం వద్దకు వచ్చి నినాదాలు ఇవ్వటంతో సభ దద్దరిల్లిపోయింది. స్పీకర్ సుమిత్రా మహాజన్ ఈ నినాదాల గందరగోళం మధ్యనే ప్రభుత్వ పత్రాల సమర్పణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం సభను మార్చి 5వ తేదీ ఉదయం పదకొండు గంటల వరకు వాయిదా వేసి వెళ్లిపోయారు.

ఏపీ డిమాండ్లకు రాహుల్ మద్దతు

అందరూ కృషి చేయాలని ట్వీట్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ప్రత్యేక హోదా ఇవ్వాలన్న ఆంధ్రప్రదేశ్ డిమాండ్‌ను తాము సమర్ధిస్తున్నామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. రాహుల్ గాంధీ శుక్రవారం ఈ మేరకు ట్వీట్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ముందుకు వచ్చి ఏపీకి ప్రత్యేక హోదా సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపుఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వీలున్నంత త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజల న్యాయమైన డిమాండ్లను కాంగ్రెస్ సమర్ధిస్తోంది. రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్న పోలవరం ప్రాజక్టును వీలున్నంత త్వరగా పూర్తి చేయాలి'అని రాహుల్ ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల డిమాండ్ల సాధనకు అన్ని పార్టీలు ముందుకు రావాలన్నారు. సమష్టిగా కృషి చేయటం ద్వారా ఈ డిమాండ్లను అమలు చేయించాలని ఆయన సూచించారు.

హోదా ఇచ్చి తీరాల్సిందే

• ప్రత్యేక ప్యాకేజీ ప్రత్యామ్నాయం కాదు • రాజ్యసభలో విజయసాయి డిమాండ్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వవలసిందేనని వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు విజయసాయి రెడ్డి రాజ్యసభలో మరోసారి డిమాండ్ చేశారు. విజయసాయి రెడ్డి శుక్రవారం రాజ్యసభలో 2018-19 వార్షిక బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాల్గొంటూ ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ఏపీ అభివృద్ధి చెందలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని 2014లో అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ రాజ్యసభలో స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. ప్రధాని ఇచ్చిన హామీని కూడా అమలు చేయరా? అని విజయసాయి నిలదీశారు. ఏపీకి ప్రత్యేక హోదా జీవనదిలాంటిది, దీనికి మరో ప్రత్యామ్నాయమనేదే లేదని ఆయన ఉద్ఘాటించారు. ప్రత్యేక హోదాకు ప్రత్యేక ప్యాకేజీ అనేది ఎటువంటి పరిస్థితిలోకూడా ప్రత్యామ్నాయం కాదని ఆయన అన్నారు. అందుకే ప్రత్యేక హోదా ఇవ్వకపోతే ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందలేదన్నారు. హోదా ఇవ్వకపోతే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రాష్ట్రంగానే మిగిలిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే జోన్ విషయంలో రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ సభను తప్పుదోవ పట్టించారని ఆయన దుయ్యబట్టారు. రైల్వే జోన్‌ను ఏర్పాటు చేసేందుకు ఇతర రాష్ట్రాలతో చర్చలు జరపాలని విభజన చట్టంలో ఎక్కడా సూచించలేదన్నారు.

రైల్వే జోన్ ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో చర్చలు జరపాలని ఇప్పుడు పీయూష్ గోయల్ చెప్పటం వెనక ఉన్న అర్థం ఏమిటని ఆయన నిలదీశారు. కడపలో ఉక్కు కార్మాగారం ఏర్పాటు, దుగ్గిరాజపట్నంలో ఓడరేవు ఏర్పాటు, వైజాగ్ పెట్రో కెమికల్ కంప్లెక్స్, వైజాగ్ చెన్నై పారిశ్రామిక కారిడార్, వైజాగ్,విజయవాడ మెట్రో రైలును ఏర్పాటు చేయవలసి ఉందని వైఎస్‌ఆర్‌సీపీ నేత స్పష్టం చేశారు. ఇవన్నీ ఎప్పుడు చేస్తారని ఆయన ప్రశ్నించారు. షెడ్యూలు 13లో 13 నుంచి తొమ్మిది సంస్థలు ఏర్పాటు చేశారు. ఈ సంస్థలకు కేటాయింపులు చేయాలన్నారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేయాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. ఫార్మింగ్ సంస్థల ఆదాయానికి కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఆదాయం పన్ను మినహాయింపు ఇవ్వడాన్ని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయాన్ని ఆదాయం పన్ను పరిధి నుంచి తప్పించినప్పుడు ఫార్మింగ్ సంస్థలకు కేవలం ఐదు సంవత్సరాలు పాటు మాత్రమే మినహాయింపు ఇవ్వటం ఏమిటని ఆయ నిలదీశారు.

వేడుకగా ధ్వజారోహణం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9: శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ధ్వజారోహణం వేడుకగా జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు దేవరాత్రిని పురస్కరించుకుని వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, గంగాదేవి సమేత సోమ స్కందమూర్తి, జ్ఞాన ప్రసూనాంబ, చండికేశ్వరుడు పంచమూర్తులను పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు అనంతరం ఉత్సవ మూర్తులను ఆలయంలోని స్వామివారి ధ్వజ స్తంభం చుట్టూ కొలువుదీర్చారు. అర్చకులు, వేద పండితులు హోమం నిర్వహించారు. ధ్వజ స్తంభానికి అభిషేకం చేసి, దర్భలతో తయారు చేసిన దారాన్ని అలంకరించారు. అనంతరం భక్తులు సమర్పించిన చీరలను ధ్వజస్తంభానికి అలంకరించారు. ఆ తరువాత అఖండ దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లా దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ అధ్యక్షులు పీఆర్ మోహన్, శాంతారాంజే పవార్, శివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి రఘునాథ్, ఈఓ భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం తిరిగి వెండి అంబారీలపై పట్టణంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరిగింది.



రైతుకు ఒరిగిందేమీ లేదు

• కేంద్రప్రభుత్వ అహంకార ధోరణి వీడాలి • ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు • రాజ్యసభలో విపక్షాల దాడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: అహంకార ధోరణితో, బూటకపు సామ్యవాద పద్ధతుల్లో నడుస్తున్న కేంద్రప్రభుత్వం సమర్పించిన బడ్జెట్ రైతులను వెన్నుపోటు పొడిచేదిగా ఉందని, ఈ విషయంలో ప్రజలను తప్పుదోవపట్టించరాదని విపక్షాలు హెచ్చరించాయి. రాజ్యసభలో శుక్రవారం బడ్జెట్‌పై చర్చ పునఃప్రారంభమైన తరువాత తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఒబ్రియిన్ మాట్లాడుతూ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలపై భారాన్ని మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కనీస గిట్టుబాటు ధర లభించక రైతులు ఇప్పటికీ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, బీజేపీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు నీరజ్ శేఖర్ అన్నారు. అంతర్జాతీయ విపణిలో ముడిచమురు ధర గణనీయంగా తగ్గినప్పటికీ దేశంలో పౌరులు లీటర్‌కు 75 రూపాయలు చెల్లించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. నిజానికి ముడిచమురు ధర ఆకాశాన్ని తాకేలా బారెల్‌కు 140 డాలర్లుగా పెరిగినప్పుడు అదే ధర ఉండగా, ఇప్పుడు ఎందుకు తగ్గలేదని, ఈ లెక్కల్లో మతలబేమిటో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. నిరర్థక ఆస్తుల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చిన రుణాల వివరాలు ప్రకటించాలని, జన్‌ధన్ ఖాతాల్లో 71వేల కోట్ల రూపాయలు డిపాజిట్ అయ్యాయని చెబుతున్న ప్రభుత్వం డీమానిటైజేషన్ తరువాత ఆయా ఖాతాల్లో ఎంత మొత్తం జమయ్యిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులు, యువత, మైనారిటీలను తప్పుదోవ పట్టించడం సరికాదని హెచ్చరించారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలని కోరుతూ బీజేపీ మిత్రపక్షం తెలుగుదేశం సభ్యులు ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకువచ్చారు.

తమ మంత్రి పదవులకు రాజీనామా చేయకుండా తెలుగుదేశం సభ్యులు వెల్‌లోకి దూసుకువచ్చి ఎలా నిరసన వ్యక్తం చేస్తారని సభాకార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న బసవరాజ్ పాటిల్‌ను వైఎస్‌ఆర్‌సీపీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. కొందరు తెలుగుదేశం సభ్యులు గట్టిగా నినాదాలు చేస్తున్న సమయంలో మాట్లాడటానికి ప్రయత్నించిన డెరెక్ ఒబ్రియిన్ వారి సమస్యపట్ల తమకు సానుభూతి ఉందని స్పష్టం చేశారు. 'మీతో మేం ఉంటాం, మీరు అధికారపక్షం వైపు నుంచి మా వైపు రావాలి' అని అన్నారు. ఈ సందర్భంగా చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ సభ్యుడు పి.చిదంబరం పన్నెండు ప్రశ్నలను సంధించారు. రైల్వేకు సంబంధించిన అంశాల్లో ఒబ్రియిన్ పన్నెండు ప్రశ్నలను అడిగారు. రైల్వేలు కేంద్రానికి సంబంధించినవయితే రాష్ట్రాలు ఎందుకు భారం మోయాలని నిలదీశారు.

ఎమ్మెల్యేల కొనుగోలుకు యత్నం

టీడీపీపై వైఎస్‌ఆర్‌సీపీ నేత విజయసాయి ఆరోపణ

ఈసీని కలిసి ఫిర్యాదు చేసిన ఎంపీ

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఏపీలో వచ్చే రాజ్యసభకు జరిగే ఎన్నికలు హైదరాబాద్‌లోనే నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఓపీ రావత్‌కు వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని శుక్రవారం ఇక్కడ ఆరోపించారు. రావత్‌తో సమావేశమైన విజయసాయి టీడీపీపై ఫిర్యాదు చేశారు. అనంతరం విజయసాయిరెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ రాజ్యసభ ఎన్నికలల్లో అధికార టీడీపీ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తోందని ఈసీకి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. వెంటనే వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యేలకు సెంట్రల్ పోలీస్ సెక్యూరిటీ రక్షణ కల్పించాలని కోరినట్టు ఆయన వెల్లడించారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 25 కోట్లు ఆఫర్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బేరసారాలకు రంగంలోకి దించారని ఆయన అన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేదు: రేణుకా చౌదరి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఎందుకు ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నించారు.శుక్రవారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆమె రాజ్యసభలో మాట్లాడుతూ ఏపీకి విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇదే సభలో హామీలిచ్చిన ప్రభుత్వం వీటిని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని పేర్కొన్నారు. బీజేపీ తెలుగు రాష్ట్రాలను పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మరో కాంగ్రెస్ ఎంపీ రాపోలు విభజన హామీలు అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రయిన్, అకాలీదళ్ ఎంపీ నరేష్ గుజ్రాల్ తదితరులు విజ్ఞప్తి చేశారు.

టీడీపీ,వైకాపా డ్రామాలు: కొత్తపల్లి గీత

ఏపీ విభజన హామీల అమలు సాధన పేరుతో టీడీపీ,వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు పార్లమెంట్‌లో డ్రామాలు చేస్తున్నారని అరకు ఎంపీ కొత్తపల్లి గీత ఆరోపించారు. ఏపీ హక్కుల కోసం పార్లమెంట్‌లో రాష్ట్ర ఎంపీలు చేస్తున్న నిరసనల్లో పాల్గొనడం లేదని తనపై వస్తున్న విమర్శలపై కొత్తపల్లి స్పందించారు. పార్లమెంట్‌లో టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీల తీరును ఆమె తప్పుపట్టారు. కేంద్రం ఏపీకి ఇచ్చే నిధులు విషయయంలో ప్రభుత్వం ఎందుకు లెక్కలు చెప్పడం లేదని ప్రశ్నించారు. తన అరకు పార్లమెంటరీ నియోజక వర్గంలో 25 వెల కోట్ల రూపాయలు కేంద్రం నుంచి తీసుకొస్తే ఒక్కపైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాలేదని ఆరోపించారు.

ఎయిమ్స్‌కు నిధులివ్వాలి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్రానికి ప్రకటించిన ఎయిమ్స్‌కు నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాను లక్ష్మారెడ్డి కలిసి కోరారు. తరువాత ఆయన విలేఖరుతో మాట్లాడుతూ గత కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఎయిమ్స్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఇప్పటి వరకూ నిధులు కేటాయించలేదని ఆయన అన్నారు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం లేకపోవడంతో కేంద్ర మంత్రుల దృష్టికి తెచ్చినట్టు ఆయన చెప్పారు. ఎయిమ్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని జైట్లీ, నడ్డాను కోరినట్టు వెల్లడించారు. ఎయిమ్స్ నిర్మాణానికి సంబంధించిన స్థలం, ఇతర సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న లక్ష్మారెడ్డి ఇదే విషయం కేంద్రానికి తెలిపామన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రీతి సుధాన్‌తో సమావేశమై, ఎయిమ్స్‌కు నిధులు సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని లక్ష్మారెడ్డి కోరారు. కేంద్ర మంత్రులను కలిసిన వారిలో టీఆర్‌ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, నగేశ్, సీతారాంనాయక్, కొండా విశ్వేశ్వరరెడ్డి, ఢిల్లీలోని ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలచారి తదితరులు ఉన్నారు.

రాష్ట్రపతిని కలిసిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ఈనెల 19నుంచి 21 వరకు జరిగే ప్రపంచ కాంగ్రెస్ ఐటీ సదస్సులో పాల్గొనాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను తెలంగాణ ఐటీ, పంచాయతీ శాఖ మంత్రి కే.తారకరామారావుఆహ్వానించారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతిభవన్‌లో మంత్రి కేటీఆర్ రాష్ట్రపతి కోవింద్‌తో సమావేశమయ్యారు.

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

మాతృభూమి
పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే
ఆంధ్రభూమి
శనివారం 10, ఫిబ్రవరి 2018



మనం మంచి పనులు చేసినపుడు మన జీవితంలోగానీ ,
మరొకరి జీవితంలోగానీ ఏ అద్భుతం
జరుగుతుందో ఊహించలేం.
-హెలెన్ కెల్లర్

ఆర్ట్ సిల్క్.. అదిరే!



పెళ్లి లేదా వేడుక ఏదైనా చీర కొనాలనుకుంటే చాలామంది మహిళలు ఇష్టపడేది పట్టుచీరనే. ప్రతిసారీ పట్టుచీర కొనాలంటే తటపటాయించక తప్పదు. షాపింగ్‌కు వెళ్లిన ప్రతిసారీ పట్టుచీర కొనాలంటే జేబులకు చిల్లులు పడతాయి. అందుకే చాలామంది మగువలు ఆర్ట్ సిల్క్ చీరలను ఇష్టపడుతున్నారు. పట్టుచీర స్థానంలో ఆర్ట్ సిల్క్ చీరలు మార్కెట్లో సందడి చేస్తున్నాయి. సంప్రదాయ వేడుకలకు నిండుదనాన్ని తీసుకువస్తున్నాయి. ప్యూర్ సిల్క్ లేదా ఆర్ట్ సిల్క్ చీరలు చిరుగాలికి సైతం రెపరెపలాడుతుంటాయి. లైట్‌వెయిట్‌తో పండుగ లేదా శుభకార్యాల్లో ప్రత్యేకంగా కనిపిస్తారు. రాబోయేది వేసవి కాలం కాబట్టి ఇంకా మరింత సౌకర్యవంతంగా మేనుకు హత్తుకుంటాయి. ఆర్ట్ సిల్క్ చీరల తయారీ పట్టుచీర కంటే తక్కువగా ఉంటుంది. ఆర్ట్ సిల్క్ చీరలు రేయాన్తో తయారుచేస్తారు. వీటిపై డిజైన్లు, ప్రింట్స్ అన్నీ కూడా పట్టుచీరను పోలి ఉండటంతో ఆర్ట్ సిల్క్ చీరను పట్టుచీరగానే భ్రమపడతారు. కాటన్, పట్టు, ఉన్ని దారాలతో తయారుచేసే ఈ చీరలు ఖరీదు తక్కువ. ఈ చీరలు కట్టుకుంటే మేనుకు చల్లగా ఉంటుంది. ఏ కాలంలోనైనా పట్టుచీరను మరిపిస్తోంది.ఈ చీరలపై ఏ డిజైన్ వేసినా ప్రత్యేకంగా కనిపిస్తాయి. పార్టీవేర్‌గానూ వస్తున్నాయి. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆర్ సిల్క్‌చీరలను చక్కని రంగులను ఎంచుకుని అంతే సింపుల్‌గా బ్లౌజ్ ఉండేలా చూసుకుంటే చాలు. ఆకుపచ్చ చీరకు చెక్స్ అంచుతో క్రింది భాగాన చక్కటి డిజైన్‌తో వెలిగిపోయేలా ఉంది. పసుపు రంగు చీరకు సైతం పైట అంచుకు సింపుల్‌గా డిజైన్ చేశారు. చీర మొత్తం గ్రే, తెలుపు, నలుపు రంగులతో డిజైన్ చేశారు. మెరూన్ కలర్‌కు బంగారు వర్ణంతో పాటు, నల్లటి బోర్డర్ ఇవ్వటంతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. చిన్న చిన్న పూలు పరుచుకున్న డిజైన్లు , పెద్ద అంచు వంటివన్నీ కూడా అందాల్ని రెంట్టింపు చేస్తాయి.

హాయి గొలిపే రంగులు.. చిన్న, వెడల్పాటి అంచుల్లో జరీ చేసే జిలుగులు వేడుకలో ప్రత్యేకతను చాటడానికి సిద్ధం అంటున్నాయి. మెహందీ ఫంక్షన్ మొదలుకుని పెళ్లిళ్ల సీజన్‌లోనూ వీటిని హాయిగా ధరించవచ్చు.

తుస్సార్ మైసూర్ సిల్క్ చీర అందమైన డిజైన్‌లో కనువిందు చేస్తుందో చూడండి. బంగారు వన్నెలోబోర్డర్‌తో పైట అంచు అంతా గీతల డిజైన్‌లో హుందాతనాన్ని కలిగిస్తోంది.

ఆర్ట్ సిల్క్ చీరలు బ్లౌజ్‌తో కనువిందుచేస్తుంటాయి. సింథటిక్ జార్జెట్ ప్రింటెడ్ చీర లైట్‌వెయిట్‌తో పాడు అందంగా డిజైన్ చేయటంతో సరి కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నాయి.



అధిగమిద్దాం విటమిన్ల లోపాన్ని..

మునుపు హాయిగా బోలెడంత నెయ్యి వేసుకుని ముద్దపప్పు, సున్నిండలు తినేవాళ్ళు. ఆవకాయ, గోంగూర లాగించేవాళ్ళు. అలాగే అరటి, జామ, బొప్పాయి పళ్ళు పేదవాడికి సైతం దొరికేవి. పచ్చిదుంపలు, కాయలు, చీప్ అంటూ చీపుగా భావించకుండా ఓపిగ్గా వలిచి వండిపెట్టే ములగ, తోటకూర, మెంతి లాంటి ఆకుకూరలు తిని, పొద్దున్న సాయంత్రం వీధి వాకిలి చిమ్మే సమయంలో పడే ఎండతో డి విటమిన్ రావడమే కాక జిమ్ములు, యోగాలతో పనిలేకుండా వ్యాయామం అయ్యి విటమిన్లు వంటబట్టేవి. తిన్న పదార్థాల్లో కొవ్వు కరిగి స్లిమ్ముగానూ బాడీ వుండేది.

- బట్టలు వాషింగ్ మెషిన్ ఉతికినా ఆరవేయడం, మడతపెట్టడం కూడా పనిమనిషితో చేయించకుండా మీరే చేసేస్తే చేతులకు మంచిది. అన్నింటికి మిక్సీ మీదే ఆధారపడకుండా చిన్న మీడియం సైజు రోలు తెచ్చుకుంటే మిక్సీకి అందని తక్కువ మోతాదున్నవి దంచుకోవటం, రోటి పచ్చళ్ళు కచ్చాపచ్చాగా చేసుకుంటే కొంచెం సరదా, అదే అమ్మ చేతి పాత రుచి సొంతమవుతుంది. చేతులు భుజాలు గట్టిపడతాయి.


- టీవీ చూస్తూనో ఫోన్ మాట్లాడుతూనో ఊరికే ఉండకుండా ఏదో ఒక ఆకుకూర వలుచుకోవటం పనిగా పెట్టుకోండి. విసుగనిపించదు. ఎండిపోయిన కొత్తిమీర కరివేపాకులను పుదీనా పడవేయకుండా పొడి చేసుకుంటే గ్రీన్ చట్నీలో వాడుకోవచ్చు. అదేవిధంగా బీరకాయ పొట్టు, నిమ్మ తొక్కల్లాంటివి కడిగి శుభ్రంగా ఎండబెట్టి పొడి చేసుకుంటే కూరల్లో అవసరాన్ని బట్టి వాడుకోవచ్చు.

- వంట చేస్తున్నపుడు బెల్లం, ఖర్జూరం లేదా నట్స్ అవైలబుల్‌గా పెట్టుకుని ఏది తినాలనిపిస్తే అది నోట్లో వేసుకుని తింటూ నిలబడి వండే సమయంలో కాళ్ళు ఒకటి తరువాత ఒకటి జాగింగ్ చేస్తున్నట్లు ఉన్నచోటే చేస్తుంటే నడుము, తొడల్లో ఎక్సెస్ కొవ్వు పేరుకోదు. దోస, చపాతీలు నాన్‌స్టిక్‌లో కాకుండా ఐరన్ తవాల్లో చేసుకుంటే క్యాన్సర్లురావు సరికదా ఐరన్ లోపం రాదు.

- గంటకోసారి గ్లాసుడు నీళ్ళు త్రాగటం మరవకుండా వీలైతే మధ్యలో ఒకసారి నిమ్మరసమో, పల్చటి మజ్జిగో ఏదైనా జ్యూసో తీసుకోగలిగితే కావాల్సినంత సి విటమిన్ లభిస్తుంది.

- సాయంత్రం శ్రమనుకోకుండా చాటింగ్ కాసేపు ఆపేసి రిలాక్స్‌డ్‌గా పూజ గదిలోకెళ్లి పూలు, పళ్లు ఉన్నా, లేకపోతే కనీసం కుందిలో దీపం వెలిగించి అగరొత్తులు ధూపం సమర్పించి కళ్ళు మూసుకుని పది నిమిషాలు కూర్చుని వస్తే సపరేటుగా ధ్యానం అవసరం లేదు. దీపం అగరొత్తులు కర్పూర పరిమళాలే అరోమా థెరపిలాగా పనిచేసి మనసుకు ఆహ్లాదాన్నిచ్చి టెన్షన్స్, డిప్రెషన్స్ నుంచి దూరం చేస్తాయి.

-దేగల అనితాసూరి



ఇది మన కళాశాల భారతం

ఇచ్చట పిచ్చుకలు కూడా విచ్చుకత్తుల తళతళలతో
విజృంభించి విప్లవ కవాతులు చేస్తాయి
ముచ్చటైన సాహితీ సమర్పణతో నిలువెత్తు నిలిచిన
మల్లెల పొదలు ప్రసూనమాలలై వర్షిస్తాయి
పారాణితో అందగించిన అడుగులు 'తకత్తై' యంటూ
భరతనాట్యంతో మారాణిగా నర్తిస్తాయి
రచనా పాటవంలో, వచన కవితా దీటుదనంలో
వాక్చాతుర్యపు అమృతాలు చిలుకరిస్తాయి
సేవా, చేవా మా రెండు కరమలూ మా తలుపు తట్టే
విద్యా ఉద్యోగాల సంస్థలకు వశీకరములు
ఇక్కడ మృదు నైపుణ్యాలు మాత్రమే నేర్పరి
హృదయంతో ఆలోచించి చేసే పుణ్యాలు నేర్పుతాం
ఇచ్చట మస్తు మస్తుగా విద్యామొలకలు పరిమళిస్తాయి
హస్తినకు నడచిన చిచ్చర పిడుగులు
చిచ్చుబుడ్లుగా వెన్నెలలు పూయిస్తాయి
ప్రతి విజయం మా వీపుపై 'కంచా'నే భాయి!
మాకు రికార్డులను, అవార్డులను తిరగరాయడమే హాయి!
మా గుప్పిటలో గెలుపుకే చోటుంటుంది
అకుంఠిత దీక్షా, దక్షతలతో మా పాటుంటుంది
నిప్పురవ్వ కూడా నింగిలో జ్వలిస్తూ దూసుకుపోతుంది
ముప్పిరిగొప్ప ఆలోచనా పరంపర ముందుకు తీసుకుపోతుంది
అందుకే మా యువతకు నీరాజనాలిస్తా
రేపటి జనాలకు మేలు చేసే ప్రభంజనాన్ని సృష్టిస్తా!

-బి.హెచ్.వి.రమాదేవి

వికసించేదెప్పుడు..?

'మొగ్గ'లోనే చిదిమేస్తున్నారు...! ★ బాల్యానికి బంధాలు .. బాల్య వివాహాలు




ప్రధాన కారణం దారిద్ర్య రేఖకు దిగువన ఉండటం, తల్లిదండ్రుల నిరక్షరాస్యత, పేదరికం కారణం. చిన్న వయసులోనే గర్భస్రావాలు జరగడం, చనిపోయిన శిశువులు జన్మించడం లేదా జన్మించగానే శిశువులు మరణించే అవకాశం ఉంది. బాలికల బాల్యవివాహాలవల్ల వారి ఆరోగ్యం దెబ్బతినడమేకాకుండా, మానసికంగా కృంగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతేగాక పేద తల్లిదండ్రులకు వరకట్నం భయం అనేది మరో కారణం. అందుకే బాలికల విద్యకు అధికంగా ప్రోత్సాహాలు ఇవ్వడం ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు మెరుగ్గా అమలు చేస్తే పేద తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను చదువులందు ప్రోత్సహిస్తారు.

హర్యానా రాష్ట్రం 1994లో ప్రారంభించిన అప్నాబేటీ, అప్నాధన్ కార్యక్రమం విజయవంతమైంది. 15 నుంచి 18 సంవత్సరాలమధ్య వివాహితులైన బాలికల్లో గర్భస్థ సంబంధిత మరణాలు 20 నుంచి 24 సంవత్సరాలలోపువారికన్నా రెట్టింపు ఉన్నాయన్నారు. 15 సంవత్సరాలలోపు వారిలో ఇది శిశు జనన సమయంలో మాతా మరణాలు ఐదింతలు అధికంగా ఉన్నాయి. రాష్ట్రంలో గత మూడేళ్ళలో 13 ఏళ్ల నుంచి 16 ఏళ్ల మధ్య వయసుల్లో అమ్మాయిల్లో 19.4 శాతం మందికి, అబ్బాయిల్లో 4.3 శాతంమందికి బాల్య వివాహాలు జరిగినట్టు తేలింది. బాల్య వివాహాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మొదటి స్థానం (26.2 శాతం), నల్లగొండ (21.6 శాతం), రంగారెడ్డి (21.1 శాతం), ఖమ్మం, మెదక్ (21 శాతాలు), వరంగల్ (18 శాతం), ఆదిలాబాద్ (17.8 శాతం) నిజామాబాద్ (16.9 శాతం), కరీంనగర్ (14.2 శాతం) జిల్లాలు ఉన్నట్లు ఎం.వి.ఫౌండేషన్ సర్వేలో వెల్లడైంది.

వేధింపులు అధికం

బాల్య వివాహాలు జరిగిన అమ్మాయిల్లో 62 శాతంమంది తొలి కాన్పులో ఆడపిల్ల జన్మిస్తే 74 శాతంమంది అత్తమామల అసంతృప్తి, వేధింపులను ఎదుర్కోవలసి వస్తుంది. ప్రసవించగా నాలుగైదు నెలలు కాకుండానే కూలీ పనులకు పంపిస్తున్నారు. బాల్య వివాహాలు జరిగిన బాలికల్లో 67 శాతంమంది తమ సమస్యలను భర్తలకు చెప్పుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. 85 శాతం బాధిత మైనర్లు పుట్టింటికి వెళ్లడానికి కూడా సరిగ్గా అవకాశం ఉండడంలేదు.



21వ శతాబ్దంలోనూ ఇంకనూ బాల్యవివాహాల సంస్కృతి యథేచ్ఛగా కొనసాగడం విచారకరం. రాష్ట్రంలో 4 లక్షలమంది 15 నుంచి 19 సంవత్సరాల లోపు వివాహమైనవారు ఉన్నారు. స్వచ్ఛంద సంస్థలు బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నప్పటికీ పెద్దలు జోక్యం చేసుకుని బాల్య వివాహ నిరోధక చట్టం అమలుకాకుండా అడ్డుపడుతున్నారు. బాల్య వివాహాలు జరిగినవారిలో అత్యధికంగా వెనుకబడిన తరగతులవారే. బాల్య వివాహాల్లో 43 శాతం బిసి కులాలకు చెందినవారు కాగా, 36 శాతం షెడ్యూల్డు కులాలు, 15 శాతం గిరిజన తెగలకు చెందిన వారున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. పిల్లలకు ఇష్టం లేకపోయినా తల్లిదండ్రులు, బంధువులు, ఒత్తిడి చేసి బలవంతంగా పెళ్లి పీటలమీద కూర్చోబెడుతున్నారు. దేశవ్యాప్తంగా గత మూడేళ్లలో 1.5 కోట్లమందికి బాల్య వివాహాలు జరుగగా- అందులో తెలంగాణలో నాలుగు లక్షలమంది ఉన్నట్లు ఎం.వి. ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ సర్వేలో వెల్లడైంది.

చట్టాలున్నా ఉపయోగపడని వైనం..

బాల్య వివాహాల నియంత్రణకు 2006లో కఠిన చట్టం తీసుకువచ్చారు. కానీ బాల్య వివాహాలు మాత్రం పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌లోనే 8 కోట్ల అమ్మాయిలకు 18 సంవత్సరాలు పూర్తికాకుండానే పెళ్లిల్లు జరుగుతున్నాయి. అందుకే బాల్య వివాహాలు వద్దని ప్రచారం చేద్దాం- చదువుకు ప్రాధాన్యతనిద్దాం.

-కె.రామ్మోహన్‌రావు

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచు బోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి శనివారం, 10 ఫిబ్రవరి 2018

తెలుగుతల్లి తాటంకాలు.. సామెతలు!

తెలుగుభాషకు సొబగులు అద్దేవి సామెతలు. సామెతలు జీవనసారమంతా ఒక్కమాటలో చెప్పాలంటే అనువైన పదం కేవలం సామెతనే. సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు ఉండదంటారు. సామెతలు జీవితసారానికి దర్పణాలు. సామెతలు సేకరించడం భద్రపర్చడం నేటి తరం వారి బాధ్యతగా తీసుకోవాల్సి ఉంటుంది. నాటి తెలుగువారి జీవనయానాన్ని భవిష్యత్తరాలకు చూపించాలంటే చిత్రం, గిత్రం లాంటివి ఏమీ లేకున్నా కేవలం ఒక్క వాక్యంతో కళ్లముందు కదలాడేటట్టుచేయగలిగేది సామెత ఒక్కటే. ఉదా. మోసం చేయడం అంటే ఇపుడు అందరికీ కుడిచేతివాటమే అనుకోండి. కాని ఆనాడు మోసం చేయడంలో ఆరితేరిన దిట్టలు కేవలం కంసాలివారేనట అందుకే ఆయన బర్రెనమ్మినా అందులో కూడా కల్తీచేయగల ధీశాలి అని చెప్పడానికి ఎంత చక్కని సామెతను అల్లారో! **కంసాలి బర్రెనమ్ముతున్నాడు. లోపల లక్క వుందేమో చూడరా అన్నట్లు..** అట్లాంటిదే 'కట్టని నోరు కట్టలేని నదీ ప్రమాదకరం... కాలు జారినా తీసుకోవచ్చు కాని మాట జారితే తీసుకోలేమన్నట్లుగా మాట పెదవి దాటి వచ్చినతర్వాత అది ఎదుటివారికి మంచినో చెడునో చేసేస్తుంది. అందుకే కట్టులేకుండా మాట్లాడితే కొంపలంటుకొంటాయి. మాట్లాడేముందు కాస్త ఆలోచించి మాట్లాడమని చెప్పడానికి ఈ సామెత వాడుతారు.

ఇట్లాంటి సామెతలు నేటి తరానికి తెలిస్తే మన తెలుగుభాష నాలుగు కాలాల పాటు బతికి ఉంటుంది.





వ్యూహం

40

అలపర్తి రామకృష్ణ



''ఆ షెల్ఫ్‌లో వున్నవన్ని జిరాక్స్ కాపీలని, వాటి ఒరిజనల్స్ స్కంద దగ్గర ఉన్నాయని వీడికి తెలియదు.. వీడే వేస్ట్‌ఫెలో! వాడి డౌన్‌ఫాల్ స్టార్ట్ అయ్యింది! అనుకున్నాడు. తనలో తానే నవ్వుకున్నాడు కాశి.

''ఎందుకు నవ్వు మొహం పెట్టావ్? ఏం ఘనకార్యం సాధించావని.. వెళ్లి డాక్టర్ లోహితను పిల్చుకునిరా! ఆ అమ్మాయిని వాళ్ళు దగ్గర పెట్టుకుని పని చెయ్యమని చెప్పాలి! ఆ ఆరిఫ్ మెంటల్ ఫెలో! వాడికి కోపం వస్తే పిట్టను కాల్చినట్టు కాల్చిపారేస్తాడు.. చిన్న ఈక కూడా మిగలనివ్వడదు'' అన్నాడు అరవింద్.

ఛాంబర్‌నుండి బయటకు వచ్చేశాడు!

ఏదో మాస్టర్ ప్లాన్ కాశి మెదడు పొరల్లో మెదులుతూ ఉంది. ఆ ప్లాన్ సక్సెస్‌ఫుల్ అయితే తనంత అదృష్టవంతుడు ఉండడు ప్రపంచంలో. డాక్టర్ అరవింద్ పెద్ద గుణపాఠం నేర్పాలి!

తన పేరు గుర్తుకు వస్తేనే అతనికి చెమటలు పట్టాలి!

జీవితకాలం అతను చింతిస్తూ బ్రతకాలి!

డాక్టర్ లోహిత తనకు సహకరిస్తుంది.

జీవితాంతం తనకు తోడుగా వుంటుంది తన ప్లాన్ ఆమెకు వివరంగా చెబితే! ఎంతో సంతోషపడుతుంది.. 'జీనియస్' అని తనను మెచ్చుకుంటుంది!

తనలో తాను నవ్వుకున్నాడు కాశి.

❊❊❊

డాక్టర్ లోహితతోపాటు డాక్టర్ అరవింద్ ఛాంబర్‌లోకి వచ్చేడు కాశి.

''నువ్వెందుకు లోపల? బయటకు వెళ్ళు! మేం మాట్లాడుకునే మెడికల్ విషయాలు నీకేం అర్థం అవుతాయి.. యుకెన్ గో నౌ'' అన్నాడు అరవింద్ కాశితో.

ఒళ్ళు మండిపోయింది కాశికి. ఎన్నో సంవత్సరాలుగా డాక్టర్లతో, హాస్పిటల్స్‌తో అనుబంధం ఏర్పరచుకుని తిరుగుతూ వున్నాడు. ఆ మాత్రం తెలియదా? ప్రెగ్నెన్సీ, చైల్డ్‌బర్త్‌కు సంబందించి బ్రాంచ్ ఆఫ్ మెడిసిన్ 'అబ్‌స్టెట్రిక్స్'. ఆడపిల్లలు, స్ర్తీలకు జననాంగాల దగ్గర వచ్చే వ్యాధులు, ఫిజియోలాజకల్ ఫంక్షన్స్ తెలిపే బ్రాంచ్ ఆఫ్ మెడిసిన్ 'గైనకాలజీ..' ఆ మాత్రం తెలియదా తనకు?

అవసరాలకు తనను వాడుకుంటాడు, ఆ తరువాత పురుగును తీసేసినట్లు నలుగురి ముందు విదిల్చినట్లు మాట్లాడుతాడు.. ఉత్త శాడిస్టు!

కాశి మనసులోనే అరవింద్‌ను తిట్టుకుంటూ బయటకు వెళ్ళాడు.

డాక్టర్ అరవింద్ దృష్టి లోహిత మీద పడింది. ''నీకు ఎన్నోసార్లు చెప్పాను. నీ లిమిట్స్‌లో నువ్వు ఉండమని.. నీ పరిధి దాటి నీకు సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకుంటున్నావ్.. పోలీసు ఆఫీసర్‌తో పరిచయం పెంచుకుంటున్నావ్.. మేం వద్దని చెప్పినా! డాక్టర్లకు పోలీసు అధికార్లతో సాన్నిహిత్యం అవసరమా? నీవే ఆలోచించుకో!

మన హాస్పిటల్‌కు ఎంతోమంది స్ర్తీలు, ఆడపిల్లలు వస్తూ వుంటారు.. గైనకాలజీ ప్రాబ్లమ్స్ ఎందుకు వస్తున్నాయో వాళ్ళకు వివరించి చెప్పాలి! నేను ఇంత పెద్ద హాస్పిటల్‌కు హెడ్‌ను అయ్యానంటే ఊరికే ఎవరి రికమెంటేషన్‌తో కాలేదు.. నా స్వయంకృషితో అయ్యాను. కిడ్నీ ఆపరేషన్స్ అవలలీగా చేసేస్తాను... సర్జరీ అంటే ఇష్టంనాకు.. కానీ అన్ని బ్రాంచీలలో నాలెడ్జి గేదర్ చెయ్యడానికి ఇష్టపడతాను.. చాలామంది ఆడవాళ్ళు ట్యూబెక్టమీ ఆపరేషన్స్ చేయించుకుంటున్నారు.. ఆపరేషన్స్ అయ్యేక చాలా కేసుల్లో గైనిక్ కంప్లైంట్స్ వస్తున్నాయి.. కొన్ని మెడికల్ కాన్ఫరెన్స్‌లో ఆ విషయం గూర్చి మాట్లాడేను.. ట్యూబ్‌లిగేషన్ ఆపరేషన్స్ తరువాత పెల్విక్ పెయిన్, వైట్ డిశ్చార్జి మెన్‌స్ట్రల్ ఇరెగ్యులారిటీ వస్తున్నాయి కొన్ని కేసుల్లో... ''యాన్ ఇనసైట్ ఇన్ టు కాంప్లికేషన్స్ ఆఫ్ ట్యూబ్ లిగేషన్ ఆపరేషన్స్ ఇన్ ఫిమేల్స్'' అనే వ్యాసం నేను రాసింది ఇంటర్నేషనల్ మెడికల్ మ్యాగజైన్స్‌లో ప్రచురింపబడింది.

ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే నీకు ప్రొఫెషన్ పట్ల ఆరాధన ఉండాలి... బాగా లైమ్‌లైట్ లోకి వచ్చేంతవరకు మిగతా విషయాలు పట్టించుకోకూడదు.

అరిఫ్‌కు నీమీద కోపం వచ్చింది.

''.... నిన్ను బెదిరించి కంట్రోల్లో పెట్టుకోవడానికి నీ చెల్లెలు మీద అఘాయిత్యం చెయ్యడానికి మనిషిని పంపించాడు, మీ నాన్న చెయ్యి నరికివేశారు. వాళ్ళు ఏదైనా చేస్తారు.. మేం చెప్పినట్లు వింటూ పదేళ్ళు కష్టపడ్డావంటే పది పైసల వాటా దక్కుతుంది! సముద్రంలో ఆనందంగా పయనిచే నౌకను నువ్వే నీళ్ళలో ముంచెయ్యకు! ఇంత వివరంగా ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో! నీమీద నాకు సాఫ్ట్ కార్నర్ వుంది.. కన్నకూతురి లాంటిదానివి.. బిహేవ్ ప్రాపర్లీ అండ్ గెట్ రిచ్ డివిడెంట్స్!'' అని చెప్పుకుపోయాడు డాక్టర్ అరవింద్.

ఇంకాఉంది

సర్వరోగనివారిణి సంగీత విభావరి



సప్తస్వరాల సంగీత సమ్మేళనంలో ఎన్నో వేలాది కృతులను రచించిన త్యాగయ్య, రామదాసు, ముత్తుస్వామి దీక్షితార్, పురందరదాసు, స్వాతి తిరునాళ్ వంటి మహానుభావులను స్మరించుకుంటూ ప్రతినిత్యం ఉభయ సంధ్యా సమయంలో సంగీత సాధన పూర్వజన్మ సుకృతం, భగవంతుని వరం అని సంగీత విద్వాంసురాలు కావూరి హేమలక్ష్మి అన్నారు. శాస్ర్తీయ సంగీత గాత్రంలోను, వీణ వాయిద్యంలోను తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్న హేమలక్ష్మి ఆంధ్రభూమితో తన అనుభవాలను పంచుకుంది. చిరుప్రాయంలోనే సంగీత శిక్షణ ప్రారంభించి తొలుత గాత్రం తరువాత వీణా వాయిద్యంలోను శిక్షణ పొందారు. తన స్నేహితులు పద్మాచక్రవర్తి, నాగలక్ష్మిలతో కలిసి వీణత్రయంగా కచేరీలు చేస్తూ అశేష ప్రజల ఆదరాభిమానాలు పొందారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధిలో తమ వీణా గానంతో కనుల ముందు పార్వతీ పరమేశ్వరుల సాక్షాత్కారం లభించినంత గొప్పగా కచేరీ చేశామని చెప్పారు. 2013లో సింహపురి సాహిత్య సంగీత సభ వారిచే 'జీవిత సాఫల్య పురస్కారం', జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ వారిచే 'ఔట్‌స్టాండింగ్ ఫెర్‌ఫార్మెన్స్' అవార్డు అందుకున్నానని తెలిపారు. ఈ పురస్కారాలు తమ బాధ్యతను పెంచాయని తెలిపారు. స్ర్తీలు కళల్లో శిక్షణ తీసుకుని ఉన్నత శిఖరాలు అందుకోవాలంటే చిన్నతనంలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు వివాహమైన తరువాత భర్త ప్రోత్సాహం లభించాలని, ఈ విషయంలో తాను చాలా అదృష్టవంతురాలనని చెప్పారు. సాయంత్రం సమయంలో భర్త ఆఫీసు నుండి వచ్చే సమయంలో తాను శిష్యులతో సంగీత సాధన చెయ్యడం చూసి తన భర్త మాతోపాటు కూర్చొని సంగీతాన్ని ఆస్వాదించడం తనకెంతో ఆనందాన్ని సంతృప్తిని కలిగిస్తుందని హేమలక్ష్మి చెప్పారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ద్వారా ఎం.ఏ (సంగీతం)లో బంగారు పతకాన్ని సాధించానని, ఈ గొప్పతనం తన భర్త కావూరి వెంకట సత్యనారాయణమూర్తికే దక్కుతుందని ఆమె అన్నారు. 1995లో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో సంగీత ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించి 12 సం.లు ఉద్యోగ బాధ్యతలు తను నిర్వహించి సంగీత సాధనకు సమయం వీలు దొరకనందున ఆ ఉద్యోగానికి రాజీనామా చేశానని హేమలక్ష్మి చెప్పారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో బెజవాడ కనకదుర్గ, శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి సన్నిధిలో తదితర కళావేదికలపై ఎన్నో వేలాది ప్రదర్శనలు ఇచ్చానని, సంగీత కళా ప్రదర్శనలలో సంతృప్తి, దైవం అనుగ్రహం లభించింది కనుకనే తాను ఇంకా సంగీత సాధన చేస్తూ కొత్త పోకడలకు శ్రీకారం చుడుతున్నానని హేమలక్ష్మి చెప్పారు. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా విదేశాలలో వుండే సంగీతాభిమానులకు శిక్షణ ఇస్తున్నానని, ఎంతోమంది విద్యార్థులకు సంగీత శిక్షణతో పాటు ప్రదర్శనలు కూడా ఇప్పించానని చెప్పారు. తన ప్రదర్శనలతో గవర్నర్, ముఖ్యమంత్రి, గతంలో కేంద్ర మంత్రిగా వున్న వెంకయ్య నాయుడు, సినీ గాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం చేతులమీదుగా సన్మానం, అవార్డు అందుకున్నానని హేమలక్ష్మి సంతోషంగా చెప్పారు. సంగీతం పరమ ఔషధం అనీ, సంగీతంతో మూర్ఖునికి జ్ఞానోదయం కలిగించవచ్చునని, పామరుడిని కూడా విద్వాంసునిగా మార్చవచ్చునని నమ్మిన తాను విజయవాణి సంగీత విద్యాలయం స్థాపించి ఎంతోమందికి సంగీతాన్ని నేర్పిస్తున్నానని చెప్పారు.

- మురళీధర్

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండుటచే మానసికానందాన్ని పొందుతారు. వృత్తి ఉద్యోగ రంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. నిన్నటివరకు వాయిదా వేయబడిన కొన్ని పనులు ఈ రోజు పూర్తిచేసుకోగలుగుతారు. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముంటుంది. ఇతురులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
ఆకస్మిక ధనలాభయోగముంటుంది. కుటుంబంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలుంటాయి. అంతటా అనుకూల వాతావరణమేర్పడుతుంది. స్ర్తీలు సౌభాగ్యాన్ని పొందుతారు. బంధు, మిత్రులు కలుస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
అనారోగ్యమేర్పడుతుంది. పిల్లలపట్ల ఎక్కువ పట్టుదలతో నుండుట అంత మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. మనోద్వేగానికి గురి అవుతారు. కోపాన్ని తగ్గించుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం. క్రొత్త పనులు ప్రారంభించరాదు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. స్ర్తీల మూలకంగా శతృబాధలనుభవిస్తారు. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురిచేస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి పట్టుదల పనికిరాదు. పగ సాధించు ప్రయత్నాన్ని వదిలివేయడం మంచిది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. శుభవార్తలు వింటారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు. క్రొత్త కార్యలకు చక్కని రూపకల్పన చేస్తారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ఆకస్మిక ధనలాభ యోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రులతో కలుస్తారు. క్రీడాకారులు, రాజకీయ రంగాల్లో వారు ఉత్సాహంగా ఉంటారు. స్ర్తీలు సంతోషంగా కాలక్షేపం చేస్తారు. కొత్తపనులు ప్రణాళికాబద్ధంగా ప్రారంభిస్తారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
అన్ని కార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శత్రుబాధలుండవు. శుభవార్తలు వింటారు. గౌరవ మర్యాదలు అధికమవుతాయి. అద్భుత శక్తి సామర్థ్యాలను పొందగలుగుతారు. కుటుంబంలో అభివృద్ధితోపాటు ఆకస్మిక ధన లాభముంటుంది.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఆరోగ్యం గూర్చి జాగ్రత్తపడుట మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. కుటుంబ కలహాలకు దూరంగా వుంటే మేలు. సహనం అన్ని విధాలా శ్రేయస్కరం. డబ్బును పొదుపుగా వాడతారు. సుబ్రహ్మణ్యస్వామి అర్చనాదులు చేయడం వల్ల అనుకొన్న పనులు నెరవేర్చుకుంటారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
క్రొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. ప్రతి విషయంలో వ్యయ ప్రయాసలు తప్పవు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. వృత్తిరీత్యా క్రొత్త సమస్యలనెదుర్కొంటారు. బంధు, మిత్రులతో కలహాలేర్పకుండా జాగ్రత్తపడుట మంచిది.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
పిల్లలవల్ల ఇబ్బందులెదుర్కొంటారు. అధికారులతో గౌరవింపబడతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. అనారోగ్య బాధలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. నూతన వ్యక్తులు పరిచయమవుతారు.

నేర్చుకుందాం — నరసింహ శతకం

సీ. నరసింహ! నిన్నునే నమ్మినందుకు చాల
నెనరు నాయందుంచు నెమ్మనమున
న్ని వస్తువులు నిన్నడిగివేసట పుట్టె
నిఁకనైన ననుఁ గటాక్షింపవయ్య
సంతసంబున నన్ను స్వర్గమందే యుంచు
భూమియందే యుంచు భోగి శయన!
నయముగా వైకుంఠ నగరమందే యుంచు
నరకమందే యుంచు నళిన నాభ!
తే. ఎచట నన్నుంచినను గాని యెపుడు నిన్ను
మఱచి పోకుండ నీ నామస్మరణ నొసఁగు
భూషణ వికాస ! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం:నరసింహస్వామీ! నిన్ను నేను నమ్మినాను. నాపై దయ యుంచు. ఇంతదాక పదార్థాలకై నిన్ను వేడి వేడి విసుగు పుట్టింది. ఇకనైనా నన్నుగ్రహించు. నన్ను స్వర్గములో నుంచినా, భూమిలోనే ఉంచినా విచారమేమీ లేదు. వైకుంఠంలో గాని, నరకంలో గాని. ఉంచు ఎక్కడ ఉంచినా ఫరవా లేదు. కాని నీ నామ జపాన్ని మరచి పోకుండా ప్రసాదించు.

ఆశ ఖరీదు అణా



గోరాశాస్త్రి గారి రేడియో నాటిక



ఇం: అలాగే వుంది. ఆయాసం పొద్దున్నకంటే ఎక్కువైంది.
కృ: అయ్యో పాపం! లక్ష్మేదీ?
ఇం: అమ్మ గదిలో ఉంది. పిలవనా?
లక్ష్మి: (ప్రవేశిస్తూ) ఏం కృష్ణవేణీ! ఇంకా నిద్రపోలేదేం? పగలల్లా ఆఫీసులో కష్టపడి మళ్లీ సాయంత్రం అందరికీ వండి వార్చి-
కృ: ఏవుందీ మామూలు గొడవే! రాను రాను బతుకంటే అసహ్యం వేస్తోంది.
లక్ష్మి: కొత్తగా ఇప్పుడేం వచ్చింది? అన్నయ్య పురాణమేనా?
కృ: అదే. వాడు సరిగ్గా రెండువందల యేళ్ళ క్రితం పుట్టవలసినవాడు. ఆ పొరపాటుకి శిక్ష అనుభవిస్తున్నది నేను. అమ్మ సరేరి. తన పక్షవాతం జబ్బు తలుచుకుని మురిసిపోతూ మంచంమీద ఉంటుంది. మరో ప్రపంచ యుద్ధం వస్తేగాని అన్నయ్యకి ఉద్యోగం దొరికేటట్టు లేదు. అంచేత వాడికెందుకో నామీద కసి. నా జీతం అంటే మళ్లీ అభిమానమే.
ఇం: ఊరుకుందూ- వింటాడేమో!
కృ: లేదులే, పెట్టవలసిన శాపాలన్నీ పెట్టేసి ఇప్పుడే నిద్రపోయాడు. మళ్లీ పొద్దున్న కాఫీవేళకిగాని లేవడు.
లక్ష్మి: దేనిమీదొచ్చినదీ రభస?
కృ: ఆ మేడ గదిలో ఎవరో ఆయన కొత్తగా దిగలేదూ? ఆయన ప్రసంగం తీసుకొచ్చేసరికి వచ్చింది దుమారం. వాడి గొడవ నాకెందుకంటాడు. అని మళ్లీ మా పురాణం అంతా ఏకరువు పెట్టి తను సంసారాన్ని పోషించగలిగిన ఉత్తరక్షణం నన్ను ఉద్యోగం మానిపించేస్తానంటాడు.
ఇం: పోనీ, అప్పటి సంగతి అప్పుడే చూసుకుందాం అనలేకపోయావా?
కృ: (కోపంగా) అంటానంటాడు. అనను మరీ! ఆడవాళ్లకి సహగమనం మాన్పించారే అని విచారించే మనిషి వాడు.. (కంఠం మార్చి).. అంతే ఇందిరా.. మనం ఎంత అభిమానంగా చేతులు చాస్తామో అంత స్వార్థంగా వెనక్కు నెట్టేస్తారంతా.
లక్ష్మి: ఎప్పుడూ ఇలాంటి విషయాలు లెక్కచేయకుండా నిబ్బరంగా తరిగేదానివి కదా, ఇవాళేం ఇంత బాధపడిపోతున్నావు?
ఇం: కృష్ణవేణికి ముసలితనం వచ్చేసింది.
కృ: ఎంతకాలమని పోట్లాడుకురాను చెప్పు లక్ష్మీ! ఏనాటికైనా వాళ్ళునన్ను అర్థం చేసుకోకపోతారా అన్న ఆశతో యిన్నాళ్ళూ నెట్టుకొచ్చానురు, అవస్థలు పడుతూనే. కాని ఇందాకటితో వెన్నెిక విరిగిపోయింది.
ఇం:అన్నీ మరిచిపోయి హాయిగా నిద్రపోదూ! తెల్లారేసరికి మళ్లీహాయిగా వుంటావు.
కృ: ఆశ పూర్తిగా పోయింది. వీళ్ళు నాకేమేనా అదృష్టం వుంటే దాన్ని పెంచుకోనివ్వరు. దురదృష్టాన్ని తుంచుకోనివ్వరు. సగం చచ్చిన నల్లిలా ఇలా బతకమంటారు. పైపెచ్చు కుటుంబం కోసం ఆ మాత్రం త్యాగం చెయ్యలేవా అంటారు. ఎవరి త్యాగం? దేనికి త్యాగం? జల్లెడలో పోసిన నీరులాగా ఆ త్యాగం గాలిలో హరింపోతుందిగాని ఎవరికీ తులమెత్తు లాభం చెయ్యదు.
లక్ష్మి: ఇందిరా! మఅమకి నిద్రపట్టిందా?
ఇం: ఆ, కాస్త కన్నుమూసి నిద్రపోయిది.
కృ: అన్నట్లు మరచిపోయాను. ఏమిటో నా గొడవ నాది. ఎలా వుంది అమ్మగారికి?
ఇం: చెప్పానుగా ఇందాక! అలాగే ఉంది. ఆయాసం కాస్త ఎక్కువైంది.
ల: అన్నయ్యింకా రాలేదు0- ఎంచేతో?
కృ: అదేవిటీ? ఇంత రాత్రయినా రాకపోవడమేమిటీ?
ల: ఏం చెప్పను? వాడి ధోరణి అంతా అదో మారిది. ఇంకా మేమే నయం. వాడు బొత్తిగా పిరికి. అడుగడుగునా మేమే . ధైర్యం చెపుతూ ఉండాలి. నాన్నని తలచుకొని, అన్యాయంగా జైలుకెళ్లిపోయాడే అన ఏడుస్తాడు. అమ్మని తలచుకొని బాధపడతాడు. ఇటు మమ్మల్నిద్దరినీ చూని కన్నీళ్లు కారుస్తాడు. ఎక్కడైనా కాస్త టెంపరరీ ఉద్యోగమైనా దొరుకుతుందేమోనని అలా తిరుగుతున్నాడు.
కృ: పాపం! ఇంతరాత్రయిందికదా, భోజనం లేకండా ఎక్క తిరుగుతున్నాడో?
ఇం: లక్ష్మీ! నేను కాస్త వీధి దాకా వెల్లి చూసి రానా?
లక్ష్మి: చూసిరా! కాస్త బయటి ప్రపంచమేనా కనబడుతుంది. నేనుఅమ్మ దగ్గరుంటాను.
కృ: పద ఇందిరా! నేనూ వస్తాను!
ఇం: మీ అన్నయ్య కోప్పడరూ?

- సశేషం

(ఆకాశవాణి సౌజన్యంతో...)

మాటాట

నిర్వహణ: సుధామ **1560**

1		2		3		
		4	5			6
7						
8				9		
			10			
		11		12		
13			14			

ఆధారాలు

అడ్డం:
1 పిండితో చేసిన జావ
3. స్త్రీ
4. కిల్లీకి గుచ్చి ఇచ్చేది
8. మన్మథుడు
9. అటుగా భగవంతుడు
11. అపరిపక్వమగు
13. చుంబనం
14. మరో మార్గం , వేరుగతి

నిలువు:
2. స్వప్నము
3. అపూర్వ వస్తు ప్రాప్తి , ధ్యానము
5. పదిపదులు
6. మన్మథ పత్ని
7. ఉసిరిక
10. బెలూన్
12. ఎల్లవేళలా

మాటాట -1559 సమాధానం

1 గ్రం	థా	2 ల	యం			3 గా
థి		త		4 ఉ	సు	రు
5 క	త్తి		6 చే	ప		డు
		7 నా		జ్ఞ		
8 ఉ		9 టీ	వీ		10 డ	11 మ
12 ప	తా	క		13 గం		రు
ది			14 ఉ	ప	ద్ర	వం

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్



మాఘం మార్కండేయుడు

మృకండ మహర్షి మనస్వినులు శివభక్తులు. అపుత్రవంతులు. ఎన్నో యాగాలు , యజ్ఞాలు చేశారు. కాని పుత్రసంతానం కలుగలేదు. శివుడే ఈపిత్సాలను తీర్చువాడు కామితార్థప్రదాయుడు అనుకొని వారు శివుడ్నే పూజించేవారు. వారికి ఒకసారి శివదర్శనం కలిగింది. శివుడు మీకోరిక ఏమిటి అనిఅడిగినప్పుడు పున్నామ నరకం నుంచి తప్పించగలిగే పుత్రుడు కావాలని కోరారు. శివుడు మీకు పుత్రుడ్నిస్తాను కాని, అల్పాయుష్కుడు అవుతాడు అని చెప్పాడు. శివుడుండదగా మాకు భయంలేదు. శివుడే అన్నింటికీ కారణభూతుడు అని వారు ఆ పుత్రుడ్నే కోరారు. శివాజ్ఞ అయింది. వారికి పుత్రోదయం అయింది. ఆ పుత్రునికే మార్కండేయుడు అని పేరు. ఈ మార్కండేయుడు బాల్యం నుంచే శివభక్తునిగా ఎదిగాడు. ప్రయాగలో పుణ్యస్నానమాచరించి శివుణ్ణి మెప్పించి చిరంజీవి అయ్యాడు. శివా అని నోరారా పిలిస్తే చాలు అపారకృపా వాత్సల్యాన్ని కురిపిస్తాడు శివుడు.



యాజ్ఞసేని

33

త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము

ఆ విల్లును ఎక్కుబెట్టి లాగటం ఒక బలహీనుడికి సాధ్యమౌతుందా? అస్త్రవిద్య నేర్వని వాడికీ, కులహీనుడికీ, ఆ లక్ష్యాన్ని సులభంగా ఛేదించం సాధ్యమయ్యేపనేనా? మీ రాజు కోరిక సఫలమయింది. విచారించడం ఎందుకు?'' అని ధర్మరాజు సమాధానమిచ్చాడు.

ధర్మరాజు మాటలను విన్న పురోహితుడు శెలవుగైకొని వెనుదిరిగి ద్రుపద మహారాజు వద్దకు వచ్చాడు. రాజును చూచి జరిగిన విషయాన్ని విన్నవించాడు.

అంత ద్రుపదుడు దృష్టద్యుమ్నుని చూచి ''రథాలను తీసుకొని వెళ్లి వారిని వెంటనే ఇక్కడికి తోడ్కొని రమ్ము'' అని ఆజ్ఞాపించాడు.

దృష్టద్యుమ్నుడు రాజు చెప్పినట్లుగానే పాండవులను దర్శించాడు.

ధర్మరాజును చూచి ''మా తండ్రి ఆజ్ఞ ప్రకారం మిమ్ములను కొనిపోవ వచ్చాను. ఈ రథాలెక్కి రాజభవనానికి రండి'' అని ప్రార్థించాడు.

ఒక రథంలో కుంతీదేవినీ ద్రౌపదినీ, తక్కిన రథాలలో పాండవులను ఎక్కించి రాజప్రాకారంలోనికి ప్రవేశించాడు దృష్టద్యుమ్నుడు.

రాజాంతఃపురంలో ప్రవేశించిన పాండవులను క్షత్రియులకు తగిన ఉన్నతాసనాలపై ఆసీనులను గావించి ద్రుపదుడు ధర్మరాజుతో-

''అయ్యా! మీరు క్షత్రియులా? బ్రాహ్మణులా? లేక నా పుత్రిక ద్రౌపదిని చేబట్ట దేవలోకం నుండి దిగి వచ్చిన దేవతలా? దయతో తెలియజేసి నా సందేహాన్ని తీర్చండి. మీ నిజస్థితి తెలిసికొనిగానీ నా ఈ కన్యకు వివాహం చేయలేను'' అన్నాడు.

''మేము క్షత్రియులం. పాండురాజు పుత్రులం. నేను పెద్దవాడనైన 'యుధిష్ఠిరుడను'. లోకం కొనియాడే భీమార్జున నకుల సహదేవులు ఈ నలుగురు. ఎక్కడైనా శత్రువులను జయింపగలిగినవారు. ఈమె మా మాతృమూర్తి అయిన 'కుంతీదేవి' అని అన్నాడు ధర్మరాజు ద్రుపదుని సందేహాన్ని నివృత్తిగావిస్తూ.

''నా పుణ్యంవలన మీరు లాక్ష గృహ ప్రమాదం నుండి తప్పించుకున్నారు. నా కోరిక ఈనాటికి నెరవేరింది'' అని ఆనంద బాష్పాలతో నిండిన కళ్ళను తుడుచుకుంటూ ''విచిత్రవీర్యుని మనుమడూ, ధనుర్విద్యలో శ్రేష్ఠుడూ అయిన ఈ అర్జునుడు నా కుమార్తెకు భర్త



అయ్యాడు. నా చిరకాల వాంఛ ఫలించింది. నేటికి యజ్ఞఫలం కూడా లభించింది. అర్జునుడు ధర్మపద్ధతిలో ద్రౌపదిని వివాహం చేసుకుంటాడు'' అని అన్నాడు ద్రుపద మహారాజు.

అందుకు స్పందించిన ధర్మరాజు ''ఈ కన్యను మేమందరం వరుసగా వివాహం చేసుకొంటాము. ఇదే మా తల్లి ఆజ్ఞ. మేము మా తల్లి ఆజ్ఞను దాటలేము'' అని అన్నాడు.

''ఒక్క మగవాడికి పెక్కుమంది భార్యలు వుండవచ్చును. కానీ పెక్కుమంది మగవాళ్ళకు ఒక్క భార్య కావటం ఎక్కడా విని ఎరుగను. నీవు లోక సంబంధమైన, వేద సంబంధమైన స్వరూపం తెలిసినవాడవు. నీ మాట ధర్మవిరుద్ధమనలేము. కాని దీని గురించి మనమంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వద్దాము'' అని అన్నాడు ద్రుపదుడు.

''మహారాజా! మా నియమాన్ని భంగపరచటానికి మేము ఇష్టపడము. కావున మాకందరికినీ ద్రౌపది ధర్మబద్ధంగానే పట్టమహిషి అవుతుంది. అగ్నిసాక్షిగా ఆమె మా అందరితో పాణిగ్రహణం చేస్తుంది'' అని తమ నిర్ణయాన్ని మరొకమారు తెలియపరచాడు ధర్మరాజు.

''యుధిష్ఠిరా! నీవు ధర్మవేత్తవు. పదవిత్రుడవు. లోకవేద విరుద్ధమైన అధర్మాన్ని అంగీకరింపవు. నీ బుద్ధి ఈ విధంగా ఎందుకు మారుచున్నది?'' అని అడిగాడు ద్రుపదుడు.

''రాజా! ధర్మం మిక్కిలి సూక్ష్మమైనది. దాని మార్గాన్ని మనమెరుగలేము. పూర్వీకుల మార్గాన్నే ఈ విషయంలో అనుసరిద్దాం. నా మాట ఎప్పుడూ పొల్లుబోదు. అధర్మంపై నా బుద్ధి ఎప్పుడూ నిలువదు. ఇంక ఆలోచించక అనుసరించుము'' అని అన్నాడు ధర్మరాజు.

నీవూ, కుంతీదేవి, దృష్టద్యుమ్నుడు కలిసి ఆలోచించి కర్తవ్యాన్ని నిర్ణయించండి. ధర్మరాజా! రేపు సరైన సమయంలో దీని గురించి ఆలోచిద్దాము'' అని ద్రుపదుడు నిష్క్రమించాడు.


ఆటు పాండవులూ, ఇటు ద్రౌపదీ దృష్టద్యుమ్నులూ ఈ సంక్లిష్ట సమస్యను గురించి ఆలోచించసాగారు.

ద్రౌపది మనస్సు మరలా పరి పరి విధాలా ఆలోచించసాగింది. మత్స్యయంత్రాన్ని ఒక బ్రాహ్మణుడు పడగొట్టాడు. అతడి మెడలో దండవేశాను. కుమ్మరి యింట్లో ప్రవేశించాను. అక్కడ అయిదుగురను చూచాను. వాసుదేవుడు వచ్చాడు. పాండవులను అభినందించాడు. అప్పుడు తెలిసింది వీరు పాండవులేనని. మత్స్యయంత్రాన్ని ఛేదించినవాడు అర్జునుడని. మనసులో ఆనందించాను మా తండ్రి కోరిక నెరవేరిందని. నేను ఇన్నినాళ్ళు కోరుకున్నది కూడా అదే. ఇప్పుడు ఒక క్రొత్త సమస్య వచ్చింది. నన్నందరూ వివాహం చేసుకుంటారట. ఇది ధర్మబద్ధమేనట. ఇదెక్కడి ధర్మం? ఒక స్త్రీకి ఇంతమంది భర్తలా? దీనికి పరిష్కారమేమిటి? విధాత కల్పించే విచిత్ర ఘటనలు అర్థం చేసుకొనటం అంత సులభం కాదు. దీనిని ఆ కృష్ణవాసుదేవుడు పరిష్కరించాలి.

- ఇంకావుంది

తిలాదానం.. దారిద్ర్యనాశనం

పుణ్యభూమి యైన మన భారతదేశంలో ప్రతితిథీ ప్రతివారమూ మహనీయమైనదే. ఒక్కొక్క తిథిలో ఒక్కొక్క దైవాన్ని పూజించడం సంప్రదాయం. మహావిష్ణువు అత్యంత ప్రీతిదాయకమైన తిథి 'ఏకాదశి'ఈ 'ఏకాదశి' మరీ మహత్తరమైంది. ఆరోజున ఉపవాసం ఉండడం, మహావిష్ణువు పూజించడం లాంటివాటిని ఆచరించిస్తే అటు ఆరోగ్యసంపద ఇటు ఆధ్యాత్మిక సంపద ఒనగూడుతాయి అంటారు. సంవత్సరానికి 24ఏకాదశులున్నా ఒక్కో ఏకాదశి ఒక్కో మహాత్మ్యానికి ప్రత్యేకతను పొందింది. మాఘమాసంలో వచ్చే షట్‌తిలాఏకాదశిని గురించి భవిష్యోత్తర పురాణం వివరిస్తుంది. పూర్వం ఒక బ్రాహ్మణ స్త్రీ సత్‌సంప్రదా



యాలను, ఆచారాలను తప్పకుండా పాటిస్తూ ఉండేది. ఆమె కృష్ణభక్తురాలు. నియమానుసారంగా శ్రీకృష్ణునకు పూజాదికాలు నిర్వహించేది. ఉపవాసాది వ్రతాలు పాటించేది. భక్తులైన వారికి తనకు తోచినంత సాయం చేయాలన్న సంకల్పంతో ఉండేది. తన ఇంటికి ఎవరైనా భక్తులు వస్తేవారికి అన్ని వసతులను కల్పించేది. ఇలా చేయడం కృష్ణుని సేవలో భాగంగా ఆమె తలిచేది. కాని వారికి భోజనం మాత్రం పెట్టేది కాదు. ఇంత భక్తుల సేవ చేసిన ఆమెను మహావిష్ణువు రక్షించదలచి ఒకనాడు ఆమె ఇంటికి భిక్షువులాగా వచ్చాడు. 'అమ్మా ఆకలి అవుతోంది కాస్త ఏమైనా తినడానికి పెట్టు'అని అడిగాడు.

కాని ఆమె నీవు కావాలంటే కాసేపు మా ఇంట విశ్రమించు. సేద తీరింతర్వాత నీవు ఎక్కడికైనా ప్రయాణం చేసి నేను మంచినీరు తప్ప మరేమీ ఇవ్వను అని కరాఖండీగా చెప్పేసింది. అయినా ఆ భిక్షుకుడు మరలా మరలా తినడానికి ఇవ్వమనే అడుగుతున్నాడు. వాని బాధకు తాళలేక ఆమె ఒక మట్టిముద్దను తెచ్చి ఆ భిక్షగానిపాత్రలో వేసింది.

ఆ మహావిష్ణువు అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

కాలం కరిగింది. ఆమె ముదుసలి అయ్యింది. ఒకనాడు కాలం తీరింది. యమసదనానికి వెళ్లింది.

అక్కడనుంచి ఆమె చేసిన పూజలు, వ్రతాలు, భాగవతుల సేవ వల్ల కాలుడు ఆమెకు స్వర్గలోక నివాసం ఏర్పాటు చేసాడు. స్వర్గంలో ఆమెకు ఉన్నతమైన ఇల్లును ఇచ్చారు. అందులో ఆమెను నివసించమని చెప్పారు. ఆమె ఎంతోసంతోషంతో అక్కడికి వెళ్లింది. కాని అక్కడ ఏమీ లేదు. తినడానికి, తాగడానికి ఏదీ కనిపించలేదు. వెంటనే వైకుంఠపతి దగ్గరకు వెళ్లింది. నీకు నేను ఎన్నోపూజలు, వ్రతాలు చేశాను. కాని నాకు ఇట్లాంటి గతి పట్టిందేమి అంటే ఆమె చేసిన పనిని మహావిష్ణువు గుర్తుకు తెప్పించాడు. అపుడు బుద్ధి తెచ్చుకుని ఇకమీద నేను దానధర్మాలు చేస్తానని చెప్పింది. కాని ఈ జన్మలో చేసుకొన్న కర్మఫలాన్ని అనుభవించాలి కదా. అప్పటిదాకా ఈ ఇంటిలో ఉండమని మహావిష్ణువు చెప్పాడు.

నన్ను కరుణించమని వేడుకొంది ఆమె. అపుడు నీ దగ్గరకు దేవతాస్త్రీలు వస్తారు. వారు నిన్ను చూడాలని అంటే నీవు ముందుగా వారి షటాతిలా ఏకాదశి ఫలాన్ని నీకు ఇవ్వమని అడుగు. అప్పుడు నీ పాపఫలం తీరిపోతుంది అని చెప్పాడు. దేవతాస్త్రీలు వచ్చారు. ఆమె మహావిష్ణువు చెప్పినట్లే అడిగింది.వారు వ్రతఫలం ఇచ్చారు. ఆమెకు ఆకలిదప్పులు నశించాయి. అయితే వారిని షట్‌తిలా ఏకాదశి వ్రతాన్ని ఎలా చేయాలో చెప్పమని వారిని అడిగి తెలుసుకొని అప్పటినుంచి ఆమె ఈ వ్రతాన్ని చేసింది.పాపరాశిని దూరం చేసుకొంది. షట్‌తిలా ఏకాదశి వ్రతం - తిలలను ఆరురకాలుగా ఈ ఏకాదశినాడు ఉపయోగించాలి. తెలకపిండితోఅంటే నువ్వుపిండితో స్నానం చేయడం, నువ్వులు దానం చేయడం, నువ్వులు కలిపిన నీటితో స్నానం చేయడం, మహావిష్ణువును నువ్వులతో పూజించడం, తిలా హోమం చేయడం, నువ్వుల నీళ్లను తాగడం, ఇలా చేయడం వల్ల పూర్వజన్మ పాపాలు నశిస్తాయి. ఇంకా మాఘమాసంలో ఆవుపేడను నేలకు అంటకుండా సేకరించి వాటిల్లో నువ్వులు కలిపి పిడకలు తయారు చేసి ఏకాదశినాడు 108 నువ్వులు కలిపిన ఆవుపేడతో చేసిన పిడకలతో హోమం చేసి, బ్రాహ్మణునికి ఉదకంతోకూడిన కడవనుదానం చేస్తే ఏకాదశి పుణ్యఫలం దక్కుతుంది. పాదరక్షలు, గొడుగు కూడా కావాల్సినవారికి దానం చేస్తే మహావిష్ణువు వారికే కష్టం రాకుండా కాపాడుతాడు.

ఇట్లా షట్‌తిలా ఏకాదశి వ్రతాన్ని ఆచరించిన వారికి విష్ణుసాయుజ్యం లభిస్తుంది.

- ఆర్.పురంధర్


దత్తోహం దత్తోహం

దత్తావతారుడు భక్తుల కోసం ఎన్నో అవతారాలను దాల్చాడు. వారికోరికలను ఈడేర్చాడు. ఆ దత్తావతారాల్లో మరికొన్ని ....

కాలాగ్ని శమనుడు: మార్గశిర పూర్ణి మ నాడు మృగశిరా నక్షత్రంలో పుట్టిన దత్తాత్రేయుడు కాలాగ్ని శమనుడుగా పేర్గాంచాడు.

యోగి జన వల్లభుడు: అత్రిఅనసూయల బిడ్డడైన దత్తాత్రేయుడిని సిద్ధ గంధర్వాదులు యోగిపుంగవులు కలసి దర్శనం చేసుకొని యోగి జనవల్లభునిగా కీర్తించారు.

శ్రీలీలా విశ్వంభరుడు: బాలదత్తుడు ఆశ్రమజీవులకు అనేకానేక లీలలను ప్రదర్శిస్తూ వారికి ఆనందానిచ్చేవాడు. వారికి ఒకసారి 100 ఏళ్ల సరస్సులో మునిగి ఉండి తర్వాత బాలదత్తునిగా దర్శనిమివ్వగా వారు శ్రీ లీలా విశ్వంభరునిగా ఆరాధించారు.



సిద్ధరాజు : సిద్ధులు ఒకసారి తమ శక్తియుక్తులను చూసుకొని గర్వాన్ని పొందారు.వారి గర్వాన్ని అణచడానికి అత్రి కుమారుడు వారి దగ్గరకు సిద్ధరాజుగా వచ్చి వారిలో నిజజ్ఞానాగ్ని ని మేల్కొపాడు. దాని వల్ల సిద్ధులంతా అత్రికుమారుడిని సిద్ధరాజుగా ఆరాధించారు.

జ్ఞాన సాగరుడు: అజ్ఞానం వల్లనే జీవులంతా నాశనమౌదున్నారని వారి అజ్ఞానాన్ని రూపుమాపాలని అనసూయ కుమారుడు తలిచాడు. అందుకే ఫాల్గుణ శుద్ధ దశమి నాడు జ్ఞానసాగరుడుగా అవతరించి జ్ఞాన బోధ చేశాడు.

విశ్వంభరావదూత: ఒకసారి సిద్ధులకుకూడా వ్యాపకాలు ఎక్కువై వారికి మనోనిశ్చలత కలుగకుండా ఉన్నప్పుడు వారంతా దత్తాత్రేయులను రక్షించమని కోరితే వారి కోరిక తీర్చడానికి విశ్వంభరావధూతగా దర్శనమిచ్చారు.

మాయా యుక్తావధూత: వైశాఖ శుద్ధ చతుర్దశినాడు భిక్షుకవేషంలో దత్తుడు దర్శనం ఇచ్చాడు. దీన్ని గుర్తించలేనివారికి జ్ఞానోదయం కలిగించడానికై కుక్కల చేత వేదాలను షట్శాస్త్రాలను వల్లె వేయించాడు.

ముక్తావధూత : ఒకసారి కార్తవీర్యార్జుని చేత మాయాముక్తావధూతగా పూజలందుకుని కార్తవీర్యార్జునునికి జ్ఞానబోధ కలిగించాడు.


ఆదిగురువు: ఒకసారి అల్కరునికి ఆషాఢపూర్ణిమ నాడు ఆది గురువుగా దర్శనం ఇచ్చాడు. అల్కరుని తల్లి మదాలస మాట ప్రకారం ముముక్షువుగా ఉన్న అల్కరునికి ఆదిగురువుగా దర్శనమిచ్చి ఆత్మజ్ఞానాన్ని బోధించాడు.

శివస్వరూపుడు: పింగళనాగుడనే విప్రుడు దత్తుడిని శివస్వరూపంగా దర్శనమివ్వమని అడిగినందున శ్రావణ శుద్ధ అష్టమినాడు శివస్వరూపుడై దత్తుడు దర్శనమిచ్చాడు.

శ్రీ దేవదేవ: అమలక వృక్షం కింద ధ్యానస్థుడైన దత్తునికే శంఖచక్రగదాహస్తుడైన దత్త ప్రభువు దర్శనమిచ్చాడు.

దిగంబరుడు:సోమవంశజుడైన యదుమహారాజు కోరిక ప్రకారం దత్తుడే దిగంబరుడై దర్శనమిచ్చి జ్ఞానం కోరే ఆ మహారాజు తాను 24 మంది గురువుల దగ్గర నుంచి జ్ఞానామృతాన్ని గ్రోలానని చెప్పారు.

శ్రీకృష్ణ శ్యామకమలనయనుడు : దత్తుని భక్తులంతా గురు దర్శనం కోరినప్పుడు దత్తుడు కృష్ణ శ్యామలవర్ణంతో కమలనయనములతో జ్ఞాన తల్పంమీద విశ్రమించి మరీ దర్శనం ఇచ్చాడు. ఇలా దత్తస్వామి 16 అవతారాల్లో భక్తుల కోరికలను తీర్చేవానిగా కీర్తించబడుతున్నాడు.



అత్యుత్సాహం.. అశనిపాతం

దేవహూతి కర్దములు ఒకసారి తమకు పుత్రుడు కావాలని కోరుకున్నారు. మహావిష్ణువే తమకు సంతానంగా వస్తే బాగుంటుందనుకొన్నారు. మహావిష్ణువు తమకు కుమారుడిగా పుట్టాలని వారిద్దరూ తపస్సు ఆరంభించారు. వారి తపస్సుకు మెచ్చి మహావిష్ణువు వారికి కపిలునిగా జన్మించారు. ఆయన పుట్టుకతోడనే మహాజ్ఞాని. కపిలుడే తన తల్లికి జ్ఞానబోధ చేశారు.

ఒకసారి కపిలుడు దీర్ఘతపస్సు చేసుకొన్నాడు. అక్కడి సగరుని కుమారులు తమ తండ్రి యాగాశ్వాన్ని వెతుకుతూ వచ్చారు.వారికి కపిలుని వెనుక వారి యాగాశ్వం కనిపించింది.వారి పొరపాటున ఇదిగోఈ దొంగసాధువే మన యాగాశ్వాన్ని దొంగలించుకుని వచ్చి ఇక్కడ ముక్కుమూసుకొని తపస్సు చేస్తున్నట్టు నటిస్తున్నాడని అన్నారు. వెంటనే అత్యుత్సాహంతో కపిలునిమీదకు వెళ్లారు. సగర పుత్రుల రణగొణ ధ్వనికి కపిలుని ధ్యానభంగం కలిగింది. ఆయన కనులు తెరిచి వీరిని చూచి ఒక్క హుంకారం చేశారు. వారంతా ఆ హుంకారానికి మాడి మసైపోయారు. ఆ తర్వాత సగరుని మనుమడు శివుని మెప్పించి ఆకాశ గంగను నేలమీదకు తీసుకొని వచ్చినపుడు ఆ భస్మరాశులుగా ఉన్న సగరుని పుత్రులు పునీతులై స్వర్గానికి చేరుకొన్నారు. మాఘ పూర్ణిమ నాడు కపిలునికథామృతం ఆస్వాదించినవారికి పాపరాశి నశిస్తుంది.

- సుశీల

జీవనపాఠం

ప్రసాదం

- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

రామాయణ, భారత, భాగవతాలు జాతి సంపదలు. యావత్ జాతికి దిశానిర్దేశం చేసే మార్గదర్శకాలు. మనిషి ఏ రకంగా జీవించాలి, ఏ రకంగా జీవించకూడదో, జీవితాన్ని ఏ రకంగా మలచుకోవాలో, జీవితంలో ఎలా మసలుకోవాలో, జీవితాలను ఏ రకంగా తీర్చిదిద్దుకోవాలో అనే విషయాల్ని విపులంగా సోదాహరణంగా వివరిస్తాయి. జాతిని జాగృతపరుస్తాయి.

ప్రతి ఘటనలోను, సంఘటనలోను పాత్రలోను సన్నివేశంలోను ఉత్కృష్టమైన విలువల్ని మనకు వెలువరిస్తాయి. విశదీకరిస్తాయి. మార్గదర్శనం చేస్తాయి.

మనకి తెలిసిందే నిజం, మనం చూస్తున్నది, మనం అనుభవిస్తున్నదే సత్యం అనే అభిప్రాయంతో మనం ఉంటాం. ఆ భ్రాంతిలోనే అందరూ ఉండాలని ఇతరులతో వాదనకి దిగుతాం, వాదులాడుతాం.

కొత్తగా పెళ్ళైన ఓ జంట హనీమూన్‌కని రైల్వే స్టేషన్‌కి వచ్చేరు. ప్లాట్‌ఫాం వచ్చీపోయే వాళ్ళతో కిటకిటలాడుతోంది. ఆ రద్దీలోను అనువైన ఓ ప్రదేశాన్ని ఎంచుకుని అక్కడ కూర్చున్నారు ఆ జంట. అచ్చట్లు ముచ్చట్లతో.. ఆటలతో, పాటలతో ఆనందంతో తేలిపోతున్నారు. వాళ్లిద్దరికీ పదడుగుల దూరంలో ఓ సిమెంట్ బెంచీమీద ఓ పెద్దాయన కూచుని ఉన్నాడు. ఏ విషయం పట్టకుండా, పట్టించుకోకుండా, ఏదో పుస్తకాన్ని చదువుకుంటున్నాడు. ఆ పెద్దాయనని జంటలోని కుర్రాడు చూచేడు. చాలా సమయం ఆయన్ని అలా గమనించేడు, గమనిస్తున్నాడు. ఆ కుర్రాడికి ఆయనమీద చిరాకేసింది. చిర్రెత్తింది. ఆ పెద్దాయన దగ్గరికి వెళ్లి ''ఏవండీ! ఇందాకట్నుంచి చూస్తున్నాను, ప్రక్కన ఏమి అవుతుందోననే ధ్యాస లేకుండా ఆ పుస్తకం చదవడంలోనే మునిగిపోయేరు. మీ చుట్టూ వున్న లోకం వేగంగా పరుగులు తీస్తున్నా మీకేం పట్టడం లేదు. ఆ త్రేతాయుగంలో ఎప్పుడో, అసలు జరిగిందో లేదో ఎవరికీ తెలుసండీ? ఆ పుక్కిటి పురాణం రామాయణం చదువుకుంటూ కాలాన్ని వృధా చేసుకుంటున్నారు. మీకిది భావ్యమేనా?'' అని పెద్దాయనని కుర్రాడు అడిగేడు.

పుస్తకం చదువుకుంటున్న పెద్దాయన ఒక్కసారి తలెత్తి కుర్రాడ్ని చూసి చిరునవ్వు నవ్వి మళ్లీ పుస్తకంలోకి జారిపోయేడు. మరో అరగంట గడిచింది. ఆ కుర్రాడు పెద్దాయన దగ్గరకు వెళ్లి ''అయ్యా! నేను ఇందాక అలా చెప్పిన తర్వాత కూడా మీరు ఏమీ పట్టనట్టు మీ చాదస్తంలోనే మీరున్నారు. ఆ పుస్తకం చదవటంలోనే మీరు మునిగిపోయేరు'' వ్యంగ్య ధోరణిలో పెద్దాయనను ఎత్తిపొడిచాడు. పెద్దాయన పుస్తకంమీంచి తన దృష్టిని ఒక్కసారి మరల్చి తలెత్తి ఆ కుర్రాడిని ఒక్క చూపు చూసేరు. చిరునవ్వు నవ్వి పుస్తకం చదువుకోవడం కొనసాగించేరు.

ఆ కుర్రాడు అలా వ్యంగ్యంగా చాలాసార్లు అడగటం, పెద్దాయన పుస్తకం అదేరకంగా చదువుకుంటూ ఉండటం.. అలా జరుగుతూనే వుంది. రావలసిన రైలు వచ్చింది. ఎక్కేవాళ్ళు దిగేవాళ్ళు తోపులాటలు, పెనుగులాటలు, కుదుపులతో ఎక్కగలిగినవాళ్లు ఆ రైలు ఎక్కేరు. కొందరు ఆ తోపులాటలో ఫ్లాట్‌ఫాంమీదే ఉండిపోయేరు.

ట్రైన్ కదలడం, వేగం పుంజుకోవడం క్షణాల్లో జరిగిపోయింది. కంపార్ట్‌మెంట్ కిటకిటలాడిపోతోంది. అంతలో.. ఏవండీ! నా వైఫ్ రద్దీలో రైలు ఎక్కలేకపోయిందండి. ఫ్లాట్‌ఫాంమీదే ఉండిపోయినట్టుంది. ట్రైన్‌లో లేదు. అసలే ఆమెకు ఈ ఊరు కొత్తండి'' లబోదిబోమని ఏడుస్తున్నాడు హనీమూన్‌కి బయలుదేరిన జంటలోని కుర్రాడు పక్కనున్న ఆసామితో. ఆ ఆసామీ ఎవరో కాదు, ఫ్లాట్‌ఫాంమీద రామాయణం పుస్తకం చదువుకుంటూ ఈ కుర్రాడి చేత హేళన చేయబడ్డ పెద్దాయనే ఆ ఆసామి.

కుర్రాడి గోలంతా పెద్దాయన విన్నారు. మొదటిసారిగా పెదవి విప్పేరు. ''చూడు నాయనా! నువ్వు కూడా నాలా రామాయణం చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, నువ్వు ఈరోజు ఇలా ఏడవవలసిన దుస్థితి నీకు వచ్చి ఉండేది కాదు కదా'' అన్నారు పెద్దాయన.

ఏమీ అర్థంకాక తెల్లమొఖం వేసుకుని వింటున్నాడు కుర్రాడు.

''అవును నాయనా! రామాయణంలో సీతా లక్ష్మణ సమేతుడై శ్రీరాముడు అయోధ్య వదలి అరణ్యానికి వెళ్తున్నపుడు, మధ్యలో నదిని దాటవలసి వస్తుంది. గుహుడు పడవలో నదిని దాటిస్తాడు. ఆ సన్నివేశంలో- పడవ సీతమ్మ ఎక్కిన తర్వాత శ్రీరాముడు ఎక్కుతాడయ్యా.

రామాయణం నువ్వు చదివి ఉంటే ఆ సత్యం, ఆ సందేశం నీకు అర్థం అయి ఉండేది. జీవితపాఠం, జీవన విధానం నీకు అర్థమయ్యేది. జీవితంలో ఈ రకంగా చేయాలని తెలిసేది. ఫలితంగా.. ఈ రోజు నువ్వు మీ ఆవిడ రైలు ఎక్కిన తర్వాతనే నువ్వు ఎక్కాలని తెలిసి, మీ ఆవిడ రైలెక్కిన తర్వాతే నువ్వు రైలు ఎక్కేవాడివి. నీకీ దుస్థితి తప్పేది'' చెప్పటం పూర్తిచేశాడు పెద్దాయన. ఆ కుర్రాడికి జీవనపాఠం తెలిసింది. రామాయణ, భారత, భాగవతాల విశిష్ఠత అనుభవానికొచ్చింది, అర్థం అయ్యింది.

ధార్మిక, పౌరాణిక, ఆచార, ఆధ్యాత్మికపరమైన సందేహాలపై ప్రశ్నలు అడగవచ్చు. వాటికి త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యముగారు సమాధానాలను ధ ర్మభూమి శీర్షికలో ఇస్తారు. ఈ కింది కూపన్‌లో రాసిన ప్రశ్నలకు మాత్రమే సమాధాన మిస్తారు. కనుక మీరు వెంటనే మీ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఈ కూపన్ నింపి మాకు పంపండి.

ధర్మసందేహాలు

పేరు:..

ఊరు:..

చిరునామా:..

ప్రశ్న:..

ప్రశ్నలు పంపాల్సిన చిరునామా :

ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక,
36, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్-500 003

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

12 ఆంధ్రభూమి శనివారం, 10 ఫిబ్రవరి 2018





ఎన్టీఆర్ కోసం అన్ని గెటప్పులా?

మహానటుడు నందమూరి తారకరామారావు జీవిత కథతో తెరకెక్కనున్న ఎన్‌టిఆర్ చిత్రం కోసం సన్నాహాలు జోరందుకున్నాయి. ఆయన తనయుడు నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా తేజ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం దానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బాలకృష్ణ 103వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ చిత్రం కోసం హాలీవుడ్ టెక్నీషియన్లను రంగంలోకి దింపుతున్నారు. మరోవైపు పలువురు ప్రముఖ నటీనటులు, టెక్నీషియన్లతో క్రేజీ ప్రాజెక్టుగా తెరకెక్కనున్నదట. ముఖ్యంగా ఎన్‌టిఆర్ పాత్ర కోసం బాలకృష్ణ అరవైకి పైగా గెటప్‌లలో కన్పిస్తాడట. ఎన్‌టిఆర్ అంటే రాముడు, కృష్ణుడు, దుర్యోధనుడు, కర్ణుడు, విశ్వామిత్రుడు లాంటి గెటప్‌లలో ఆయన కన్పించారు. ఇప్పుడు ఆ పాత్రలన్నీ తెరపై ప్రత్యక్షమవుతాయట. దానికోసం పలువురు మేకప్ నిపుణులను రప్పిస్తున్నారు. ఎన్‌టిఆర్ జీవితంలోని కీలక సన్నివేశాలతో తెరకెక్కే ఈ చిత్రాన్ని రెండున్నర గంటల్లో చెప్పడం అసాధ్యమైనప్పటికీ ఆ సమయంలోనే వీలైనంత సమాచారాన్ని అందించాలని స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. ప్రస్తుతం తేజ వెంకటేష్‌తో ఓ సినిమాకు కమిట్ అయిన విషయం తెలిసిందే. ఈ నెల మూడవ వారంలో ఈ చిత్రం సెట్స్‌పైకి రానుంది. ఏప్రిల్ వరకు ఈ చిత్రాన్ని పూర్తిచేసి ఎన్‌టిఆర్ సినిమాను మే, జూన్‌లలో సెట్స్‌పైకి తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్ సర్వత్రా ఆసక్తిని నింపింది.

విషయం వుంది కాబట్టే సినిమా తీశా!

- దర్శకురాలు మంజుల



సందీప్‌కిషన్, అమైదా దస్తూర్, త్రిధా చౌదరి హీరో హీరోయిన్లుగా మంజుల ఘట్టమనేని దర్శకత్వంలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ బ్యానర్లపై పి.కిరణ్, సంజయ్ స్వరూప్ నిర్మించిన 'మనసుకు నచ్చింది' చిత్రంలోని పాటలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఈ చిత్రంలోని పాటలను జర్నలిస్టులు విడుదల చేశారు. అనంతరం దర్శకురాలు మంజుల మాట్లాడుతూ- నేను ఇండస్ట్రీలోనే పుట్టాను. ఇండస్ట్రీ మనిషిని. ఎంతోమంది దర్శకనిర్మాతలను చూశాను. ఎన్నో సినిమాలు చూస్తూ పెరిగాను. అలాంటి నేను ఏదో ఒక సినిమా చేయాలని ఈ చిత్రాన్ని తీయలేదు. అలాంటి అవసరం నాకు లేదు. ఈ సినిమా తీశానంటే ఖచ్చితంగా ఏదో ఒక విషయం వుంటుంది. మంచి సినిమా అవుతుంది. నేను ఎందుకు సినిమా తీశానన్నది సినిమా చూస్తే అర్థమవుతుంది. ఇప్పటివరకూ ఎన్నో ప్రేమకథలు చూశారు. అలాంటి కథల్లో ఇది ఒక మంచి సినిమా అవుతుంది. మా పాప జాన్వి కూడా ఓ పాత్ర పోషించింది. సందీప్, అమైరాలు అద్భుతంగా నటించారు. నిర్మాత కూడా ఎంతో సపోర్టు అందించారు. నేను డైరెక్షన్ చేశానంటే మహేష్ ఇప్పటికీ నమ్మడు. పాటలు, ట్రైలర్ చూసి ఇంప్రెస్ అయ్యాడు. అలాగే పవన్‌కళ్యాణ్‌తో సినిమా చేయడానికి నాదగ్గర ఒక అద్భుతమైన కథ వుంది. ఆయన వింటే తప్పకుండా చేస్తారు అన్నారు. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ- ఫన్ అండ్ స్వీట్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మంచి కాఫీ లాంటి సినిమా ఇది. యూత్‌తోపాటు ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రం అన్నారు.

ఒక్క క్షణం దర్శకుడితో!

ప్రస్తుతం నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా చిత్రంలో నటిస్తున్నాడు అల్లు అర్జున్. మిలటరీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రచయిత వక్కంతం వంశి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ ఇంపాక్ట్ ఒక్క రోజులో కోటి వ్యూస్ దాటి సంచలనం రేపింది. తాజాగా మలయాళంలో కూడా విడుదలైన ఈ టీజర్‌కు అదే స్థాయిలో రెస్పాన్స్ దక్కడం విశేషం. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా తరువాత అల్లు అర్జున్ నటించే తదుపరి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయని తెలిసింది. అల్లు శిరీష్‌తో ఒక్కక్షణం చిత్రంతో మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు వి.ఐ.ఆనంద్. ప్రస్తుతం అల్లు అర్జున్ కోసం ఓ కథను సిద్ధం చేశాడని, ఆ కథను ఆయనకు వినిపించే పనిలో పడ్డాడు. ఇప్పటికే ఆనంద్ చెప్పిన లైన్ నచ్చడంతో అల్లు అర్జున్ ప్రొసీడ్ అవ్వమని చెప్పాడట. దాంతో స్క్రిప్ట్ విషయంలో బిజీగా మారాడు దర్శకుడు. త్వరలోనే వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ చిత్రం రానుందని సమాచారం.

కొత్తగా ఎందుకు చేయకూడదు!

వరుణ్ తేజ్

మెగా వారసత్వంగా తెలుగు తెరకు పరిచయమైనప్పటికీ మొదటినుంచీ తనదైన ముద్రను చాటుకుంటూ భిన్నమైన కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నాడు వరుణ్ తేజ్. మెగాస్టార్ ప్రభావం లేకుండా కమర్షియల్ హీరోయిజానికి దూరంగా కథలకే ప్రాముఖ్యత ఇస్తూ దూసుకుపోతున్నాడు. ఆయన తాజాగా తొలిప్రేమతో ముందుకు వస్తున్నాడు. కొత్త దర్శకుడు వెంకి అట్లూరి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై భోగవల్లి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం శనివారం విడుదలవుతున్న సందర్భంగా వరుణ్‌తేజ్ చెప్పిన విశేషాలు..



నా తొలిప్రేమ..

నా ఫస్ట్‌లవ్ స్కూల్ డేస్‌లో జరిగింది.?

ఫస్ట్ లవ్..

ఫస్ట్ లవ్ అనేది ప్రతి మనిషి జీవితంలో ఉంటుంది. ఇందులో దాన్నే చర్చించాం. నా లైఫ్‌లో జరిగిన మొదటి ప్రేమను మూడు దశల్లో చూపించడం జరిగింది. మూడు దశలు అనగానే ప్రేమమ్ సినిమా గుర్తొకు వస్తుందేమో! దానికీ దీనికీ సంబంధం లేదు. అందులో హీరోకు మూడు దశల్లో ముగ్గురు అమ్మాయిలు మారుతారు. కానీ ఇందులో మొదటినుంచీ ఒక మ్మాయితో జరిగే ప్రయాణమే ఈ చిత్రం!

పోలిక లేదు

నిజానికి ఈ సినిమా 70 శాతం పూర్తయ్యాకే ఈ టైటిల్ పెట్టాం. మొదట్లో ఏ టైటిల్ పెడదామని ఆలోచించి చివరికి ఈ టైటిల్ పెట్టాం. తొలిప్రేమ అనగానే బాబాయ్ సినిమాకు కనెక్ట్ అవుతారు. నిజానికి ఆ సినిమాకూ ఈ సినిమాకూ ఎలాంటి పోలికలు ఉండవు. ప్రస్తుత జనరేషన్‌లో ఫస్ట్‌లవ్ ఎలా వుంది అన్నదే ఈ సినిమా.

నా పాత్ర..

ఇందులో నా పాత్ర అగ్రసివ్‌గా వుంటూ తను ఏది చేసినా కరెక్టే అనే ధోరణిలో సాగుతుంది. ఆ తరువాత పాత్రలో మెచ్యూరిటీ లెవల్స్ కన్పిస్తాయి. నాకు బాగా నచ్చింది!

రాశీ కూడా..

ఇందులో రాశి పాత్ర కూడా మూడు స్థాయిల్లో సాగుతుంది. దానికోసం తను చాలా కష్టపడింది. నిజానికి లవ్‌స్టోరీ అనగానే కొత్త హీరోయిన్ కోసం అన్వేషిస్తారు. అలా కాకుండా క్రేజ్ వున్న అమ్మాయి అయితే బాగుంటుందని ఇద్దరి ముగ్గురు పేర్లు అనుకున్నాక రాశిని ఓకె చేశాం. తను ఊహలు గుసగుసలాడేలో అద్భుతంగా చేసింది. ఆ తరువాత ఈ సినిమాలో కూడా తనకు మంచి పేరొస్తుంది.

క్లారిటీ వుంది..

దర్శకుడు వెంకి కొత్తవాడైనా నాకు చాలాకాలంగా పరిచయం. తనకు కథలపై మంచి పట్టు వుంది. ఇదివరకే చెల్లి నిహారిక తీసిన ముద్దపప్పు ఆవకాయ వెబ్ సీరీస్‌కు తను సపోర్టు అందించాడు. అప్పటినుంచి నాకు ఒక కథ చెప్పాలని ట్రై చేస్తున్నాడు. ఈ కథ చెప్పగానే బాగా నచ్చింది. దర్శకుడిగా కూడా అద్భుతంగా చేశాడు. అలాగే నిర్మాత ప్రసాద్, బాపినీడు ఇద్దరూ ప్రతి విషయాన్ని దగ్గరుండి మరీ చూసుకున్నారు కాబట్టే సినిమా ఇంత బాగా వచ్చింది.

కొత్తగా చేయాలనే..

చిన్నప్పటినుంచి సినిమా వాతావరణంలో పెరిగాను. నాకు సినిమా అంటే ఇష్టం. శుక్రవారం వచ్చిందంటే సినిమా చూడాల్సిందే. ప్రపంచ స్థాయిలో వున్న అన్ని సినిమాలూ చూశం. మనం ఎందుకు హాలీవుడ్ తరహాలో కొత్త కొత్త ప్రయోగాలు చేయకూడదు అనిపించింది. ఆ ఆలోచనతోనే భిన్నంగా ట్రై చేయాలని ఇలా కొత్త కథలతో వెళుతున్నా.

తదుపరి చిత్రాలు..

ప్రస్తుతం ఘాజి దర్శకుడు సంకల్ప్‌రెడ్డితో ఓ స్పేస్ చిత్రం చేస్తున్నాను. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలుగులో వస్తున్న మొదటి స్పేస్ చిత్రం ఇది. శ్రీహరికోట నేపథ్యంలో ఉంటుంది. దాంతోపాటు అనిల్ రావిపూడి కూడా ఓ లైన్ చెప్పాడు. ఇంకా కన్‌ఫర్మ్ చేయలేదు.

- శ్రీ

16న గోలీసోడా



మానస్, నిత్యా నరేష్ జంటగా మల్లూరి హరిబాబు దర్శకత్వంలో యస్.బి.ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై భువనగిరి సత్య సింధుజ నిర్మించిన 'సోడా గోలీసోడా' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఈనెల 16న విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్మాత సత్యసింధుజ వివరాలు తెలియజేస్తూ- పూర్తిస్థాయి వినోదాత్మకంగా తెరకెక్కిన చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునే కమర్షియల్ అంశాలతో తెరకెక్కించాం. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించాడు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసిన ఈ చిత్రానికి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు జరిగాయి. క్లీన్ యు సర్టిఫికెట్ వచ్చింది అన్నారు.

పాటల్లో శీనుగాడి ప్రేమ



సుష్మా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై శ్రీనివాసరావు హీరోగా ప్రణవి, కావేరి, చాందిని హీరోయిన్లుగా ఆర్.కె. దర్శకత్వంలో రూపొందిన శీనుగాడి ప్రేమ చిత్రానికి సంబంధించిన పాటలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత ఆర్.కె.గౌడ్ సీడీలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- టీజర్, పాటలు బాగున్నాయి. కొత్తవారైనా నటీనటులు చక్కగా నటించారు. దర్శకుడు ఆర్.కె. అద్భుతంగా తెరకెక్కించాడు. కొత్తవారు పరిశ్రమకు వస్తేనే మరింత మనుగడ వుంటుంది. తప్పకుండా ఈ సినిమా మంచి విజయం సాధించాలి అన్నారు. దర్శకుడు వీరశంకర్ మాట్లాడుతూ- మంచి టైటిల్ పెట్టారు. మంచి కథ, కథనాలతో సినిమా చేస్తే తప్పకుండా విజయం సాధిస్తుంది అన్నారు. సంగీత దర్శకుడు రమణ మాట్లాడుతూ- ఈ చిత్రానికి అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. హీరో, నిర్మాత శ్రీనివాసరావు మాట్లాడుతూ- నటన అంటే నాకు చాలా ఇష్టం. ఆర్.కె. నాతో కలిసి మంచి కథ చెప్పాడు. కథ బాగా నచ్చడంతో సినిమా మొదలుపెట్టాం. నేనే నటిస్తూ నిర్మిస్తున్న చిత్రమిది. రమణ సాకే అద్భుతమైన సంగీతాన్ని ఇచ్చాడు. టీమ్ ఇచ్చిన సహకారం మరువలేనిది. షూటింగ్ పూర్తయింది. త్వరలోనే విడుదల చేస్తామన్నారు. దర్శకుడు ఆర్.కె మాట్లాడుతూ- శీను అనే పేరు దాదాపుగా ప్రతీ ఇంట్లో ఉంటుంది. ఈ కథ కూడా అందరికీ కనెక్ట్ అయ్యేలా రూపొందించాం. లవ్, కామెడీ, ఎమోషన్‌లతో నిండిన ఈ కథను తప్పకుండా ఆదరిస్తారు అన్నారు.



సమంత

అదరగొట్టిన రామలచ్చిమి!

ప్రస్తుతం టాలీవుడ్‌లో రామలక్ష్మికి సంబంధించిన టీజర్ వైరల్ అవుతోంది. రామలక్ష్మిగా గ్లామర్ భామ సమంత ఆకట్టుకుంటోంది. అచ్చమైన పల్లెటూరి పడుచుగా సమంత కొత్తగా కనిపిస్తూ షాక్ ఇచ్చింది. ఆ వివరాల్లోకి వెళితే.. మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్, సుకుమార్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న రంగస్థలం చిత్రంలో సమంత హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. సమంత పాత్రకు సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. రామ్‌చరణ్ వాయిస్‌ఓవర్‌తో రామలక్ష్మి అలియాస్ సమంత నటన హైలెట్ అయింది. ఇన్నాళ్ళూ చూసిన సమంతేనా అంటూ నోరెళ్లబెడుతున్నారు జనాలు. 1985 నేపథ్యంలో రంగస్థలం అనే ఊరిలో జరిగిన కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ఆదివారంతో పూర్తికానుంది. ఇప్పటికే భారీ అంచనాలు పెంచేసిన ఈ చిత్రాన్ని మార్చి 30న విడుదల చేస్తున్నారు.